www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 10-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 313 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి రా. 12.47 తదుపరి విదియ; నక్షత్రం:ధనిష్ఠ రా. 8.35 తదుపరి శతభిషం; వర్జ్యం: రా.2.54-4.18; దుర్ముహూర్తం: ఉ.6.49-8.20; అమృతఘడియలు: ఉ.11.26-12.51; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.11 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

యాసంగి పంట ఎండిపోతోంది

12

- డెడ్ స్టోరేజీకి చేరువలో సాగర్
- నల్లగొండలో అడుగంటిన జలాలు
- ప్రశ్నార్థకంగా 3 లక్షల ఎకరాల పైర్లు
- మూగజీవాలకూ తాగునీటి గండం
- పంటలను దక్కించుకుంటాం..
- చెరువులనైనా నింపండి: రైతులు


నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో నీరు లేని తీగల చెరువు

ఉత్తరాఖండ్‌లో హింస

ఆరుగురి మృతి


హల్ద్వానీలో ఘర్షణల్లో గాయపడ్డ పోలీసులను పరామర్శిస్తున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి

- పోలీసులకు గాయాలు.. వాహనాలు, ఠాణాకు నిప్పు
- అక్రమంగా నిర్మించిన మదర్సా కూల్చివేతతో ఘర్షణ
- హల్ద్వానీలో కర్ఫ్యూ.. ఆ రాష్ట్రమంతా హై అలర్ట్

8

పదండి.. మీకో పనిష్మెంట్..!

- ఎంపీలతో ప్రధాని మోదీ సరదా వ్యాఖ్యలు
- 8 మందికి ప్రత్యేక విందు
- వీరిలో టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు
- మధ్యాహ్నం వేళ సమాచారం
- అంతా పార్లమెంట్ క్యాంటీన్‌కు
- కలసి శాకాహార భోజనం, రాగి లడ్డూలు తిన్న ప్రధాని


టీడీపీ సభ్యుడు రామ్మోహన్‌నాయుడు సహా ఎంపీలతో విందులో మోదీ

స్పోర్ట్స్

తన్మయ్, తిలక్ సెంచరీలు

హైదరాబాద్ 383/5

హైదరాబాద్: ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (164), కెప్టెన్ తిలక్ వర్మ (101) శతక్కొట్టడంతో నాగాలాండ్‌తో రంజీ ప్లేట్ గ్రూప్ సెమీఫైనల్లో హైదరాబాద్ భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. శుక్రవారం ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ మొదటి ఇన్నింగ్స్‌లో తొలిరోజు ఆఖరికి ఐదు వికెట్లకు 383 పరుగులు చేసింది. రోహిత్ రాయుడు (59)తో కలిసి రెండో వికెట్‌కు 143 పరుగులు జోడించిన తన్మయ్..తిలక్ వర్మతో కలిసి మూడో వికెట్‌కు 155 పరుగులు జత చేశాడు. జొనాథన్ (2/88) రెండు వికెట్లు పడగొట్టాడు.



నిస్సాంక రికార్డు 'డబుల్'

- శ్రీలంక విజయం
- ఒమర్జాయ్, నబీ శతకాలు వృథా
- అఫ్ఘానిస్థాన్‌తో తొలి వన్డే


పల్లెకెలె: శ్రీలంక ఓపెనర్ పథుమ్ నిస్సాంక (139 బంతుల్లో 20 ఫోర్లు, 8 సిక్సర్లతో 210 నాటౌట్) చరిత్ర సృష్టించాడు. తమ దిగ్గజ క్రికెటర్లకు సాధ్యంకాని ఆటతీరుతో వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన తొలి శ్రీలంక బ్యాటర్‌గా నిలిచాడు. గతంలో జయసూర్య 189 పరుగులే లంక తరఫున అత్యధికం. ఓవరాల్‌గా ప్రపంచ క్రికెట్‌లో డబుల్ సాధించిన 13వ బ్యాటర్. అటు నిస్సాంక అజేయ ఆటతీరుతో అఫ్ఘానిస్థాన్‌తో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో లంక 42 రన్స్ తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు 50 ఓవర్లలో 3 వికెట్లకు 381 పరుగులు చేసింది. అఫ్ఘాన్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చూపిన నిస్సాంక తొలి వికెట్‌కు అవిష్క ఫెర్నాండో (88)తో కలిసి 182 పరుగులు, సమరవిక్రమ (45)తో మూడో వికెట్‌కు 71 బంతుల్లోనే 120 రన్స్ జత చేయడం విశేషం. ఆఖరి నాలుగు ఓవర్లలో నిస్సాంక ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లు బాది 55 పరుగులు రాబట్టడంతో జట్టు భారీ స్కోరు అందుకుంది.

అఫ్ఘాన్ పోరాటం: 382 పరుగుల భారీ ఛేదనలో అఫ్ఘాన్ జట్టు గట్టిగానే పోరాడింది. 55/5 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును అజ్మతుల్లా ఒమర్జాయ్ (149 నాటౌట్), మహ్మద్ నబీ (136) శతకాలతో గట్టెక్కించే ప్రయత్నం చేశారు. అయితే విగతా బ్యాటర్లు విఫలమవడంతో చివరకు 50 ఓవర్లలో 6 వికెట్లకు 339 పరుగులు చేసి ఓడింది. ఆరో వికెట్‌కు నబీ, ఒమర్జాయ్ రికార్డు స్థాయిలో 242 పరుగులు జత చేశారు. మదుషన్‌కు నాలుగు వికెట్లు దక్కాయి.

3 వన్డేల్లో మూడో ఫాస్టెస్ట్ (136 బంతుల్లో) డబుల్ సెంచరీ చేసిన నిస్సాంక. టాప్-2లో ఇషాన్ (126 బంతుల్లో), మ్యాక్స్‌వెల్ (128 బంతుల్లో) ఉన్నారు.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 50 ఓవర్లలో 381/3 (నిస్సాంక 210 నాటౌట్, ఫెర్నాండో 88, సమరవిక్రమ 45; ఫరీద్ 2/79).
అఫ్ఘానిస్థాన్: 50 ఓవర్లలో 339/6 (ఒమర్జాయ్ 149 నాటౌట్, నబీ 136; మదుషన్ 4/75, చమీర 2/55).



ఆమె వల్లే గొడవలు..

కొడుకుతో సంబంధాల్లేవు

కోడలిపై జడేజా తండ్రి అనిరుధ్ ఆరోపణ

జామ్‌నగర్: భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కుటుంబంలో విబేధాలు బయటపడ్డాయి. జడ్డూతో ప్రస్తుతం తమకెలాంటి సంబంధాలు లేవని, దీనికి అతడి భార్య రివాబానే కారణమంటూ తండ్రి అనిరుధ్ సింహ్ జడేజా ఆరోపించాడు. 'జడేజా భార్య రివాబా ఏం మాయ చేసిందో కానీ, పెళ్లైన 2-3 నెలలకే గొడవలు మొదలయ్యాయి. మేమంతా జామ్‌నగర్‌లోనే ఉంటున్నా వారు నన్ను పిలవరు, నేనూ వారిని పిలవను. ఆస్తులన్నీ ఆమె పేరిటే రాయించుకుంది. అంతా ఆమె సోదరులదే రాజ్యం. నా కుమారుడిని క్రికెటర్‌గా తయారుచేసేందుకు ఎంతో కష్టపడ్డా. భుజాన 20 లీటర్ల పాల క్యాన్లను మోసుకుంటూ డబ్బులు సంపాదించా. అతడి చెల్లి కూడా తల్లిలాగా సేవలందించింది. ఆమెతోనూ జడేజాకు సంబంధాలు లేవు. ఐదేళ్లుగా మా మనవరాలిని కూడా చూడలేదు. అసలు తను క్రికెటర్ కాకపోయుంటే బావుండేదని అనిపిస్తుంటుంది' అని ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనిరుధ్ వాపోయాడు. కాగా, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో జామ్‌నగర్ నార్త్ నియోజకవర్గం నుంచి రివాబా బీజేపీ ఎమ్మెల్యేగా గెలుపొందింది.



కట్టుకథలు: జడేజా

తన భార్యపై తండ్రి అనిరుధ్ అనవసర ఆరోపణలు చేస్తున్నాడని, ఆమె గౌరవానికి భంగం కలిగించే చర్యలు తగవని జడేజా పేర్కొన్నాడు. ఈమేరకు అతను సోషల్ మీడియాలో స్పందించాడు. 'పత్రికలో మా నాన్న చేసిన ఆరోపణలన్నీ అవాస్తవం. అవన్నీ ఏకపక్ష కథనాలు. నా భార్య వ్యక్తిత్వాన్ని కించపర్చడాన్ని ఏమాత్రం సహించను. నేనూ చాలా విషయాలు చెప్పగలను. కానీ వాటిని బహిరంగంగా వెల్లడించడం సరికాదు' అని జడ్డూ తెలిపాడు.

విరాట్ విషయంలో తప్పు చేశా..


డివిలియర్స్



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో విరాట్ కోహ్లీ ఆడకపోవడానికి.. అతడి భార్య రెండో బిడ్డకు జన్మనివ్వబోతుండడమే కారణమని దక్షిణాఫ్రికా మాజీ బ్యాటర్ ఏబీ డివిలియర్స్ ఇటీవల తెలిపాడు. దీంతో ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడమే కాకుండా అన్ని వైపుల నుంచి అతడికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అయితే ఈ మధ్యకాలంలో ఏం జరిగిందో, ఏమో కానీ డివిలియర్స్ ఇప్పుడు మాట మార్చాడు. అసలు తనకేమీ తెలీదని చెప్పాడు. 'విరాట్ విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చి ఘోరమైన తప్పు చేశాను. అది నిజం కాదు. అతడి జీవితంలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కుటుంబ కారణాలతో తను బ్రేక్ తీసుకోవడం అతడి హక్కు' అని డివిలియర్స్ స్పష్టం చేశాడు.

నా కూతుర్ని కలవనివ్వడు

పేసర్ షమి ఆవేదన



న్యూఢిల్లీ: మహ్మద్ షమి..భారత ప్రధాన పేసర్లలో ఒకడు. వ్యక్తిగతంగా, ఆట పరంగా కొద్దికాలం కిందట తీవ్ర ఒడిదొడుకులకు లోనైన అతడు..వాటిని అధిగమించి టీమిండియాలో పునరాగమనం చేశాడు. ఇకపోతే ఒకనాటి చీర్ లీడర్, మోడల్ హసీనా జహాను కోరి మరీ 2014లో షమి పెళ్లి చేసుకున్నాడు. షమితో ఆమెకు రెండో వివాహం. మొదటి భర్తతో విడిపోయిన హసీన్‌కు అప్పటికే ఇద్దరు కూతుళ్లున్నారు. ఇక..షమి, హసీన్‌కు 2015లో కుమార్తె (ఐరా) పుట్టింది. కానీ షమి-జహా వైవాహిక బంధం ఎంతో కాలం సాగలేదు. తీవ్ర విభేదాలతో 2018లో షమితో విడిపోయిన ఆమె..అతడిపై తీవ్ర ఆరోపణలు చేయడంతోపాటు గృహహింస కేసు కూడా పెట్టింది. అయితే హసీన్ ఆరోపణలన్నీ నిరాధారమని అనంతరం తేలింది. కాగా.. హసీన్‌తో ఉంటున్న తన కూతురు ఐరాను ఎంతో మిస్సవుతున్నానని షమి వేదన చెందాడు. తనతో కూతురును మాట్లాడనివ్వడంలేదని వాపోయాడు. భార్యతో విడిపోయాక ఐరాను వ్యక్తిగతంగా కలవలేకపోయానని వెల్లడించాడు. 'కుటుంబాన్ని, పిల్లలను కోల్పోవాలని ఎవరూ కోరుకోరు. మన చేతుల్లోలేని పరిస్థితులు కొన్ని సందర్భాల్లో ఏర్పడుతుంటాయి. నా కూతురు ఎంతో మిస్సవుతున్నా. రక్తం పంచుకున్న బిడ్డను ఎవరైనా వదులుకుంటారా' అని ఓ ఇంటర్వ్యూలో 33 ఏళ్ల షమి అన్నాడు.

జాతీయ సైక్లింగ్‌లో తెలంగాణకు 2 కాంస్యాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ స్కూల్ గేమ్స్ సైక్లింగ్ పోటీల్లో తెలంగాణకు రెండు కాంస్య పతకాలు లభించాయి. రాంచీలో జరుగుతున్న ఈ పోటీల్లో శుక్రవారం ముగిసిన అండర్-19 బాలుర సైక్లింగ్ టీమ్ స్ప్రింట్ విభాగంలో అభిషేక్ రెడ్డి, సింహాచలం, వర్షిత్‌తో కూడిన తెలంగాణ బృందం కాంస్య పతకం దక్కించుకుంది. ఈ త్రయం నిమిషం 19 సెకన్లలో రేసును ముగించి తృతీయ స్థానంలో నిలిచింది. బాలుర అండర్-17 విభాగంలో తనిష్క్, సాత్విక్, చరణ్‌తో కూడిన తెలంగాణ జట్టు కాంస్యం సాధించింది.

వార్నర్ మెరుపులు

ఆసీస్ బోణీ



హోబర్ట్: వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌లో ఆస్ట్రేలియా బోణీ చేసింది. భారీ ఛేదనలో చివరి వరకు పోరాడిన విండీస్ 11 పరుగు తేడాతో ఓటమిపాలైంది. శుక్రవారం జరిగిన తొలి టీ20లో డేవిడ్ వార్నర్ (36 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్‌తో 70) మెరుపు బ్యాటింగ్‌తో ముందుగా ఆసీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 213 పరుగులు చేసింది. ఇన్‌గ్లిస్ (39), డేవిడ్ (37 నాటౌట్) రాణించారు. రస్సెల్‌కు మూడు, జోసె్‌ఫకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 202/8 స్కోరు చేసి ఓడింది. ఓపెనర్లు కింగ్ (53), చార్లెస్ (42) దూకుడైన ఆరంభం ఇవ్వగా, చివర్లో హోల్డర్ (34 నాటౌట్) ఆకట్టుకున్నాడు. జంపాకు 3, స్టొయినిస్‌కు 2 వికెట్లు లభించాయి. కాగా ఈ మ్యాచ్‌తో వార్నర్ ఆస్ట్రేలియా తరఫున మూడు ఫార్మాట్లలోనూ 100 మ్యాచ్‌లాడిన తొలి ఆటగాడిగా నిలిచాడు. అలాగే తన వందో టెస్టులో డబుల్ సెంచరీ, వందో వన్డేలో సెంచరీ, వందో టీ20లో అర్ధ సెంచరీ కొట్టి, ఈ అరుదైన ఫీట్ నమోదుచేసిన ఏకైక ఆటగాడిగా రికార్డు పుటల్లోకి ఎక్కాడు.

ఈ ఒలింపిక్స్‌తో ఆటకు గుడ్‌బై



కింగ్‌స్టన్: జమైకా స్ప్రింట్ క్వీన్, మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ షెల్లీ అన్‌ఫ్రేజర్ ప్రైస్ ఈ ఏడాది పారి‌స్‌లో జరిగే ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌కు గుడ్‌బై చెప్పనుంది. ఈ విషయాన్ని షెల్లీనే స్వయంగా వెల్లడించింది. దిగ్గజ స్ప్రింటర్లలో ఒకరిగా పేరు తెచ్చుకున్న 37 ఏళ్ల షెల్లీ.. 2008, 2012 ఒలింపిక్స్‌లో 100 మీటర్ల టైటిల్ గెలిచింది. 2020 టోక్యో విశ్వక్రీడల్లో రిలేలో స్వర్ణం నెగ్గిన ఆమె.. కెరీర్‌లో ఓవరాల్‌గా 10 ప్రపంచ టైటిళ్లను ఖాతాలో వేసుకుంది. ఇందులో మూడింటిని 2017లో బాబు పుట్టాక నెగ్గడం విశేషం.

14న ఖేలో ఇండియా సెంటర్లు ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ రాష్ట్రానికి కొత్తగా మంజూరైన 14 ఖేలో ఇండియా సెంటర్లు ఈనెల 14వ తేదీన ప్రారంభమవనున్నాయి. గతంలో 19 కేంద్రాలు ఉండగా, కొత్తగా మంజూరైన వాటితో కలిపి రాష్ట్రంలో ఖేలో ఇండియా సెంటర్ల సంఖ్య 33కు చేరింది. ఖేలో ఇండియా స్కీమ్ కింద ప్రతి సెంటర్‌కు తొలి ఏడాది రూ.10 లక్షల గ్రాంట్ ఇవ్వనుంది. ఇందులో రూ.5 లక్షలు ఆ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కాగా, నిర్వహణకు రూ.2 లక్షలు, కోచ్ జీతభత్యాలకు మరో రూ.3 లక్షలు కేటాయించనుంది. రెండో ఏడాది నుంచి ప్రతి ఏటా రూ. 5 లక్షల గ్రాంట్ అందించనుంది.

హాకీ అమ్మాయిల గెలుపు

భువనేశ్వర్: హాకీ ప్రొ లీగ్‌లో భారత మహిళల జట్టు సత్తా చాటింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో అమెరికాను 3-1తో చిత్తుచేసింది. భారత జట్టులో వెటరన్ స్టార్ వందనా కటారియా (9వ), దీపిక (26వ), సలీమా టెటె (56వ) తలో గోల్ చేశారు. అమెరికా తరఫున ఏకైక గోల్‌ను సానె కార్స్ (42వ) కొట్టింది. భారత్ తర్వాతి మ్యాచ్‌లో ఈనెల 12న చైనాతో తలపడనుంది.

ఫైనల్లో సాకేత్ X రిత్విక్

చెన్నై: తెలుగు ఆటగాళ్లు సాకేత్, రిత్విక్ చౌదరి చెన్నై ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ కోసం పరస్పరం పోటీపడనున్నారు. విశాఖపట్నానికి చెందిన సాకేత్ మైనేని, హైదరాబాద్ ఆటగాడు బొల్లిపల్లి రిత్విక్ చౌదరి వేర్వేరు భాగస్వాములతో కలిసి ఫైనల్‌కు చేరుకున్నారు. శుక్రవారం జరిగిన డబుల్స్ సెమీస్‌లో రామ్‌కుమార్‌తో కలిసి ఆడిన సాకేత్ 6-3, 6-2తో జపాన్ జోడీ తొషిహిడె-కైటో ఉసుగిపై గెలిచింది. మరో సెమీస్‌లో బొల్లిపల్లి రిత్విక్ చౌదరి-నికి పూనాచా జోడీ 6-3, 4-6, 10-7తో జర్మనీ జంట జాకబ్-మార్క్‌ను ఓడించి సాకేత్ ద్వయంతో టైటిల్‌ఫైట్‌కు సిద్ధమైంది. పురుషుల సింగిల్స్‌లో భారత టాప్ ఆటగాడు సుమిత్ నగల్ సెమీఫైనల్ చేరాడు. క్వార్టర్స్‌లో సుమిత్ 6-3, 6-3తో డొమినిక్ (చెక్ రిపబ్లిక్)ను చిత్తుచేశాడు.

అదానీ చేతికి ల్యాంకో అమర్‌కంటక్

దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా రూ.4,101 కోట్లకు కొనుగోలు

ముంబై: దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంలో ల్యాంకో అమర్‌కంటక్ పవర్ ప్రాజెక్టును అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ పవర్ రూ.4,101 కోట్లకు వేలంలో దక్కించుకుంది. బుధవారం జరిగిన ఈ వేలంలో మిగతా పోటీదారులైన రిలయన్స్ ఇండస్ట్రీస్, పీఎఫ్‌సీ కన్సార్షియం పాల్గొనకపోవడంతో అదానీ పవర్‌ను విన్నింగ్ బిడ్డర్‌గా ప్రకటించినట్లు తెలిసింది. ల్యాంకో అమర్‌కంటక్ ప్రాజెక్టు కొనుగోలుకు గతంలో అదానీ పవర్ దాఖలు చేసిన రూ.4,101 కోట్ల బిడ్‌నే రుణదాతల కమిటీ వేలానికి కనీస ధరగా నిర్ణయించింది. వేలంలో కౌంటర్ ఆఫర్.. బేస్ రేటు కంటే కనీసం రూ.50 కోట్లు అధికంగా ఉండాలని కమిటీ స్పష్టం చేసింది.

ల్యాంకో అమర్‌కంటక్ ప్రాజెక్టుపై 2019 సెప్టెంబరులో దివాలా పరిష్కార చర్యలు ప్రారంభమయ్యాయి. కానీ, పలు కారణాలతో ఈ ప్రక్రియ జాప్యమవుతూ వచ్చింది. 2022 జనవరిలో ఈ ప్రాజెక్టు కోసం వేదాంత గ్రూప్‌నకు చెందిన ట్విన్‌స్టార్ టెక్నాలజీస్ సమర్పించిన రూ.3,000 కోట్ల బిడ్‌ను చాలా తక్కువ ఆఫర్ చేసిందన్న కారణంగా రుణదాతల కమిటీ తిరస్కరించింది. ఆ తర్వాత పునఃప్రారంభించిన ప్రక్రియలో అదానీ, రిలయన్స్, పీఎఫ్‌సీ కన్సార్షియం పోటీపడ్డాయి. కానీ, రిలయన్స్, అదానీ బిడ్డింగ్‌లో పాల్గొనలేదు. పీఎఫ్‌సీ కన్సార్షియం రూ.3,020 కోట్లకు బిడ్ వేయగా.. 95 శాతం రుణదాతలు ఆమోదం తెలిపారు. కానీ, జాతీయ కంపెనీల చట్టం ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆ బిడ్‌ను కొన్ని నెలల పాటు ఆమోదించలేదు. అనూహ్యంగా అదానీ పవర్ మళ్లీ రంగంలోకి దిగి రూ.3,650 కోట్లకు బిడ్ వేసింది. తదుపరి బిడ్ విలువను రూ.4,101 కోట్లకు పెంచింది.

ల్యాంకో అమర్‌కంటక్ పవర్ 2001 ఫిబ్రవరిలో ఏర్పాటైంది. ఛత్తీస్‌గఢ్‌లోని కోబ్రా-చంపా రాష్ట్ర రహదారిపైనున్న పతాడి గ్రామం దగ్గర్లోని 1,337 ఎకరాల స్థలంలో కంపెనీ బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్లాంట్లో 300 మెగావాట్ల చొప్పున సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లున్నాయి. ఈ యూనిట్ల నుంచి ఛత్తీస్‌గఢ్‌తో పాటు మధ్యప్రదేశ్, హరియాణాకు విద్యుత్ సరఫరా అవుతోంది. రెండో దశలో 660 మెగావాట్ల చొప్పున సామర్థ్యంతో చేపట్టిన రెండు యూనిట్ల నిర్మాణం జాప్యం కాగా.. మూడో దశ విస్తరణలో భాగంగా ప్రతిపాదించిన రెండు యూనిట్ల (660 మెగావాట్ల చొప్పున సామర్థ్యం) నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

బిజినెస్

పిట్టీ ఇంజనీరింగ్ లాభం రూ.13 కోట్లు

హైదరాబాద్: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ రూ.296.92 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.13.32 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 24.19 శాతం (రూ.239.08 కోట్లు), లాభం 9.81 శాతం (రూ.12.13 కోట్లు) పెరిగింది. త్రైమాసిక సమీక్షా కాలంలో అమ్మకాలు 15.54 శాతం మేర పెరగటం కలిసి వచ్చిందని పేర్కొంది. కాగా మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ప్లాంట్ విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఈ ఏడాది మార్చి నాటికి నిర్మాణ పనులు పూర్తి కావచ్చని భావిస్తున్నట్లు పిట్టీ ఇంజనీరింగ్ పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికం ముగిసే నాటికి ఈ ప్లాంట్ వాణిజ్యపరంగా అందుబాటులోకి రానుందని తెలిపింది. డిసెంబరు ముగిసే నాటికి రూ.63.39 కోట్ల పెట్టుబడులు పెట్టగా మార్చి ముగిసే నాటికి మరో రూ.40 కోట్ల పెట్టుబడులు పెట్టాలని చూస్తున్నట్లు తెలిపింది. డిసెంబరు ముగిసే నాటికి కంపెనీ ఆర్డర్ బుక్ రూ.898 కోట్లుగా ఉంది.

ఐటీ నియామకాల్లో స్తబ్దత!

- మరికొంత కాలం పాటు ఇదే పరిస్థితి
- హైసియా ప్రెసిడెంట్ మనీషా సాబు
- 14న నేషనల్ సమ్మిట్, అవార్డుల కార్యక్రమం
- సీపీ గుర్నానీకి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



హైదరాబాద్: దేశీయంగా ఐటీ రంగ నియామకాల్లో స్తబ్దత మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలంటున్నాయి. కొవిడ్ ముప్పు తొలగిపోయిన తర్వాత అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమన పరిస్థితులు ఐటీ పరిశ్రమ వృద్ధికి విఘాతం కలిగించాయని హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) ప్రెసిడెంట్ మనీషా సాబు అన్నారు. శుక్రవారం నాడిక్కడ హైసియా 31వ ఎడిషన్ నేషనల్ సమ్మిట్, అవార్డ్స్ 2024 వివరాలను వెల్లడించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సహా ఇతరత్రా కారణాలతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఇంకా గాడినపడక పోవటం ఐటీ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపించిందని అంతేకాకుండా ఇది ఉద్యోగ నియామకాలపై పడిందన్నారు. ఐటీ రంగంలో నియామకాలు సాధారణ స్థాయికి రావాలంటే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. మరోవైపు క్యాంపస్ నియామకాల్లో కూడా స్తబ్దత నెలకొందని తెలిపారు.

ఎస్‌టీపీఐ భాగస్వామ్యంతో: 'ఏఐ: సెలబ్రేటింగ్ ఫ్యూచర్' థీమ్‌తో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ)- హైదరాబాద్‌తో కలిసి హైసియా ఈ నెల 14న హైదరాబాద్ హెచ్ఐసీసీలో జాతీయ సమ్మిట్‌ను నిర్వహిస్తోందని మనీషా సాబు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డీ. శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. అలాగే ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అర్విండ్ కుమార్, టెక్ మహీంద్రా మాజీ సీఈఓ, ఎండీ సీపీ గుర్నానీ, టీసీఎస్ ప్రెసిడెంట్ వీ రాజన్న కూడా ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. ఐటీ రంగంలో సీపీ గుర్నానీ చేసిన సేవలకు గుర్తింపుగా ఈ ఏడాది హైసియా జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందజేయనున్నట్లు సాబు పేర్కొన్నారు. అలాగే ఐటీ పరిశ్రమలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన కంపెనీలకు అవార్డులు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

హైబ్రిడ్ విధానానికి మొగ్గు: కొవిడ్ కాలంలో మొదలైన వర్క్ ఫ్రమ్ హోమ్ (డబ్ల్యూఎఫ్‌హెచ్) విధానానికి కంపెనీలు నిదానంగా స్వస్తి పలుకుతున్నాయి. ప్రస్తుతం 15 శాతం మంది ఇంటి నుంచి పనిచేస్తుండగా 40 శాతం మంది హైబ్రిడ్ విధానంలో పని చేస్తున్నారు. చాలా కంపెనీలు ఇప్పటికే ఉద్యోగులను ఆఫీస్‌కు వచ్చి పనిచేయాలని ఆదేశిస్తున్నాయని ఆమె చెప్పారు. రానున్న రోజుల్లో కంపెనీలు హైబ్రిడ్ విధానానికి మొగ్గు చూపే అవకాశం ఉందని సాబు పేర్కొన్నారు.

మారుతి ఎర్టిగా @ 10 లక్షల విక్రయాలు



న్యూఢిల్లీ: మారుతి సుజుకీ ఇండియా.. మల్టీ పర్పస్ వెహికల్ (ఎంపీవీ) ఎర్టిగా విక్రయాలు 10 లక్షల మైలురాయిని అధిగమించాయి. పట్టణ, గ్రామీణ ప్రాంత మార్కెట్లో ఈ ఎంపీవీకి మంచి ఆదరణ లభిస్తోందని కంపెనీ పేర్కొంది. ఈ మార్కెట్లో ఎర్టిగా వాటా 37.5 శాతంగా ఉందని తెలిపింది. మారుతి సుజుకీ ఎర్టిగాను దేశీయ మార్కెట్‌తో పాటు 80కి పైగా దేశాలకు ఎగుమతి చేస్తోంది.

ఎంబ్రాయర్‌తో మహీంద్రా జట్టు

ముంబై:భారత వైమానిక దళానికి అవసరమైన రవాణా విమానం దేశీయంగానే ఉత్పత్తి చేసే ప్రాజెక్టులో సహకారానికి ఎంబ్రాయర్ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ కంపెనీ, మహీంద్రా గ్రూప్ చేతులు కలిపాయి. భారత వైమానిక దళం త్వరలో ప్రారంభించనున్న మీడియం రవాణా విమానం (ఎంటీఏ) ప్రొక్యూర్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సీ-390 మిలీనియం మల్టీ మిషన్ విమానం కొనుగోలులో ఈ రెండు సంస్థలు సహకారం అందించనున్నాయి. భారత్‌కు వైవిధ్యభరితం, శక్తివంతమైన రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమ ఉన్నదని, అందుకే ఎంటీఏ ప్రోగ్రామ్ ఉమ్మడిగా చేపట్టడానికి తాము మహీంద్రాను భాగస్వామిగా ఎంచుకున్నామని ఎంబ్రాయర్ ప్రెసిడెంట్ బాస్కో డ కోస్టా అన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,160 ▼	57,900 ▼	76,500 ▲
ముంబై	62,624 ▲	57,364 ▲	70,638 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ		విజయవాడ	530
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
10వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	583	డజను గుడ్లు రూ.72	
గోదావరి	530		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	గోదావరి	122
వరంగల్	117	విజయవాడ	122
కరీంనగర్	117	గుంటూరు	124
మహబూబ్‌నగర్	117	ఒంగోలు	124
కర్నూలు	117	చిత్తూరు	130
విశాఖపట్నం	117		

ఎందుకంత అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు?

మైక్రోఫైనాన్స్ సంస్థలకు ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ప్రశ్న

న్యూఢిల్లీ: కొన్ని నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) కొన్ని రకాల నియంత్రణాపరమైన ప్రయోజనాలు పొందుతూ కూడా బ్యాంక్ లైసెన్సులకు దరఖాస్తు చేయడాన్ని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వరరావు తప్పుపట్టారు. సీఐఐ నిర్వహణలోని ఎన్‌బీఎఫ్‌సీల సదస్సులో మాట్లాడుతూ కొన్ని మైక్రో లెండింగ్ సంస్థలు వడ్డీ రేట్ల విషయంలో ఆర్‌బీఐ ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ అధిక వడ్డీరేట్లు వసూలు చేస్తున్నాయని ఆయన ఆగ్రహం ప్రకటించారు. అలాగే కొన్ని పీర్ టు పీర్ లెండింగ్ సంస్థలు లైసెన్సింగ్ నిబంధనలకు భిన్నమైన వ్యాపార విధానాలు అనుసరిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఇలాంటి ఉల్లంఘనలు వేటినీ అనుమతించేది లేదని ఆయన ఖండితంగా చెప్పారు. 10ఏళ్లకు పైబడి సేవలందిస్తూ అన్ని రకాల నిబంధనలు అనుసరిస్తున్న ఎన్‌బీఎఫ్‌సీల్లో కొన్నింటికైనా బ్యాంకింగ్ లైసెన్సులు ఎందుకు ఇవ్వకూడదు అంటూ బజాజ్ ఫిన్‌సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్ వేసిన ప్రశ్నకు స్పందిస్తూ రావు ఈ వ్యాఖ్యలు చేశారు.

స్వల్ప లాభాలతో సరి

167 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: వారాంతం ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటలకు లోనైన ప్రామాణిక సూచీలు.. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో కొనుగోళ్లతో స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 167.06 పాయింట్లు పెరిగి 71,595.49 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 64.55 పాయింట్ల వృద్ధితో 21,782.50 వద్ద నిలిచింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 16 లాభపడ్డాయి. ఎస్‌బీఐ 3.55 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్ 2 శాతానికి పైగా పెరగగా.. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ షేరు 0.67 శాతం లాభపడింది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 1.36 శాతం క్షీణించగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.82 శాతం తగ్గింది.

2 రోజుల్లో పేటీఎం షేరు 15% పతనం: పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు మరో 6.09 శాతం క్షీణించి రూ.419.85 వద్దకు జారుకుంది. గడిచిన రెండు రోజుల్లో 15.48 శాతం పతనమవడంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 4,870 కోట్లకు తరిగిపోయింది.

ఫారెక్స్ నిల్వలు హైజంప్: ఈ నెల 2తో ముగిసిన వారంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు మరో 573.6 కోట్ల డాలర్ల మేర పెరిగి మొత్తం 62,246.69 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది. గతవారంలోనూ ఫారెక్స్ నిల్వలు 59 కోట్ల డాలర్లకు పైగా పెరిగాయి.

గ్లెన్‌మార్క్‌లో 17% వాటా కొనుగోలుకు నిర్మా ఓపెన్ ఆఫర్

గ్లెన్‌మార్క్ లైఫ్ సైన్సెస్‌లో అదనపు వాటా కొనుగోలుకు నిర్మా ప్రకటించిన రూ.1,343 కోట్ల ఓపెన్ ఆఫర్ ఈ నెల 15న ప్రారంభం కానుంది. ఈ ఆఫర్‌లో భాగంగా, గ్లెన్‌మార్క్‌లో 17.33 శాతం వాటాకు సమానమైన 2.13 కోట్ల షేర్లను ఒక్కోటీ రూ.631.20 చొప్పున పబ్లిక్ వాటాదారుల నుంచి కొనుగోలు చేయనుంది. గ్లెన్‌మార్క్‌లో 75 శాతం వాటాను రూ.5,651 కోట్లకు కొనుగోలు చేసేందుకు నిర్మా గత ఏడాది సెప్టెంబరులో ఒప్పందం కుదుర్చుకుంది.

రోజువారీ ట్రేడింగ్ విలువలో హాంకాంగ్‌ను మించిన భారత్

దేశీయ స్టాక్ మార్కెట్ మరో రికార్డు సొంతం చేసుకుంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా ఇప్పటికే హాంకాంగ్‌ను దాటేసిన భారత స్టాక్ మార్కెట్.. తాజాగా ట్రేడింగ్ విలువలోనూ ఆ దేశాన్ని వెనక్కి నెట్టింది. జనవరిలో బీఎస్ఈ, ఎన్ఎస్ఈ రోజువారీ ట్రేడింగ్ సగటు విలువ 1,650 కోట్ల డాలర్లకు పెరగగా.. హాంకాంగ్ ట్రేడింగ్ వేల్యూ 1,310 కోట్ల డాలర్లకు పరిమితమైంది.

పీఎస్‌యూ స్టాక్స్‌లో ఎల్ఐసీ హోల్డింగ్స్.. నాలుగు నెలల్లో రూ.లక్ష కోట్లు అప్

గత ఏడాది అక్టోబరు 1 నుంచి గడిచిన నాలుగు నెలల్లో ప్రభుత్వ రంగ కంపెనీల్లో (పీఎస్‌యూ) ఎల్ఐసీ పెట్టుబడుల విలువ రూ.లక్ష కోట్లు పెరిగింది. 60 పీఎస్‌యూ స్టాక్స్‌లో ఎల్ఐసీ పెట్టుబడుల మొత్తం విలువ ఈ నెల 9 నాటికి రూ.3.3 లక్షల కోట్లకు చేరుకుంది. స్థూల ఆర్థికాంశాల్లో సానుకూలతలతో గడిచిన కొన్ని నెలల్లో పీఎస్‌యూ షేర్లు భారీగా ర్యాలీ తీయడం ఇందుకు దోహదపడింది.

హీరో మోటో లాభంలో 50 శాతం వృద్ధి

ఒక్కో షేరుకు రూ.100 డివిడెండ్

న్యూఢిల్లీ: హీరో మోటోకార్ప్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 50 శాతం వృద్ధి చెంది రూ.1,093 కోట్లుగా నమోదైంది. త్రైమాసిక కాలంలో వాహన విక్రయాలు మెరుగ్గా ఉండటం ఎంతగానో కలిసివచ్చిందని కంపెనీ పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ లాభం రూ.726 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.8,300 కోట్ల నుంచి రూ.10,031 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో కంపెనీ మొత్తం 14.6 లక్షల మోటార్‌సైకిళ్లు, స్కూటర్లను విక్రయించింది. కంపెనీ ఛైర్మన్ ఎమిరెటస్ బ్రిజ్‌మోహన్ లాల్ ముంజాల్ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఒక్కో షేరుకు రూ.75 మధ్యంతర డివిడెండ్‌తో పాటు రూ.25 ప్రత్యేక డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.


రూ.600 కోట్లతో జైడస్ లైఫ్ షేర్ల బైబ్యాక్

ముంబై: జైడస్ లైఫ్ సైన్సెస్.. రూ.600 కోట్లతో షేర్ బైబ్యాక్‌ను ప్రకటించింది. ఇందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. బైబ్యాక్‌లో భాగంగా మొత్తం 59.7 లక్షల షేర్లను కంపెనీ తిరిగి కొనుగోలు చేయనుంది. కంపెనీ మొత్తం పెయిడప్ క్యాపిటల్‌లో ఇది 0.59 శాతానికి సమానం. టెండర్ ఆఫర్ మార్గంలో ఈ షేర్లను కంపెనీ బైబ్యాక్ చేయనుంది. ఒక్కో షేరు ధరను రూ.1,005గా ఖరారు చేసింది. కాగా డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.4,505 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.790 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 27 శాతం వృద్ధి చెందింది.

www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 21
సంచిక (Issue) : 313
శనివారం | 10-2-2024
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారతరత్నం పీవీ

యద్యపి శుద్ధం, లోక విరుద్ధం,
నాచరణీయం, నా కరణీయం
ఆలోచన మంచిదైనప్పటికీ,
ప్రజలు వ్యతిరేకిస్తే దానిని
ఆచరించకూడదు
- పీవీ ఇష్టపడే సంస్కృత వాక్యం

ఆర్థిక సంస్కరణల యుగకర్తకు అత్యున్నత పౌర పురస్కారం

మాజీ ప్రధాని చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కూ..
ఈ ఏడాది ఐదుగురికి భారతరత్న.. రికార్డు
సంస్కరణల సారథి.. సిసలైన భారత రత్నం
పీఠాధిపతి అవుదామనుకుని.. ప్రధానిగా
బహుభాషా కోవిదుడు.. ఎన్నింటికో ఆద్యుడు
ప్రజల జీవన నాణ్యత పెరుగుదల పీవీ చలవే
సాహితీమూర్తి.. పాములపర్తి నరసింహారావు
వ్యవసాయ కృషీ రత్నం.. స్వామినాథన్
అసలైన 'రైతు నాయకుడు' చరణ్‌సింగ్


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది నుంచి తొలిసారిగా భారతదేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టడమే గాక దేశానికి ఆర్థిక సంస్కరణల పథాన్ని వేసిన తెలుగు బిడ్డ పాములపర్తి వెంకట నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. పీవీ తోపాటు మరో మాజీ ప్రధాని, రైతు నేత చరణ్‌సింగ్, విఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, భారత హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్‌లకు కూడా ఈ పురస్కారాన్ని ఇవ్వనున్నట్లు శుక్రవారం తెలియజేసింది. ఇప్పటికే బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్, బీజేపీ కురువృద్ధ నేత ఎల్‌కే ఆడ్వాణీలకు భారతరత్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విధంగా ఒకే ఏడాది ఐదుగురికి దేశ అత్యున్నత పురస్కారం ప్రకటించటం ఇదే ప్రథమం. 1999లో నలుగురికి భారతరత్న ఇచ్చారు. పీవీ, చరణ్‌సింగ్, స్వామినాథన్‌లకు భారతరత్న పురస్కారంపై ప్రధాని మోదీ ట్విటర్‌లో స్పందిస్తూ వారి సేవల్ని

మిగతా 8వ పేజీలో...

పీవీ హయాం..
కొత్త ఆర్థికశకానికి నాంది

దేశాన్ని ఆధునిక ఆర్థికశక్తిగా మలిచారు
భారత మార్కెట్ల తలుపులను తెరిచారు
మేధావి, రాజనీతిజ్ఞుడు: మోదీ 8

- పీవీకి భారతరత్న.. స్వాగతిస్తున్నా: సోనియా 9
- ఆలస్యమైనా సంతోషం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మాజీ ప్రధాని సేవలకు సరైన గుర్తింపు: కిషన్‌రెడ్డి
- భారత్‌ను నిలబెట్టింది పీవీ సంస్కరణలే: చంద్రబాబు
- తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవమిది: కేసీఆర్ 9


చరణ్‌సింగ్


ఎంఎస్ స్వామినాథన్

తాతకు భారతరత్న.. ఆ వెంటనే పొత్తు.. బీజేపీతో కలిసి నడిచేందుకు ఆర్ఎల్డీ అధినేత జయంత్ సై


సమ్మక్క-సారక్క మొక్కుల వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు

గ్రూప్-1 వయోపరిమితి 46

రెండేళ్లు పెంచుతామన్న సీఎం రేవంత్

త్వరలోనే పరీక్ష నిర్వహిస్తాం
బంధువులను పెట్టుకొని ఉద్యోగాలను అమ్ముకునేవాళ్లం కాదు
కృష్ణా జలాలపై.. సంతకం పెట్టిందే కేసీఆర్
కేసీఆర్, కేటీఆర్, హరీశ్ ఢిల్లీలో దీక్ష చేయాలి
సాధించైనా రండి.. అమరులైనా కండి
సాగర్‌పై ఏపీ ఖాకీల్ని అడ్డుకోలేని సన్నాసులు
కొడుక్కి దక్కే పదవిలో నేనుండటం నచ్చట్లేదు
విపక్షనేత కుర్చీ ఖాళీ ఉండటం దురదృష్టకరం
12న కృష్ణా జలాలపై చర్చ.. 13న మేడిగడ్డకు
శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభవార్త చెప్పారు. వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచుతామని ప్రకటించారు. కొన్ని నిబంధనల వల్ల టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన ఆలస్యమైందని, త్వరలోనే పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. విపక్ష నేతలు రెండు లక్షల ఉద్యోగాల గురించి మాట్లాడుతున్నారని, కానీ.. తాము జిరాక్స్ సెంటర్లలో ప్రశ్నపత్రాలు విక్రయించేవాళ్లం కాదని, ప్రభుత్వ శాఖల్లో బంధువులను పెట్టుకొని ఉద్యోగాలు అమ్ముకునే వాళ్లం కాదని అన్నారు. త్వరలో పోలీసుశాఖలో 15 వేల ఉద్యోగాల నియామకాలు చేపడతామని, యూనివర్సిటీల్లో వీసీల ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. శుక్రవారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్‌పై గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాలపై తీవ్రంగా

మిగతా 10వ పేజీలో...

గ్రూప్-4 పరీక్ష ఫలితాల వెల్లడి

ఓటుకు నోటు కేసులో రేవంత్‌కు సుప్రీంకోర్టు నోటీసు 11

నేడే రాష్ట్ర బడ్జెట్.. అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న భట్టి విక్రమార్క

ఆటో రగడ

'మహిళలకు ఉచిత బస్సు'కు బీఆర్ఎస్ అనుకూలమా? వ్యతిరేకమా?
ఆటోవాలాలను అడ్డుపెట్టుకొని పుల్లలు రెచ్చగొట్టి ఆందోళనలు చేయిస్తున్నారు
మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం
మహాలక్ష్మిపై అసెంబ్లీలో వాడివేడి చర్చ
ఆటో డ్రైవర్లకు ఏటా 12 వేలు ఇస్తాం
ఈ బడ్జెట్‌లోనే నిధులు: శ్రీధర్‌బాబు
మహాలక్ష్మి అమలుతో 6.5 లక్షల మంది ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారు: పల్లా
11

ఆటోల్లో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
ప్రభుత్వం ఆదుకోవాలంటూ ప్లకార్డులు
ఆటోవాలాలకు నెలకు పదివేలివ్వాలి: హరీశ్

ఐఏఎస్‌ల భూమాయ!

గత ప్రభుత్వంలో కీలకంగా ఉండి.. కొనుగోళ్లు
ప్రాజెక్టులు ఎక్కడ వచ్చేది తెలిసీ లావాదేవీలు
ప్రభుత్వానికి చెప్పి కొన్నామన్నా వివాదాస్పదం
ఇప్పటికే సోమేశ్ భార్య భూములపై గొడవ
తాజాగా వెలుగులోకి రజత్ కొనుగోళ్లు
బీఆర్ఎస్ హయాంలో కీలక ఏఐఎస్‌ల భూముల కొనుగోళ్లపై కాంగ్రెస్ బృందం నజర్

ఆ ఐపీఎస్ అరవింద్ కుమార్!
శివబాలకృష్ణ ఏసీబీకి చెప్పింది ఆయన పేరే
విచారణకు అనుమతి కోరిన దర్యాప్తు సంస్థ
అనుమతి వస్తే నోటీసు జారీ చేసి విచారణ
బెయిల్ కోరుతూ కోర్టుకు వెళ్లిన శివబాలకృష్ణ

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇతిహాస రత్నాలు!

మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చౌదరీ చరణ్‌సింగ్‌లతో పాటు, సుప్రసిద్ధ వ్యవసాయశాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్‌లకు భారతరత్న పురస్కారాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. ఇతరత్రా అధికారిక ప్రక్రియల అవసరం లేకుండా, ప్రధాని సిఫార్సు, రాష్ట్రపతి ఆమోదంతో ఈ నిర్ణయం జరిగిపోతుంది కనుక, ఈ ఏడాది పురస్కారాల సంఖ్య ఇప్పటికే ఐదుకు చేరిన నేపథ్యంలో శుక్రవారం నాటి మోదీ ట్వీట్ చివరిది కావచ్చు. పురస్కారాలు అందుకున్న ముగ్గురూ ఈ దేశం గర్వించదగ్గ బిడ్డలు, ఈ అత్యున్నత గౌరవానికి సంపూర్ణంగా అర్హులు. ఇటీవల బిహార్ నాయకుడు కర్పూరీ ఠాకూర్‌కు, వారంలో బీజేపీ నాయకుడు ఎల్.కె. అడ్వాణీకి ఈ పురస్కారాన్ని ప్రకటించిన మోదీ, మరోవారంలోనే ఈ ముగ్గురినీ చేర్చడంతో, ఈ అవార్డు చరిత్రలో అత్యధిక పురస్కారాలు ప్రకటించిన ఏడాదిగా రికార్డులకు సైతం ఎక్కింది.

దక్షిణ భారతం నుంచి ఒకేమారు రెండురత్నాలు. తెలంగాణ బిడ్డ పీవీకి దక్కిన గౌరవం తెలుగువారందరినీ ఆనందింపచేస్తుంది. కేరళలో పుట్టి, తమిళనాడును పుట్టినిల్లుగా చేసుకున్న హరితవిప్లవ పితామహుడు స్వామినాథన్ ఎంపిక వారినీ సంతోషపెడుతుంది. చరణ్‌సింగ్ పేరు ఉత్తరాదిని రంజిపచేస్తుంది. ఈ ఏడాది పురస్కారాలు అందుకున్నవారంతా దేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసినవారు, తమ కృషి, మేధస్సుతో ఆయా రంగాలను వెలిగించినవారే. ఎన్నికల ఏడాది కావడంవల్ల పురస్కారాల వెనుక ఉన్న రాజకీయ కోణం మీద కూడా విస్తృత చర్చ జరుగుతోంది. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడం ఎంబీసీలను ఆకర్షించడానికే కాక, బిహార్‌లో రాజకీయమార్పుకు కూడా ఉపకరించింది. ఇండియా కూటమికి పునాదులు వేసిన నితీశ్‌కుమార్ తిరిగి ఎన్డీయేలో ప్రవేశించడానికి ఓ దారిచూపింది. ఇప్పుడు చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించగానే ఆయన మనుమడు జయంత్ చౌదరి 'దిల్ జీత్ లియా' అంటూ ఎన్డీయేతో పోవడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆర్ఎల్‌డీతో గతనెలలోనే అఖిలేశ్ యాదవ్ సీట్ల సర్దుబాటు ఒప్పందం చేసుకున్నప్పటికీ, చరణ్‌సింగ్ పేరు ప్రకటించగానే ఆర్ఎల్‌డి ఎమ్మెల్యేలంతా యూపీ అసెంబ్లీ భవనం ముందు చేరి నరేంద్రమోదీ జిందాబాద్ అని నినదించడం మారుతున్న రాజకీయానికి నిదర్శనం. ఆర్ఎల్‌డి నిష్క్రమణ పశ్చిమయూపీలోనే కాక, జాట్ల ఆధిపత్యం ఉన్న మిగతా ప్రాంతాలను కూడా ప్రభావితం చేస్తుంది. చరణ్‌సింగ్‌కు దక్కిన గౌరవం హర్యానా, రాజస్థాన్‌లోని జాట్లను కూడా బీజేపీకి సానుకూలం చేసి, వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన ఒక బలమైన వర్గాన్ని మెత్తబరుస్తుంది. నాలుగుదశాబ్దాలపాటు కాంగ్రెస్‌లో ఉండి, ఆ తరువాత దాని సహకారంతోనే అత్యున్నత పదవులు చేపట్టి, కొంతకాలం జన్‌సంఘ్‌తో నడిచిన చరణ్‌సింగ్‌ను ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటయోధుడుగా, ప్రజాస్వామ్యపరిరక్షకుడుగా గుర్తుచేస్తూ మోదీ ఈ పురస్కారాన్ని ప్రకటించారు. చరణ్‌సింగ్‌తో పాటు ఎంఎస్ స్వామినాథన్ ఎంపిక కూడా యావత్ రైతాంగాన్ని ఆకట్టుకొనేందుకు ఉపకరిస్తుంది. హరితవిప్లవంతో రైతులను ఆర్థికంగా నిలబెట్టడంతో పాటు, వ్యవసాయాన్ని, రైతులను రక్షించడానికి ఆయన జీవితపర్యంతం కృషిచేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా పీవీని గౌరవించడం ఆ పార్టీని ఇరుకునపెట్టడానికి, సార్వత్రిక ఎన్నికలముందు ప్రజానీకాన్ని ప్రభావితం చేయడానికి ఉపకరిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలకబాధ్యతలు సమర్థంగా నిర్వహించి, ముఖ్యమంత్రిగా, దేశప్రధానిగా ఎదిగిన పీవీకి దక్కిన ఈ గౌరవం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ మీద ఉన్న ఆగ్రహాన్ని చల్లార్చడానికి దోహదం చేస్తుంది. గతంలో ప్రణబ్ ముఖర్జీ, ఇప్పుడు పీవీ.. గాంధీ కుటుంబానికి చెందనివారిని గౌరవించడం ద్వారా తన కుటుంబపాలన వాదనకు ఊతం ఇచ్చుకొనే ప్రయత్నం బీజేపీ చేస్తున్నది. పీవీ నరసింహారావు హయాంలోనే బాబ్రీ మసీదు కూల్చివేత జరగడం, రామమందిర నిర్మాణంతో ఆ వివాదం ముగియడం కూడా ప్రధాని మనసులో ఉండివుంటుంది. పీవీ హయాంలో దేశం అద్భుతవిజయాలు సాధించిందని గుర్తుచేయడంలో, ఆ తరువాత కాంగ్రెస్ హయాంలో దేశం ఆర్థికంగా భ్రష్టుపట్టిందన్న ప్రస్తుత వాదన అంతర్లీనంగానైనా ఉంది. నాలుగువందల సీట్ల లక్ష్యానికి ఓ అరవయ్యో, డెబ్బయ్యో తక్కువపడతాయని సర్వేలు లెక్కలేస్తున్న క్రమంలో, ఈ పురస్కారాలతో ప్రజల మనసు చూరగొనే ప్రయత్నం ఎంతో-కొంత ఉండకపోదు.

నిర్మల ఘోష–సామాన్యుడి సణుగుడు

ప్రజాహితకర ఆర్థిక ఆలోచనలు ప్రశాంతంగా, నిశ్చలంగా ఉంటాయి. మంచి ఆర్థికవేత్తలు తమ విధానాల ఫలితాలకు బాధ్యత వహిస్తారు. ఆర్థిక సర్వే, కొత్త సంవత్సరంలో పార్లమెంటు ప్రథమ సమావేశాల మొదటి రోజు రాష్ట్రపతి ప్రసంగం, ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం ప్రభుత్వ విధానాన్ని వెల్లడించే ముఖ్య ప్రకటనలు. సమష్టిగా అవి ప్రభుత్వ ఉద్దేశాలు, సంకల్పాలను బిగ్గరగా, స్పష్టంగా ప్రకటిస్తాయి.

తన విధానాలను అట్టహాసంగా ప్రకటించడం ఎన్డీఏ ప్రభుత్వానికి అలవాటు. ఈ ఏడాది 2024–25 ఆర్థిక సంవత్సరానికి తాత్కాలిక బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెడుతూ దానిని ఒక బుల్హార్న్ (ధ్వనిని పెంచే పరికరం, మెగా ఫోన్ లాంటిది)గా ఉపయోగించుకోవాలని గౌరవనీయ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నిర్ణయించుకున్నారు. ఆమె ఘోషను మీడియా విధేయపూర్వకంగా ప్రతిధ్వనించింది. అయితే బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజు సాయంత్రానికే సదరు బడ్జెట్ పత్తా లేకుండాపోవడం ఆర్థిక మంత్రికి ఎంతైనా ఆశాభంగం కలిగించి ఉంటుంది.




■ పి. చిదంబరం

'పళని' పలుకు

గత పది సంవత్సరాలుగా ఆర్థికాభివృద్ధి విషయమై ప్రభుత్వం పదే పదే చేస్తున్న ప్రకటనలు, వాదనలు వినీ వినీ ప్రజలు అలసిపోతున్నారు, విసిగిపోతున్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామన్న హామీని వారు గుర్తు చేసుకొంటున్నారు. అయితే జరిగింది ఏమిటి? ప్రభుత్వ కార్యాలయాలలో ఖాళీలను భర్తీ చేసేందుకు కొన్ని వేల నియామక లేఖలను మాత్రమే ఇచ్చారు. కాగా 2023లో టెక్ కంపెనీలు 2,60,000 ఉద్యోగాలను రద్దు చేశాయి. భారత్‌లోనూ, విదేశాలలోనూ దాచిన నల్లధనాన్ని వెనక్కి తీసుకువచ్చి ప్రతి ఒక్క భారతీయుని బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని 2014లో నరేంద్ర మోదీ చేసిన వాగ్దానాన్ని కూడా ప్రజలు గుర్తు చేసుకొంటున్నారు. అయితే ప్రభుత్వ బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకుని వాటి చెల్లింపును పూర్తిగా ఎగవేసిన ఘనులు చట్టం నుంచి తప్పించుకుని విదేశాలకు వెళ్లిపోవడానికి ప్రభుత్వం అనుమతించిందని, ఇప్పుడు వారు ఆశ్రయం పొందిన దేశాలలో ఉల్లాసంగా, మహదానందకరంగా నివశిస్తున్నారని, వారిని భారత్‌కు తీసుకువచ్చేందుకు గత పదేళ్లుగా ఎలాంటి ప్రయత్నాలు జరగలేదన్న విషయం కూడ ప్రజలకు బాగా తెలుసు సుమా!

2022 సంవత్సరం నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని, ప్రతి కుటుంబానికి గృహ వసతి సమకూరుస్తామని 2023–24 నాటికి భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధిపరుస్తామని ఇచ్చిన హామీలను ప్రజలు మరచిపోలేదు. మరి గౌరవనీయ ఆర్థిక మంత్రి తన తాజా బడ్జెట్ ప్రసంగంలో చేసిన ప్రకటనలను వారు ఒక వినోద కాలక్షేపంగా మాత్రమే పరిగణిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆదాయాలు పెరిగాయని ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు. నిజమేమిటి? పిఎల్ఎఫ్ఎస్ డేటా, అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ రూపొందించిన స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా రిపోర్ట్ ప్రకారం నియత, తాత్కాలిక/ దినసరి, స్వయం ఉపాధి కార్మికుల నిజ వేతనాలలో 2017–18, 2022 –23 ఆర్థిక సంవత్సరాల మధ్య ఎలాంటి పెరుగుదల లేదు. వివిధ రకాల పేదరికాల నుంచి బయటపడేందుకు 25 కోట్ల మంది ప్రజలకు ప్రభుత్వం తోడ్పడిందని మంత్రి అన్నారు. నిజమేనా? యుఎన్‌డిపి నివేదికల ప్రకారం యూపీఏ ప్రభుత్వాల హయాంలో పేదరికం నుంచి బయటపడిన భారతీయులు 27.5 కోట్ల మంది కాగా, ఎన్డీఏ ప్రభుత్వాల హయాంలో కేవలం 14 కోట్ల మంది మాత్రమే పేదరికం నుంచి గట్టెక్కారు.



గత పది సంవత్సరాలుగా ఆర్థికాభివృద్ధి విషయమై ప్రభుత్వం పదే పదే చేస్తున్న ప్రకటనలు, వాదనలు వినీ వినీ ప్రజలు అలసిపోతున్నారు, విసిగిపోతున్నారు. 2022 సంవత్సరం నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని, ప్రతి కుటుంబానికి గృహ వసతి సమకూరుస్తామని 2023–24 నాటికి భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధిపరుస్తామని ఇచ్చిన హామీలను ప్రజలు మరచిపోలేదు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన తాజా బడ్జెట్ ప్రసంగంలో చేసిన ప్రకటనలను వారు ఒక వినోద కాలక్షేపంగా మాత్రమే భావిస్తున్నారు.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన కింద ఏటా 11.8 కోట్ల మంది రైతులకు ప్రభుత్వం నేరుగా ఆర్థిక సహాయమందిస్తుందని నిర్మలా సీతారామన్ అన్నారు. వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. నవంబర్ 15, 2023 నాటికి ఈ లబ్ధి పొందే రైతుల సంఖ్య 8.12 కోట్లకు తగ్గిపోయింది. ఈ ఆర్థిక సహాయాన్ని పట్టా దారులైన రైతులకు అందించి కౌలు రైతులను పూర్తిగా మినహాయించారు. గత పదేళ్లలో ఉన్నత విద్యా సంస్థలను పెద్ద సంఖ్యలో కొత్తగా నెలకొల్పినట్లు మంత్రి చెప్పారు. 7 ఐఐటీలు, 16 ఐఐఐటీలు, 15 ఎయిమ్స్‌లు, 390 విశ్వవిద్యాలయాలు అని ఇమె ఒక జాబితా కూడా ఇచ్చారు. సరే, మార్చి 22, 2023 నాటికి ఈ ఉన్నత విద్యాసంస్థల అధ్యాపక ఉద్యోగ ఖాళీల వివరాలు ఎలా ఉన్నాయో చూడండి: ఐఐటీలు (9,625), ఐఐఐటీలు (1,212), కేంద్రీయ విశ్వవిద్యాలయాలు (22,106). మార్చి 15, 2022 నాటికి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో 1,256 అధ్యాపక, రెసిడెంట్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర 19 ఎయిమ్స్‌లలో ఉన్న ఈ ఖాళీల సంఖ్య 3,871.

ప్రధానమంత్రి ముద్రా యోజన 22.5 లక్షల యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మొత్తం 43 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని నిర్మల సీతారామన్ అన్నారు. ముద్రా రుణాల సగటు పరిమాణం రూ.52,325. ఈ రుణాలను శిశు (83 శాతం), కిశోర్ (15 శాతం). తరుణ్ (2 శాతం)గా వర్గీకరిస్తే అత్యధిక రుణాలు శిశు శ్రేణిలో ఉన్నాయని స్పష్టమవుతుంది ప్రభుత్వ సమాచారం ప్రకారమే 35.69 కోట్ల శిశు రుణాల గ్రహీతలు మొత్తం రూ.9 లక్షల కోట్ల రూపాయల మేరకు ఆర్థిక సహాయాన్ని పొందారు. సగటు రుణం పరిమాణం రూ.25,217. కేవలం రూ.25 వేలతో ఎవరైనా ఒకరు ఎలాంటి వ్యాపారాన్ని ప్రారంభించగలుగుతారు?

'ఒకే దేశం, ఒకే మార్కెట్, ఒకే పన్ను' లక్ష్యాన్ని వస్తుసేవల పన్ను (జీఎస్టీ) నెరవేరుస్తుందని మంత్రి సంబరంగా చెప్పారు. అవునా? వ్యాపారస్తులు, వర్తకులు, వాణిజ్యవేత్తలు అందరూ సమైక్యంగా వ్యతిరేకిస్తున్న పన్ను ఏదైనా ఒకటి ఉందంటే అది జీఎస్టీనే సుమా! జీఎస్టీ చట్టాలు లోపభూయిష్టమైనవి. వేధింపులకు, దోపిడీకి అవి ఎంతైనా ఆస్కారం కల్పిస్తున్నాయి. కాదా మంత్రిగారూ? సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి, అంతర్జాతీయ విపణిలో అవి సమర్థంగా పోటీ పడేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడం ఉపయుక్త సాంకేతికతలను సమకూర్చడం, కార్మికుల నైపుణ్యాలను మెరుగుపరచడం అనేవి ప్రభుత్వ విధానంగా ఉందని నిర్మలా సీతారామన్ చెప్పారు. వాస్తవమేమిటి? కోవిడ్ విలయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి తోడ్పాటు అందకపోవంతో వేలాది సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. లక్షలాది కార్మికులు వీధినపడ్డారు. ఈ పరిశ్రమలకు మూడు లక్షల కోట్ల రూపాయల మేరకు బ్యాంకు రుణాలను అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం కేవలం రెండు లక్షల కోట్ల రూపాయలు మాత్రమే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పంపిణీ చేశారు. సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులు 2013–14 నుంచి రెట్టింపు అయ్యాయని ఆర్థిక మంత్రి చెప్పారు. ఈ తొమ్మిది సంవత్సరాలలో ఈ ఎగుమతుల పెరుగుదల (రూ.30,627 కోట్ల నుంచి రూ.64,902 కోట్లకు) ప్రస్తుత రూపీ ధరలలో మాత్రమే అని గుర్తించాలి. డాలర్లలో చూస్తే ఈ పెరుగుదల కేవలం 60 శాతం మాత్రమే. 5016 మిలియన్ డాలర్ల నుంచి 8078 మిలియన్ డాలర్ల మేరకు ఎగుమతులు పెరిగాయి. అయితే ఈ పెరుగుదల కేవలం 5.4 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్‌ను మాత్రమే సమకూర్చింది.

కర్ణాటకలో హిందూ పక్షపాతం

కర్ణాటక శాసనసభ ఎన్నికలు గత ఏడాది మేలో జరిగాయి. ఈ ఎన్నికలకు ముందు స్థానిక వార్తాపత్రికలలో ప్రధానంగా నాలుగు అంశాలు నెలల తరబడి పతాక శీర్షికలలో ఉండేవి. మొదటది- కళాశాల విద్యాభ్యాసం చేస్తున్న ముస్లిం విద్యార్థినులు ధరిస్తున్న శిరోవస్త్రం; రెండోది- ఆహారానికై అనేకమంది ముస్లింలు ఒక జంతువును చంపే పద్ధతి; మూడోది- పరస్పరం ప్రేమించుకున్న ముస్లిం యువకుడు, హిందూ యువతి వివాహం చేసుకోవాలని అభిలషించడం; నాలుగోది- ఇప్పుడు కర్ణాటకలో భాగంగా ఉన్న ఒక ప్రాంతాన్ని పాలించిన, రెండు శతాబ్దాల క్రితం బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో పోరాడుతూ చనిపోయిన ఒక రాజు చారిత్రక ప్రశస్తిపై వివాదం. హిజాబ్, హలాల్, లవ్ జిహాద్, టిప్పు సుల్తాన్... ఇవీ, కర్ణాటక ఓటర్ల మద్దతుకై ప్రజ్వలింపచేసిన నాలుగు అంశాలు. మరోసారి జాగ్రత్తగా చదవండి.

నాడు కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ పట్ల ప్రజల్లో సదభిప్రాయం లేదు. ముఖ్యమంత్రి పాలనాదక్షుడు కాడన్నదే ప్రజాభిప్రాయంగా ఉన్నది. ఫలితంగా ప్రభుత్వ వ్యతిరేకత పెరిగిపోతోంది. పార్టీకి ఎదురవుతున్న ఈ విషమ పరిస్థితిని ఢిల్లీలోని పార్టీ పెద్దలు గ్రహించారు. శాసనసభ ఎన్నికలలో గెలిచి తీరాలంటే హిందూ వర్సెస్ ముస్లిం అన్న భావోద్రేక అంశానికి ప్రాధాన్యమివ్వాలనే నిర్ణయానికి పార్టీ పెద్దలు వచ్చారు. హిజాబ్, హలాల్, మతాంతర వివాహాలపై ఆంక్షల ద్వారా భారతీయ ముస్లింలు భిన్నమైనవారు, అవిశ్వసనీయులని చిత్రించడం ద్వారా హిందూ జనాభాలో అత్యధికులను తన వెనుక సమీకరించుకోవడానికి బీజేపీ ప్రయత్నించింది. ఈ ఎజెండాకు అనుగుణంగా బీజేపీ వాట్సప్ ఫ్యాక్టరీ అనేక అసత్యాలను ఉత్పత్తి చేసింది. వాటిలో ఒకటి ప్రత్యేకంగా గమనార్హమైనది. టిప్పుసుల్తాన్‌ను చంపింది ఈస్టిండియా కంపెనీ సైనికులు కాదని, ఇద్దరు ఒక్కలిగ సిపాయిలు ఆ ఘాతుకానికి పాల్పడ్డారన్న ప్రచారం.

ఈ ఎత్తుగడలన్నీ విఫలమయ్యాయి. కాంగ్రెస్ భారీ మెజారిటీతో గెలిచింది. కాంగ్రెస్ విజయానికి రెండు కారణాలు దోహదం చేశాయి. ఒకటి-, ఉత్తరాది రాష్ట్రాలలో వలే కాకుండా కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఇప్పటికీ గట్టిగా ఉన్న ప్రజాబలం (గ్రామగ్రామాన కాంగ్రెస్‌కు కార్యకర్తలు ఉన్నారు); రెండు,- పార్టీ విజయానికి కర్ణాటక కాంగ్రెస్ ప్రధాన నాయకులు సిద్దరామయ్య, డి.కె. శివకుమార్ కలసికట్టుగా చేసిన కృషి. సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా, శివకుమార్ ఉపముఖ్యమంత్రిగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం గత నవంబర్‌లో ఆరు నెలల కాలాన్ని పూర్తి చేసుకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత హిజాబ్, హలాల్, టిప్పు సుల్తాన్ మొదలైన అంశాలు కాకుండా వ్యవసాయరంగ సమస్యలు, రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల దుస్థితి, బెంగళూరులో ప్రజా రవాణా వ్యవస్థ దురవస్థలు, ప్రభుత్వోద్యోగుల, అధికారుల బదిలీలలో అవినీతి, ఆశ్రితపక్షపాతం మొదలైనవి పతాక శీర్షికల్లో ఉంటున్నాయి.

ఈ మార్పు నాకు గొప్ప ఉపశమన భావం కలిగించింది. అయితే నా సంతృప్తి ఎంతో కాలం నిలవలేదు. మత సంబంధిత అంశాలు మళ్లీ పతాక శీర్షికలుగా కనిపిస్తున్నాయి. కొద్దినెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనుండడం, కర్ణాటకలో 28 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండడం అందుకొక కారణం. హిందూ ఓటర్లను తన వెనుక సుసంఘటితం చేసుకోవడానికి రాష్ట్ర బీజేపీ సరికొత్త ప్రయత్నాలు చేస్తోంది. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ స్థానిక బీజేపీ శ్రేణులకు ఎక్కడ లేని ధైర్యాన్నిచ్చింది. వారు యథేచ్ఛగా మళ్లీ మెజారిటీవాద రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మాండ్యా జిల్లాలో ఒక గ్రామంలో ఒక వివాదాన్ని రెచ్చగొట్టారు. బహిరంగ ప్రదేశంలో ఉన్న ఒక స్తంభంపై ఏ జెండాను ఎగురవేయాలన్నదే ఆ వివాదం! ఆ స్తంభం ఉన్న ప్రదేశం ఒక పురాతన హనుమాన్ కోవెలకు సమీపంలో ఉన్నందున దానిపై కాషాయ జెండాను ఎగురవేయాలని హిందూత్వ వాదులు పట్టుబడుతున్నారు. ఆ స్తంభం ప్రభుత్వ స్థలంలో ఉన్నందున దానిపై జాతీయపతాకాన్ని ఎగురవేయాలని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు వాదిస్తున్నాయి.



2024 సార్వత్రిక ఎన్నికలను మధ్యయుగాల వైషమ్యాల, శత్రుత్వాల పేరిట పోరాడడానికి కర్ణాటకలోని బీజేపీ శ్రేణులు ఉద్యుక్తమవుతున్నాయి. కాంగ్రెస్ నాయకులు సైతం హిందువులను బుజ్జగించడానికి ప్రయత్నిస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు తమ హిందూ మతనిష్ఠను ప్రదర్శిస్తున్నారు. హిందుత్వవాదుల పద్ధతులను అనుకరించడానికి కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రయత్నాలు వారి నైతిక దివాలాకోరుతనాన్ని చాటుతున్నాయి.

అదొక స్థానిక అంశం. అయితే బీజేపీ తన రాజకీయ ప్రయోజనాలకు దానిపై ఒక అనావశ్యక వివాదాన్ని సృష్టించింది. కర్ణాటక అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు ఆర్. అశోకా ఆ గ్రామానికి వెళ్లి కాషాయ జెండాను ఎగురవేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించకపోవడం హిందువులను అవమానించడమేనని గొంతు చించుకున్నారు. పెద్ద ర్యాలీని నిర్వహించారు. ఆ సందర్భంగా జరిగిన సభలో జనతాదళ్ (సెక్యులర్) నాయకుడు కుమారస్వామి (వ్యక్తిగత ప్రయోజనాలకు పార్టీ ఫిరాయింపులు చేయడంలో ఈయన బిహార్ నితీశ్ కుమార్‌కు సమ ఉజ్జీ) కూడా పాల్గొన్నారు. ఒక 'సెక్యులర్' పార్టీకి నాయకుడుగా ఉన్న కుమారస్వామి కాషాయ ఉత్తరీయాన్ని భుజాలపై కప్పుకుని ఆ సభలో ప్రసంగించారు. జనవరి చివరి వారంలో అన్ని పత్రికలలోనూ ఈ జెండా వివాదమే పతాక శీర్షికగా ఉన్నది. ఇంకా ఇతర బహిరంగ ప్రదేశాలలో కూడా కాషాయ జెండాను ఆవిష్కరించేందుకు బీజేపీ శ్రేణులు పూనుకున్నాయి. ఇదిలా వుండగా హిందువులు, ముస్లింల మధ్య విభేదాలు రెచ్చగొట్టే ఎజెండాను అమలుపరిచేందుకు ఇతర ప్రయత్నాలు కూడ ముమ్మరమయ్యాయి. బీజేపీ సీనియర్ నేత సి.టి. రవి తమ కార్యకర్తల సమావేశంలో చేసిన ఒక ప్రసంగంపై ఫిబ్రవరి 2న 'డెక్కన్ హెరాల్డ్'లో ఒక వార్త వచ్చింది. బీదర్ జిల్లాలోని ఒక దర్గా నిజానికి 12వ శతాబ్దిలో హిందూ మత సంస్కర్త బసవన్న నిర్మించిన మండపం అని రవి అన్నారు. రాష్ట్రంలో బీజేపీ మళ్లీ అధికారానికి వస్తే బసవన్న నిర్మించిన మండపాన్ని పునరుద్ధరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు కాశీ విశ్వనాథ్— ఔరంగజేబ్ మధ్య, సోమనాథ్— గజనీ మహమ్మద్ మధ్య, హనుమాన్ — టిప్పు సుల్తాన్ మధ్య జరగనున్నాయని రవి అన్నారు. కాశీ, మథురలో ఆలయాలను నిర్మించేందుకు నరేంద్ర మోదీ మళ్లీ అధికారానికి రావాల్సిన అవసరముందన్నారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

కర్ణాటక బీజేపీ నాయకులు ఇటువంటి ప్రకటలను చేయడం కొత్త ఏమీ కాదు. అయితే, మరింత గమనార్హమైన విషయం మరొకటి ఉన్నది. అది: కర్ణాటక కాంగ్రెస్ నాయకులు సైతం రాజకీయాలూ, రాష్ట్ర పాలన మెజారిటీవాదానికి అనుగుణంగా ఉండి తీరాలని విశ్వసిస్తున్న హిందువులను సంతృప్తిపరచడానికి ప్రయత్నించడం. విస్మయమూ, విచారమూ కలిగిస్తోన్న విషయమిది. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ జరిగే జనవరి 22న విధిగా పూజలు నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి రాష్ట్రంలోని ఆలయాలు అన్నిటికీ ఆదేశాలు జారీ చేశారు. కేరళలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌ను విలేఖర్లు ఈ విషయమై ప్రశ్నించగా 'చూడండి, మనమందరమూ అంతిమంగా హిందువులమే కదా' అని అన్నారు. అయోధ్య ఉత్సవం అనంతరం రామలింగారెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ, కర్ణాటక వ్యాప్తంగా రామాలయాలకు మరమ్మతుల నిర్వహించేందుకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు విజ్ఞప్తి చేశానని కూడా వెల్లడించారు. నాకు తెలిసినంతవరకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ విజ్ఞప్తికి బహిరంగంగా స్పందించలేదు. గతంలో ఆయన మెజారిటీవాద రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించేవారు. అయితే ఇటీవల ఆయన ప్రకటనలలో ఆ వ్యతిరేకత స్పష్టంగా కనిపించడం లేదు. అయోధ్యలో వేడుకలకు ప్రతిస్పందనగా ఆయన కూడ తన హిందూ మతనిష్ఠను ప్రదర్శించారు. స్వగ్రామానికి వెళ్లి రామాలయంలో పూజలు నిర్వహించారు, 'జై శ్రీరామ్' అని కూడా నినదించారు. హిందుత్వవాదులు చేసే ఈ నినాదాన్ని 1980లకు ముందు ఉత్తరాది రాష్ట్రాల్లో సైతం అరుదుగా మాత్రమే చేసేవారు. బహుశా రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే జైశ్రీరామ్ అని సిద్దరామయ్య ఘోషించి ఉంటారు. 2019 సార్వత్రిక ఎన్నికలలో కర్ణాటకలో కాంగ్రెస్ ఒకే ఒక్క స్థానాన్ని గెలుచుకుంది. ఈసారి ఆ సంఖ్యాబలాన్ని పెంచుకోవల్సి ఉన్నది మరి.


హిందుత్వవాదుల పద్ధతులను అనుకరించడానికి కర్ణాటక కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రయత్నాలు వారి నైతిక దివాలాకోరు తనాన్ని చాటుతున్నాయి. అంతిమంగా వారికి రాజకీయంగా లాభప్రదమయ్యే అవకాశాలూ తక్కువే. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో ఏం జరిగింది? ముఖ్యమంత్రులు భూపేష్ భగెల్, కమల్‌నాథ్‌లు తమ హిందూ మత నిష్ఠను బహిరంగంగా పదే పదే ప్రదర్శించారు. హిందూ మతతత్పరతను చాటుకునే విషయంలో బీజేపీకి ఏ పార్టీ కూడా సాటి కాదు, కాలేదు, కాబోదు. ఆ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలు ఈ వాస్తవాన్ని స్పష్టం చేయలేదా?

దళిత కవిత్వానికి దారిదీపం

శ్రవణ కుమారుడిలా గుండె కావిట్లో దేశాన్ని మోస్తానని బాస చేసిన దేశభక్తుడెవరు? సీమాంతర ఉగ్రవాదం కంటే మనువాద టెర్రరిజం ప్రమాదకరమైనదని హితవు చెప్పిన అధునాతన జాతీయవాది ఎవరు? పురాతన మూర్ఖత్వాన్ని దివ్య విజ్ఞానంగా విద్యాలయాల్లో పిచికారి చేయవద్దని 'సరస్వతమ్మ గారికి వేన వేల దండాలు పెట్టిన జ్ఞానమూర్తి ఎవరు?' ఆరెలతో దూడతోళ్ల మీద మహాకావ్యాలు రాస్తానని ప్రకటించిన పెడద్రపు కవి ఎవరు? కులమతాల అడ్డుగోడలు కూలిపోవాలని, దారిలోని మిట్టపల్లాలను చదును చేయాలని, 'నా సింహాసనం నాకు కావాలని' కాలాన్ని నిలదీసి ప్రశ్నించిన అసమాన కలం యోధుడు ఎవరు? శంబూకుడి మృతనేత్రాల నిప్పు చూపుల మీద కలాన్ని పదును పెట్టుకొని, భాషను అణగారిన వర్గాల యాసతో కడిగిన వెలివాడ 'భీమ' కవి ఎవరు?... వర్తమాన తెలుగు సాహిత్యంలో కనీ వినీ ఎరుగని ఒక పెను సంచలనం మద్దూరి నగేష్ బాబు కవిత్వం. దెబ్బ తిన్న బెబ్బులి పంజా విసిరినట్లు, వీరుడు సంధించిన బాణం శత్రువు గుండెలను ఛిద్రం చేసినట్లు కవిత్వం రాసిన కవి. వాడ కోడిపుంజులకు వేడి వేడి మేలుకొలుపు గీతాలను నేర్పి, దళిత సాహిత్యోద్యమానికి 'పెన్ను దన్ను'గా నిలిచిన కవి. ఒక అగ్ని తుఫానులా సాహిత్యంలోకి దూసుకువచ్చి తాత్త్విక బంధురమైన, దళిత కళాతత్త్వ సుందరమైన మహాకర్తృత్వాన్ని వాగ్దానం చేసి, గగనమెక్కిన కవన నక్షత్రం నగేష్ బాబు.

గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం రుద్రారం గ్రామంలో 1964 ఆగస్టు 15న అనసూయమ్మ, జకరయ్య దంపతులకు నగేష్ బాబు జన్మించాడు. నరసరావుపేట లూథరన్ హైస్కూల్లో పదవతరగతి వరకు చదువుకొని, గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్, బి.ఎ డిగ్రీని పూర్తిచేసి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ పట్టా అందుకున్నాడు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 'తెలుగు, ఆఫ్రికన్ దళిత కవిత్వం—తులనాత్మక పరిశీలన' అనే అంశంపై ఎం.ఫిల్ చేశాడు. ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రంలో వ్యాఖ్యాతగా, ఆ తరువాత డిప్యూటీ తహసీల్దార్‌గా, మండల రెవెన్యూ ఆఫీసర్‌గా, బాపట్ల, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాడు. సమర్థుడైన అధికారిగా అందరి మన్ననలను అందుకున్న నగేష్ బాబు అనారోగ్యంతో 2005, జనవరి 10న మరణించాడు.

ఆధిపత్య సంస్కృతి ఆరాధించే సమస్త భావజాలాన్ని తిరస్కరించి, అట్టడుగు వర్గాల సాంస్కృతిక వైభవాన్ని మద్దూరి నగేష్ బాబు తన కవిత్వం ద్వారా ఉన్నతీకరించాడు. దళిత కవిత్వానికి నిబద్ధుడై ఎత్తిన కలం దించకుండా అట్టడుగువర్గాల బతుకు వెతలను అక్షరబద్ధం చేశాడు.



ప్రారంభ దశలో ప్రేమకవిత్వం రాసిన నగేష్ బాబు, కారంచేడు మారణకాండ అనంతరం దళిత మహాసభ రగిలించిన ఆత్మగౌరవ పోరాట చైతన్యంతో, చారిత్రాత్మక సంకలనం 'చిక్కనవుతున్న పాట' బాటలో, ఉధృతమైన దళిత సాహిత్య ప్రభావంతో, దళిత కవిత్వానికి నిబద్ధుడై ఎత్తిన కలం దించకుండా అట్టడుగువర్గాల బతుకు వెతలను అక్షరబద్ధం చేశాడు. వెలివాడ, మీరేవుట్నూ, లోయ, నరలోక ప్రార్థన కవితా సంపుటాలతో నగేష్ బాబు దళిత సాహిత్య వికాసానికి ఎంతగానో తోడ్పడ్డాడు. బ్రాహ్మణవాదాన్ని దుయ్యబడుతూ ప్రతీకాత్మకంగా ఆయన రాసిన గోదావరి, పుట్ట, దీర్ఘ కవితలు విశిష్టమైనవి. నగేష్ బాబు, జి.లక్ష్మీనరసయ్య, పైడి తెరేష్‌బాబు, ఖాజా రాసిన ధిక్కార కవితలతో కూడిన 'నిశాని' సంకలనం అనేక సాహిత్య చర్చలకు కేంద్రబిందువయింది. రమణ్ లింబార్కర్, బాబూరావు బాగుల్, అరుణ్ కాంబ్లే, ప్రియా అదార్కర్ వంటి సుప్రసిద్ధ కవుల కవితలను తెలుగులోకి అనువదించి భారతీయ సాహిత్యంలోని దళితవాద భావధారను నగేష్ బాబు తెలుగు పాఠకులకు పరిచయం చేశాడు. బాలగంగాధర తిలక్ లాగా కేవలం దశాబ్దికాలం పాటు రచనలు చేసి, తెలుగు కవిత్వంపై ప్రగాఢమైన ముద్రవేశాడు. ప్రజల వ్యవహారానికి సామీప్యంగా పద్యాన్ని ఆధునీకరించిన జాషువా లాగా నగేష్ బాబు తెలుగు వచనకవిత్వ స్వరూప స్వభావాలను దళితీకరించాడు.

దళిత సాహిత్యంలోని అనేక ధోరణులకి నగేష్ బాబు నారుపోసి నీరుపోశాడు. గ్రామీణ ఆర్థిక, సాంఘిక వ్యవస్థలో దగ్ధమైపోతున్న దళితస్త్రీ జీవితాన్ని 'రచ్చబండ' దీర్ఘకవితలో ప్రతిభావంతంగా బొమ్మకట్టించాడు. ప్రత్యేక తెలంగాణతో పాటు, మాదిగ, గిరిజన హక్కుల పోరాటాలకు అండగా నిలబడ్డాడు. 'ఉమ్మడి కడుపు మంటని ప్రసాదించే పథకాలను రద్దు చేసి, ఎవడి ముద్ద వాడే తిందాం పదండి' అని పిలుపునిచ్చాడు. బ్రాహ్మణవాదాన్ని ఎంత తీవ్రంగా ఖండించాడో, మాల బ్రాహ్మల్ని, మాదిగ శాస్త్రుల్నీ కూడా అంతే ఆగ్రహంతో వ్యతిరేకించాడు. దళిత, గిరిజన, బహుజన, ముస్లింల ఐక్యతను నగేష్ బాబు అభిలషించాడు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన తాత్త్వికతను, ఆయన ప్రతిపాదించిన 'మాస్టర్ కీ' మహత్వాన్ని తన కవిత్వంలో సూటిగా చాటి చెప్పాడు.

నగేష్ బాబు ఒక వటవృక్షంలా కాకుండా నల్లకలువల ఉద్యానవనంలా ప్రతినిత్యం పరిమళించాడు. ఒకవైపు తాను కవిగా ఎదుగుతూనే తన మిత్రుల్ని, కొత్తతరం యువకులను దళిత కవులుగా తీర్చిదిద్దాడు. వారి రచనలకు విస్తృతమైన ప్రాచుర్యం కల్పించాడు. ఖాజాతో కలిసి దళిత, బహుజన సాహిత్య ఉద్యమాలకు సాంస్కృతిక ఆలంబనగా నిలిచే విలక్షణ సంకలనాలకు నగేష్ బాబు సంపాదకత్వం వహించాడు. దళితవాదానికి సంపూర్ణ మద్దతునిస్తూ ప్రాబల్యవర్గాల కవులు రాసిన కవితల్ని సేకరించి, దళిత సంఘీభావ కవిత్వంగా ప్రచురించడంలో నగేష్ బాబు చేసిన కృషి చారిత్రాత్మకమైనది. 'కాస్త సిగ్గుపడదాం' అనే పేరుతో వెలువడిన ఈ సంకలనం తెలుగు కవిత్వంలో నిర్మాణాత్మకమైన సంఘీభావానికి తార్కాణం. కులనిర్మూలనా పోరాట స్ఫూర్తిని ప్రబోధిస్తూ దళిత కవులు రాసిన ప్రేమకవితలతో మద్దూరి 'విడి ఆకాశం' పేరుతో కవితా సంకలనాన్ని ప్రచురించాడు. రాణీ శివశంకరశర్మతో కలిసి వెలువరించిన 'ఊరువాడ' సంకర కవిత కూడా సమకాలీన కవిత్వంలో మంచి ప్రయోగం. ఈ విధంగా బహుముఖీనమైన కృషితో నగేష్ బాబు దళిత కవిత్వంలో గొప్పవైవిధ్యాన్ని సాధించాడు.

పల్నాటి పౌరుషాగ్ని జ్వాలలు, పరిశుద్ధ గ్రంథం బైబిల్‌లో ప్రవహించే కరుణా తరంగాలు ఏకోన్ముఖంగా సంగమించినట్లుగా నగేష్ బాబు కవిత్వం కనబడుతుంది. మరాఠీ దళితకవుల్లోని జీవన తాత్త్విక దృష్టి, బ్లాక్ పొయట్రీలోని సౌందర్యం, అన్నింటికీ మించి అద్భుతమైన నాటకీయత, సజీవమైన దేశీయత ఆయన కవిత్వం నిండా దర్శనమిస్తాయి. అంటరానివాడ పలుకుబడిని, నుడికారాన్ని, జాతీయాలను పుంఖాను పుంఖాలుగా ప్రయోగించడం వల్ల మద్దూరి కవిత్వంలో దళిత కళాతత్త్వం ఉట్టిపడుతుంది. దళితవాదానికి ఉచితమైన కొత్త కవి సమయాలను, అపూర్వ సృజన పరికరాలను సమకూర్చుకొని కవితా రూపంలో వినూత్న ఒరవడిని సాధించాడు.

'దున్నపోతుమీద కురిసిన వాన' అనే పలుకుబడికి బదులుగా 'కామధేనువు మీద కురిసిన వాన' అని, 'అడవిగాచిన వెన్నెల'కు బదులుగా 'తులసివనాల్లో కాసిన వెన్నెల' అని నగేష్ బాబు వ్యూహాత్మకంగా ప్రత్యామ్నాయ పదబంధాలను వినిర్మించాడు. 'పవిత్రత' అనే పదాన్ని కనుగొన్న వాణ్ణి ఖైమాకొట్టి, కోయిళ్లకీ హంసలకీ వేయాలంటాడు కానీ పొరపాటున కూడా కాకులకు, గద్దలకు అని మాత్రం రాయడు. మతోన్మాదం, కులోన్మాదం విషతుల్యమైన అసహనం దశదిశలా బుసలుకొడుతున్న సందర్భంలో ఫాసిజం దేశమంతా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ ప్రతీఘాత శక్తులతో యుద్ధం చేయడానికి 'బహుజన కెరటాలు' ప్రచురించిన నగేష్ బాబు సమగ్ర కవిత్వం పదునైన తాత్త్విక ఆయుధంగా ఉపయోగపడుతుంది.

• డాక్టర్ కోయి కోటేశ్వరరావు

(నేడు గుంటూరులో మద్దూరి నగేష్ బాబు సమగ్రకవిత్వం పుస్తక ఆవిష్కరణ సభ)

దేశాభివృద్ధికి దీనదయాళ్ దిశానిర్దేశం

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సామాన్య కుటుంబంలో 1916 సెప్టెంబర్ 25న జన్మించి అసమాన ప్రతిభాపాటవాలతో దేశం గర్వించదగ్గ వ్యక్తిగా ఎదిగారు. విద్యాభ్యాసం అనంతరం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో ప్రచారక్ జీవితాన్ని ప్రారంభించి, 1951లో భారతీయ జనసంఘ్ ఏర్పడుతున్న తరుణంలో ఆరెస్సెస్ నుంచి రాజకీయ క్షేత్రం జనసంఘ్ ప్రచారకులుగా నియమితులయ్యారు. అఖిల భారత అధ్యక్షులుగా పాట్నాకు రైలులో ప్రయాణిస్తున్న దీనదయాళ్ ఉపాధ్యాయ 1968 ఫిబ్రవరి 11న మొఘల్ సరాయ్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం వద్ద విగతజీవిగా పడి ఉన్నారు. వారి మరణం గురించి ఇప్పటివరకు అసలు నిజాలు వెలుగులోకి రాలేదు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మ మానవతావాదం భారతదేశం సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందటానికి తాత్త్విక పునాదిని అందిస్తుంది. ఏకాత్మ మానవతావాదం తాత్త్విక సిద్ధాంతంతో 2047 వరకు అభివృద్ధి చెందిన దేశంగా 'వికసిత్ భారత్–2047' భావనతో పరిపూర్ణం అవుతుంది.




దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం సిద్ధాంతం వ్యక్తి నిర్మాణం, అభివృద్ధితోపాటు సమాజం నిర్మాణం, సమాజం అభివృద్ధిని ధర్మ మార్గంలో నడిపిస్తుంది. వ్యక్తి శరీరం, మనస్సు, బుద్ధి, ఆత్మల కలయిక వలెనే సమాజం కూడా ప్రజలు అనే శరీరం, సంకల్పం అనే మనస్సు, ధర్మం అనే బుద్ధి, ఆదర్శాలు అనే ఆత్మను కలిగి ఉంటుంది. వ్యక్తితో పాటు సమాజం కూడా చతుర్విధ పురుషార్థాలను (ధర్మ, అర్థ, కామ, మోక్షం) ఆచరించినప్పుడు వ్యక్తి, సమాజం పరస్పరం అభివృద్ధి చెంది, మానవత్వం పునాదిగా దేశం సమగ్రాభివృద్ధి చెందుతుందని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. అదేవిధంగా ఆధ్యాత్మిక సాంస్కృతిక పురోగతితో పాటు భౌతిక పురోగతిని కాంక్షిస్తూ సంఘర్షణ రహిత సమాజం నిర్మాణానికి ఈ సిద్ధాంతం దోహదపడుతుంది.

వికసిత్ భారత్–2047 ప్రాథమిక లక్ష్యాలలో స్థిరమైన ఆర్థికాభివృద్ధిని సాధించడం ప్రధానమైనది. భారత ఆర్థిక వ్యవస్థ తయారీ, సేవలు, వ్యవసాయం సాంకేతికతతో సహా బహుళ రంగాలలో వైవిధ్యభరితంగా ఉంటుంది. కొత్త పరిశ్రమలు వ్యాపారాలు ప్రోత్సాహం పొందుతాయి, ఇది ఉద్యోగ కల్పనకు దారితీసి, నిరుద్యోగాన్ని తగ్గిస్తుంది. పునరుత్పాదక ఇంధన వనరులు, పర్యావరణ అనుకూల పద్ధతులపై దృష్టి సారించి, స్థిరమైన అభివృద్ధికి ప్రాధాన్యత లభిస్తుంది. ఏ దేశానికైనా భవిష్యత్తు విద్యావ్యవస్థ నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం, నాణ్యమైన విద్యను పొందేలా చేయడం పౌరులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలుచేయడమే వికసిత్ భారత్ లక్ష్యం. అభివృద్ధి చెందిన దేశానికి పటిష్టమైన మౌలిక సదుపాయాల వ్యవస్థ, హైవేలు, రైల్వేలు, విమానాశ్రయాలు, స్మార్ట్ సిటీలు, గ్రామీణ ప్రాంతాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. వికసిత్ భారత్–2047 భావన ద్వారా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా రూపుదిద్దుకోవడంలో సామాజిక న్యాయం, సమాజంలోని అట్టడుగు వర్గాలను ఉద్ధరించడానికి సామాజిక సంక్షేమ కార్యక్రమాలు రూపొందుతాయి. భారత ప్రభుత్వం ఏకాత్మ మానవవాదం తాత్త్విక సిద్ధాంతం ఆధారంగా ఆత్మనిర్భర్, అంత్యోదయ భావనలతో అనేక పథకాల రూపకల్పన చేసి, పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తుంది. ఇందులో భాగంగానే ఉజ్వల యోజన, జన్‌ధన్ ఖాతాలు, ప్రధాని ఆవాస్ యోజన, ప్రధానమంత్రి సడక్ యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, దీనదయాళ్ గ్రామజ్యోతి యోజన, దీనదయాళ్ కౌశల్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, బేటీ బచావో–బేటి పడావో వంటి పథకాలతో సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ అనే నినాదంతో భారత ప్రభుత్వం ముందుకు సాగుతుంది.

పండిట్ దీనదయాళ్ తాత్త్విక సిద్ధాంతాల పునాదుల మీద 2047 నాటికి వికసిత్ భారత్, స్వదేశీ, స్వశక్తి, స్వాభిమానం, స్వావలంబన దిశగా సాగుతుంది. సంపన్న భారత్ నిర్మాణానికి ప్రభుత్వంతో పాటు యువత కూడా కృషి చేయడమే దీనదయాళ్ ఉపాధ్యాయకు మనం ఇచ్చే ఘన నివాళి.

– డా. శ్రీశైలం వీరమల్ల
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇగ్నో, న్యూఢిల్లీ




పులకించిన పుట్టి పెరిగిన నేల



మన పీవీ.. ఇక భారతరత్నం..

- మరణానంతరం 20 ఏళ్లకు దక్కిన గౌరవం
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు
- బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు
- అంచెలంచెలుగా ప్రధాని స్థాయికి ఎదిగిన పీవీ



వరంగల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లక్నేపల్లి గడ్డపై పుట్టి. వంగర నేలపై పెరిగిన మన పీవీ నర్సింహారావుకు భారతరత్న పురస్కారం లభించింది. ఈ మేరకు గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్విట్టర్ ఎక్స్‌లో పీవీకి భారతరత్న పురస్కారంపై పోస్టు చేశారు. మారుమూల ప్రాంతంలో పుట్టిన పీవీ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నను పొందటంతో ఓరుగల్లు ప్రజల్లో హర్షం వ్యక్తంఅవుతోంది. రాజనీతిజ్ఞుడు, బహుబాషా కోవిదుడు, సంస్కరణలకు ఆద్యుడుగా పిలిచే పీవీ నర్సింహరావు.. తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని భారతరత్నంగా నిలిచారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టి.. ప్రధానిగా పార్లమెంట్‌లో నిలిచి తెలుగు తేజస్సును దశదిశలా చాటిన మహోన్నత వ్యక్తి.

లక్నేపల్లిలో పుట్టి... వంగరలో పెరిగి..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28వ తేదీన రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పీవీ నర్సింహరావు జన్మించారు. ఇదే ప్రాంతంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. అయితే ఐదేళ్లకే అప్పటి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత హనుమకొండ జిల్లా) భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మ దంపతులు పీవీని దత్తత తీసుకున్నారు. అప్పటి నుంచి పాములపర్తి వెంకట నర్సింహరావుగా మారారు. హుజూరాబాద్‌లో పాఠశాల, హనుమకొండలో కళాశాల విద్యను పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ చదువు తుండగానే నిజాం సర్కారుకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో కాంగ్రెస్ నేతలతో పాల్గొన్నారు. 1938లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నిజాం ప్రభుత్వం నిషేధించిన వందేమాతరం గేయాన్ని పాడటంతో యూనివర్సిటీ నుంచి పీవీని బహిష్కరించారు. ఆ తరువాత నాగపూర్‌లోని ఓ మిత్రుడి సహాయంతో 1940 నుంచి 1944 వరకు ఎల్‌ఎల్‌బీ చదివారు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన పీవీ.. కాకతీయ పత్రికను స్థాపించి జయ అనే మా రుపేరుతో వ్యాసాలు రాస్తూ నిజాంపై పోరాటాన్ని కొనసాగించారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల కృష్ణారావుల అనుచరుడిగా స్వాతంత్ర్యోద్యమంలో పీవీ పాల్గొన్నారు. 1951లో ఏఐసీసీ సభ్యుడిగా పీవీ పదవి లభించింది. కాగా, పీవీ నర్సింహరావు సతీమణి సత్యమ్మరావు 1970 జూలై 1న మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో మాజీ మంత్రి పీవీ రంగారావు పెద్ద కుమారుడు కాగా, సికింద్రాబాద్ మాజీ ఎంపీ పీవీ రాజేశ్వర్‌రావు, పీవీ ప్రభాకర్‌రావులు ఉన్నారు. పీవీ కుమార్తెల్లో ఒకరైన వాణిదేవి పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించారు.

రాజకీయ ప్రస్థానం

కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గంలో 1957 నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1962లో రెండోసారి విజయం సాధించిన తరువాత మంత్రిగా అవకాశంవచ్చింది. 1962 నుంచి 1971 వరకు వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. 1971లో సెప్టెంబరు 30న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్ల ఆ పదవిలో కొనసాగిన పీవీ.. అనూహ్య రీతిలో సీఎం పదవిని కోల్పోయారు. ఆ తరువాత రాష్ట్ర రాజకీయాలకు గుడ్‌బై చెప్పి జాతీయ రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. రాష్ట్ర రాజకీయాలకు కరీంనగర్ అండగా నిలబడితే జాతీయ రాజకీయాల్లో మాత్రం వరంగల్ జిల్లా నిలపెట్టింది. తొలిసారి 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హనుమకొండ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తరువాత వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో 1980లో మరోసారి పోటీచే సిన పీవీ రెండోసారి కూడా విజయం సాధించారు. 1980-84 మధ్యకాలంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత 1984లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో హనుమకొండ నుంచి మూడోసారి పోటీ చేసిన పీవీ.. బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి చేతిలో ఓడిపోయారు. అయితే 1984లోనే మరోస్థానం మహ రాష్ట్రలోని రామ్‌టెక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కూడా పోటీ చేసి విజయం సాధించారు. 1984 నవంబరు నుంచి 1985 ఫిబ్రవరి వరకు భారత ప్రణాళిక శాఖ మంత్రిగా, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1985-1989 మధ్యకాలంలో కేంద్ర రక్షణ మంత్రిగా, కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా పీవీ పనిచేశారు. 1989లో నాలుగోసారి రామ్‌టెక్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 1991లో అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ హత్యకు గురైన తరువాత పీవీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1991-96 మధ్య కాలంలో ఏఐసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. అదే సమయంలో ప్రధానమంత్రిగా కూడా పీవీ నర్సింహరావు బాధ్యతలు చేపట్టారు. 1991 జూన్ నుంచి 1996 మే 10వ తేదీ వరకు కొనసాగారు. ఐదేళ్ల పాటు మైనారిటీ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపిన ఘనత పీవీదే.

> "రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహారావు ఈ దేశానికి అందించిన సేవలు అపారం..' ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా అయన చేసిన సేవలు చిరస్మరణీయం. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో ఆయన నాయకత్వం బలమైన పునాది వేసింది. పీవీ హయాంలో ప్రపంచ మార్కెట్‌ను భారత్ ఆకర్షించింది. ఆయన పాలనలో ఆర్థిక వృద్ధికి కొత్త శకం మొదలైంది. విదేశాంగ విధానం, విద్యారంగంలో ఆయన అందించిన సహకారం దేశాన్ని సాంస్కృతంగా, మేధోపరంగా దేశాన్ని సుసంపన్నం చేసింది."
>
> - ట్విటర్ ఎక్స్‌లో ప్రధాని మోదీ



వంగర, లక్నేపల్లిలో సంబరాలు 7

నిధులు గలగల పారేనా?



- రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు కేటాయింపుపై సందిగ్ధం
- హెల్త్‌సిటీకి నిధులు అనుమానమే?
- మామునూరు ఎయిర్‌పోర్టుకు నిధులపై ఆశలు
- మేడారం జాతరకు వరాలు ప్రకటించే అవకాశం
- నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సీఎం



హనుమకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయిస్తోందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలలోని పలు సమస్యల శాశ్వత పరిష్కారానికి, సమగ్రాభివృద్ధికి చేపట్టవలసిన పనులు, అర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు కార్యరూపం ఇవ్వాలంటే ప్రభుత్వం బడ్జెట్‌లో చాలినన్ని నిధులను కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ఈదృష్ట్యా బడ్జెట్‌లో కేటాయింపులు ఎలా ఉంటాయన్న చర్చ జరుగుతోంది.

కాళేశ్వరం నిధులు..?

భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలో చిక్కుకున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు ఈసారి ప్రభుత్వం ఏ మేరకు నిధులు కేటాయిస్తుందన్న విషయంలో సందిగ్ధం నెలకొన్నది. గత బీఆర్ఎస్ సంవత్సరం ఈ ప్రాజెక్టు నిర్వహణకు పెద్దగా నిధులు కేటాయించలేదు. కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ కోసం మాత్రం రూ.750 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. కానీ ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. కొత్త ప్రభుత్వం ఈ టూరిజం సర్క్యూట్ ప్రాజెక్టును కొనసాగిస్తుందా? నిధులు కేటాయిస్తుందా? అన్నదానిపై సందిగ్ధం నెలకొన్నది. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని దేవాదుల, శ్రీ రాంసాగర్ తదితర ప్రాజెక్టులకు ఏ మేరకు బడ్జెట్‌లో పద్దులుంటాయోనన్న చర్చ జరుగుతోంది.

మెగా టెక్స్‌టైల్ పార్క్

గీసుగొండ, శాయంపేట మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులు కుంటినడక నడుస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరతను ఎదుర్కొంటోంది. ఈ బడ్జెట్‌లో ఏ మేరకు నిధుల కేటాయింపు జరుగుతుందో చూడాలి. గత బడ్జెట్‌లో ప్రాతిపదిక సదుపాయల కల్పనకు రూ.160కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయింపు జరగవచ్చునని ప్రజలు ఆశిస్తున్నారు.

హెల్త్ సిటీ

వరంగల్ పాత సెంట్రల్ జైలు స్థలంలో హెల్త్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి కూడా ఏమేరకు నిధుల కేటాయింపు జరుగుతుందో చూడాలి. గత ప్రభుత్వం రూ. 1100 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన విషయంలో కూడా వివాదం తలెత్తింది. ఈ ఆస్పత్రి స్థలాన్ని గత ప్రభుత్వం బ్యాంకులో కుదువబెట్టి రూ.2వేల కోట్లు తీసుకున్నదని, పైగా ఆస్పత్రి పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ప్రభుత్వం విమర్శిస్తోంది. ఈ పరిస్థితుల్లో దీనికి బడ్జెట్‌లో ప్రభుత్వం ఏ మేరకు నిధులు ఇస్తుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అలాగే మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయనున్నట్టు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి

మిగతా 4వ పేజీలో..



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- బాలికల పాఠశాలల నిర్వహణపై సమీక్ష

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 9: జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సంక్షేమంపై ప్రిన్సిపాళ్లు, సంక్షేమ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఎస్సీ, బీసీ, మైనారిటీ, ట్రైబల్ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, కస్తూర్బా బాలికల పాఠశాలల నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. వసతి గృహాల సంక్షేమ అధికారులు, గురుకుల విద్యాలయాల్లో పనిచేసే సిబ్బంది అంకితభావంతో పని చేయాలని తెలిపారు. బాలికల పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థుల రక్షణ, భద్రతా దృష్ట్యా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రతి విద్యార్థికి హెల్త్ కార్డు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం వార్షిక పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, బీసీ, ఎస్సీ, ట్రైబల్, మైనారిటీ వెల్ఫేర్ డీడీలు రాంరెడ్డి, నిర్మల, ప్రేమకళ, మేన శ్రీను, డీఈవో డాక్టర్ అబ్దుల్‌హై, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు, ఆర్‌సీవో విద్యారాణి, వెంకన్న, శ్రీనివాస్, సరిత, సునీ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బల్దియా ఇన్‌చార్జి కమిషనర్‌గా రాధిక గుప్తా



జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 9: వరంగల్ మహానగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధిక గుప్తా బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వ్యక్తిగత కారణాలవల్ల ఈ నెల 22వ తేదీ వరకు సెలవు పెట్టారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా రాధిక గుప్తాను నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారీ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. ఈ క్రమంలో రాధిక గుప్తా శుక్రవారం ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అదనపు కమిషనర్‌లు అనిసూర్ రశీద్, రవీందర్ యాదవ్, పీఆర్‌వో అయూబ్ అలీ, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, క్రిష్ణారెడ్డి, హార్టీకల్చర్ ఆఫీసర్ రమేశ్ తదితరులు రాధిక గుప్తాను కలిసి పూల మొక్కలు అందచేశారు.

తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డి

- ఉద్యమ చరిత్రను చెరిపేయాలని చూస్తున్నాడు..
- పడిపోయినా లేచి నిలిచే శక్తి బీఆర్ఎస్‌కు ఉంది..
- కొత్త శక్తితో నిలబడతాం.. ప్రజల పక్షాన నిలుస్తాం..
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దేశపతి శ్రీనివాస్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 9: తెలంగాణ ఉద్యమంలో రేవంత్‌రెడ్డి ఏరోజూ కనిపించలేదని, ఆయన ఉద్యమ ద్రోహి అని ప్రముఖ కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. శుక్రవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దేశపతి శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. రేవంత్‌కు ఉద్యమ చరిత్ర లేదని, తెలంగాణ ఉద్యమ చరిత్రను చెరిపేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాడని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నంలో, తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేసేందుకు సిద్ధం కావడం, వాహనాలపై ఉన్న టీఎస్‌ను తీసేసి టీజీ పెట్టేందుకు నిర్ణయించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రజలను ప్రలోభాలకు గురిచేసి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డికి రాజకీయ లబ్ధిమీద ఉన్న ఆశ, ప్రజల అవసరాలమీద లేదని దుయ్యపట్టారు. ప్రజా సమస్యలపై అవగాహన లేని ముఖ్యమంత్రి కృష్ణా జలాలను కేంద్రానికి అప్పగించాడని ఆరోపించారు. తనకు ఆర్ఎస్ఎస్ మూలాలున్నాయని మోదీతో చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇద్దరు కలిసి బీఆర్ఎస్‌ను అణచివేద్దామని కుట్ర పన్నారని ఆరోపించారు. కృష్ణ నీటి కోసం నల్లగొండ నుంచి మరో ఉద్యమానికి బీఆర్ఎస్ శ్రీకారం చుట్టబోతోందని దేశపతి పేర్కొన్నారు. కేసీఆర్ గులాబీ జెండా ఎత్తుకున్నాకే తెలంగాణ డిమాండ్ బలపడిందన్నారు. తెలంగాణ ఎవరి దయాదాక్షిణ్యాలతో రాలేదని, ప్రజలు పోరాడి సాధించుకున్నారని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలకు చట్టం చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించిన విషయం బుట్ట దాఖలు చేసారని ఆయన ధ్వజమెత్తారు. ప్రజల కోసం కెరటంలా లేచి ప్రజల పక్షాన నిలుస్తామని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని దేశపతి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. పదవి ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు, బీసీ బంధులాంటి పథకాలు కొనసాగించాలన్నారు. చిరు వ్యాపారుల జోలికి వెళ్లవద్దన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తూ కేసులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. కక్షపూరిత చర్యలకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. త్వరలో పార్టీ కమిటీలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈనెల 13, 14, 15 తేదీల్లో క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, ఆటో కార్మికులను సైతం ఆదుకోవాలని వినయభాస్కర్ సూచించారు. కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. దొంగలు బీఆర్ఎస్‌ను వీడారని, స్వచ్ఛమైన కార్యకర్తలు పార్టీతో ఉన్నారని తెలిపారు. కసిగా పనిచేసి ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామన్నారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నేతలు జనార్దన్‌గౌడ్, జోరిక రమేశ్, శివశంకర్, శ్రీనివాస్, వీరేందర్, సల్వాజు రవిందర్‌రావు, నయీమ్, సారంగపాణి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి మహిళ ఆహుతి

- షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం
- మంటలు ఆర్పుతుండగా మహిళ మృతి
- మర్రిపెల్లిగూడెంలో విషాదం



కమలాపూర్ (హసన్‌పర్తి), ఫిబ్రవరి 9: ఇంట్లో నిలువ చేసిన పత్తి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతుండగా.. వాటిని ఆర్పుతున్న క్రమంలో మంటలు అంటుకుని మహిళ మృతిచెందింది. ఈ ఘటన శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపెల్లిగూడెంలో జరిగింది. కమలాపూర్ హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం..

కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెంకు చెందిన తోడేటి సౌందర్య(54) గృహిణి. భర్త తోడేటి రాజయ్య గీత కార్మికుడు. ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి నిలువ చేసిన పత్తికి మంటలు అంటుకున్నాయి. గమనించిన సౌందర్య మంటలను ఆర్పే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆమె కూడా మంటల్లో చిక్కుకుని కాలిపోయింది. ఇంట్లో నుంచి పొగలు వస్తుండడాన్ని గమనించిన చుట్టు పక్కల వారు తాటివనంతో ఉన్న ఆమె భర్త రాజయ్యకు సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకుని తలుపులు తెరిచి చూసేసరికి పత్తితో పాటు భార్య పూర్తిగా కాలిపోయి కనిపించింది. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వచ్చి మంటలను ఆర్పారు. 8 క్వింటాళ్ల పత్తితో పాటు ఇంట్లో నిల్వ ఉన్న 6 క్వింటాళ్ల బియ్యం కూడా దగ్ధమయ్యాయి. మృతురాలికి భర్తతో పాటు ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


- మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు
- ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం




కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 9: ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల సుపరిపాలన గురించి ప్రజలకు వివరించేందుకే 'గావ్ చలో, బస్తీ చలో' అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం 9వ డివిజన్‌లో సుధానగర్, కాకతీయ కాలనీ, గణేష్ నగర్ కాలనీ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. 24 గంటలపాటు సుమారు 300 ఇళ్లను సందర్శించి కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వివిధ పథకాల అమలుతీరును ఆయన వివరించారు.

ఈ సందర్భంగా మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. మూడోసారి కూడా కేంద్రంలో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు సైతం సుభిక్ష పాలన రావాలంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కస్తూరి నవీన్ కుమార్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి కొత్తపెల్లి నవీన్, బూత్ అధ్యక్షులు జంపాల మనీష్, అల్లం శ్యామ్, గంజి రాజేష్, యువమోర్చా అధ్యక్షుడు హేమంత్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







నిధులు గలగల పారేనా?

(3వ పేజీ తరువాయి)

ప్రకటించారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ఎయిర్‌పోర్టుకు నిధుల కేటాయింపు జరగవచ్చునని భావిస్తున్నారు.

నగరాభివృద్ధి

వరంగల్ నగరాభివృద్ధికి బడ్జెట్‌లో చాలినన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ఔటర్ రింగ్ రోడ్డు పనుల పూర్తికి నిధులేమైనా బడ్జెట్‌లో కేటాయింపు జరుగుతుందా? నిధుల లేమి వల్ల కాళోజీ కళాక్షేత్రం పనులు పదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. రూ. 50 కోట్లతో చేపట్టి ఈ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. అంచనా వ్యయంతో రూ.100కోట్లకు పెరిగింది. కళాక్షేత్రాన్ని పూర్తి చేయడానికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

మెగా లెదర్ పార్క్


జనగామ జిల్లా పరిధిలోని మెగా లెదర్ పార్క్ ఏర్పాటు చేస్తామని 2016లో అసెంబ్లీ సాక్షిగా కేటీఆర్ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు సాకారం కాలేదు. ఈ పార్క్ ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ దృష్ట్యా ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగవచ్చునని జనగామ జిల్లా వాసులు ఆశపడుతున్నారు. కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్ దేవరుప్పుల, నష్కల్‌లో ఫుడ్ ప్రాజెసింగ్ జోన్ల ఏర్పాటు విషయమై బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.

బయ్యారం ఉక్కు

గత బడ్జెట్‌లో మహబూబాబాద్ జిల్లాకు కేసీఆర్ ప్రభుత్వం మొండి చేయిచూపింది. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం సాగుతోంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవలే ఢిల్లీలో ఈ విషయమై సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ప్రాథమిక పనులకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా శనివారం నాటి బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన ఉండొచ్చని ఆశిస్తున్నారు. మల్యాలలో కృషి విజ్ఞాన కేంద్రం జెన్నారెడ్డి వెంకట్‌రెడ్డి స్మారక ఉద్యానవన ఫల పరిశోధన కేంద్రానికి అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కోసం నిధుల ప్రకటనను జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

మేడారం జాతర

సీఎం రేవంత్ రెడ్డికి మేడారం సమ్మక్క సారలమ్మ జాతరతో సెంటిమెంట్ ఉంది. కిందటేడు పాదయాత్రను ఇక్కడి నుంచే మొదలు పెట్టారు. ముఖ్యమంత్రిగా పదవిని అధిష్టించారు. ఈ క్రమంలో ఈ సారి జాతరకు రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేడారం జాతరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల ప్రకటన ఏమైనా ఉంటుందా? అని ములుగు జిల్లా వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జాతరను జాతీయ పండుగ హోదాను కల్పించడంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే విషయమై బడ్జెట్‌లో ప్రస్తావన ఉంటుందా? అని చర్చించుకుంటున్నారు.







ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం ● 10 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com



పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా చిరంజీవిని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ సత్కరించారు. చిరంజీవి, సురేఖ దంపతులు శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. చిరంజీవికి ప్రతిష్మాత్మకమైన పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించడం పట్ల సౌందరరాజన్ హర్షం వ్యక్తం చేశారు. కోట్లాది ప్రేక్షక హృదయాలను గెలుచుకున్నారని ఆమె చిరంజీవిని అభినందించారు.



కాంబినేషన్ కుదిరింది



విభిన్న కథలు, సరికొత్త గెటప్పులతో ప్రేక్షకులను మెప్పించడం తమిళ హీరో విక్రమ్ పంథా. ఆయన కథానాయకుడిగా ఎస్ యూ అరుణ్ కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'చియాన్ 62' వర్కింగ్ టైటిల్. ఇందులో విక్రమ్ ఎలాంటి పాత్ర చేయబోతున్నారనేది ప్రస్తుతానికి సస్పెన్స్. తాజాగా చిత్రబృందం స్పెషల్ అప్‌డేట్‌ను వదిలింది. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మరో స్టార్ యాక్టర్ ఎస్ జే సూర్య భాగమవుతున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. ఈ చిత్రంలో సూర్య మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో కనిపిస్తారని యూనిట్ తెలిపింది. రియా శిబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ఏదో ఏదో మాయ

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. ఏ హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. మార్చి 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. శుక్రవారం 'ఏదో ఏదో మాయ' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేసింది. రవి బస్రూర్ స్వరపరిచిన ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: స్వామి జె గౌడ. ఎడిటర్: తమ్మిరాజు



కమల్ ఆదాయం ఎంతో తెలుసా?



తమిళ చిత్రరంగంలో ప్రస్తుతం అత్యధిక ఆదాయం సంపాదిస్తున్న హీరో ఎవరో ఊహించండి. రజనీకాంత్.. విజయ్, అజిత్, ధనుష్, సూర్య..? వీళ్లెవరూ కాదు.. కమల్ హాసన్. ఆశ్చర్యంగా ఉంది కదూ. అవును తమిళ చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం అత్యధిక ఆదాయం పొందుతున్న హీరో ఆయనే!. పారితోషికం పరంగా కానీ, సినిమాల లాభాల్లో వాట పరంగా కానీ తన సొంత చిత్ర నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఇంటర్నేషనల్ నిర్మించే చిత్రాల ఆదాయం వల్ల కానీ కమల్ మిగిలిన హీరోల కంటే ఓ మెట్టు పైనే ఉన్నారు. ఆయన వార్షిక ఆదాయం రూ. 570 కోట్లు. ఒక సినిమాలో నటించడానికి ప్రస్తుతం కమల్ తీసుకుంటున్న పారితోషికం రూ. వంద కోట్లు. అలాగే రూ 450 కోట్ల ఆదాయంతో కమల్ మిత్రుడు రజనీకాంత్ రెండో స్థానంలో ఉన్నారు.. మూడో స్థానంలో రూ. 410 కోట్ల ఆదాయంతో హీరో విజయ్ ఉన్నారు. ఇక అజిత్ రూ. 350 కోట్లు, సూర్య రూ 300 కోట్లు, ధనుష్ రూ 160 కోట్లు, కార్తి రూ 110 కోట్లు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఇటీవల ఓ ఆంగ్ల మీడియాలో వచ్చిన ఈ అంకెల వివరాలు ఇప్పుడు జనంలో చర్చనీయాంశం అయ్యాయి.



నేనూ ప్రేమలో పడ్డా

సుబ్బు, శ్రీవల్లి, కిట్టయ్య ప్రధాన పాత్రలు పోషించిన 'ఏ హేట్ లవ్' చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. 'నేనూ ప్రేమలో పడ్డా' అనేది ఉప శీర్షిక. వెంకటేశ్ రవి దర్శకత్వంలో డాక్టర్ బాల రవి ఈ సినిమాను నిర్మించారు. చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు వీరశంకర్ ఆవిష్కరించారు. సినిమాకో ప్రొడ్యూసర్ పాలగుమ్మి వెంకట కృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మంచి చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. అలాగే మా సినిమా కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. దర్శకుడు వెంకటేశ్ మాట్లాడుతూ 'కోనసీమ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. యూత్‌ను ఆకట్టుకొనే సందేశాత్మక చిత్రం ఇది' అని చెప్పారు. ఈ చిత్రానికి అంగర శివ సాయి గౌడ ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

డే వన్ పోరాటం

2018లో వచ్చిన హాలీవుడ్ హారర్ థ్రిల్లర్ 'ఏ క్వైట్ ప్లేస్' ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది. ఏ మాత్రం అలికిడి అయినా మనుషులను గుర్తుపట్టి నంజుకుతినే విచిత్ర జీవులతో ఓ కుటుంబం జరిపిన పోరాటం ప్రేక్షకులను థ్రిల్ చేసింది. ఆ తర్వాత అదే ఫ్రాంచైజీలో వచ్చిన పార్ట్ 2 కూడా సక్సెస్ అయింది. ఈ ఫ్రాంచైజీలో మూడో పార్ట్ 'ఏ క్వైట్ ప్లేస్: డే వన్' చిత్రం జూన్ 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. నిర్మాణ సంస్థ పారామౌంట్ పిక్చర్స్ ట్రైలర్‌ను గురువారం విడుదల చేసింది. మానవాళిని అంతమొందించే విచిత్ర గ్రహాంతర జీవులు భూమిమీదకు ఎలా వచ్చాయి, తొలి రోజు అవి ఎలాంటి విధ్వంసం సృష్టించాయి అనేది ట్రైలర్‌లో ఆసక్తికరంగా అనిపించింది. గ్రాఫిక్స్ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి మైఖేల్ సర్నోస్కీ దర్శకత్వం వహించారు. జిమోన్ హౌన్సో, అలెక్స్ వోల్ఫ్ కీలకపాత్రలు పోషించారు.



హాలీవుడ్ స్థాయి యాక్షన్‌తో



విద్యుత్ జమ్వాల్ కథానాయకుడిగా నటిస్తూ, నిర్మించిన స్పోర్ట్స్ యాక్షన్ చిత్రం 'క్రాక్'. నోరా ఫతేహీ కథానాయిక. అర్జున్ రామ్‌పాల్ ప్రతినాయక పాత్ర పోషించారు. ఆదిత్య దత్ దర్శకుడు. ఈ నెల 23న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం చిత్రబృందం ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో 'క్రాక్' ట్రైలర్‌ను విడుదల చేసింది. భారతీయ ప్రేక్షకులకు హాలీవుడ్ స్థాయి యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమా ద్వారా చూపించబోతున్నాం, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది అని విద్యుత్ జమ్వాల్ తెలిపారు. చాలా ప్రమాదకరమైన ప్రదేశాల్లో జమ్వాల్ ఎలాంటి జంకు లేకుండా స్టంట్స్ చేశారని దర్శకుడు తెలిపారు.

షో టైమ్ ఖరారు

బంధుప్రీతి బాలీవుడ్ చిత్ర పరిశ్రమను ఎలా ప్రభావితం చేస్తుందనే అంశం చుట్టూ, వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న హిందీ సిరీస్ 'షో టైమ్'. ఇమ్రాన్‌హష్మీ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మౌనీరాయ్, మహిమా మక్వానా, శ్రియా శరణ్, నసీరుద్దీన్ షా ప్రధాన పాత్రధారులు. మిహిర్ దేశాయ్, అర్చిత్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్ జోహార్ నిర్మాత. శుక్రవారం ఆయన ఈ సిరీస్ స్ట్రీమింగ్ డేట్‌ను సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. మార్చి 8నుంచి ఈ సిరీస్ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఈ సందర్భంగా ఆయన చిత్రీకరణకు సంబంధించిన ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. 'ఇది నా మనసుకు బాగా నచ్చిన సిరీస్, ఇందులో ఇప్పటివరకూ బాలీవుడ్ తన అంతరాలలో దాచుకున్న ఎన్నో రహస్యాలను వెలుగులోకి తేబోతున్నాం' అని చెప్పారు.



ఎడ్యుకేషన్ ట్రస్ట్‌తో నిట్ ఒప్పందం

కాజీపేట, ఫిబ్రవరి 9: హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, నిట్‌తో శుక్రవారం నిట్ క్యాంపస్‌లో ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ మేరకు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సభ్యుడు ఎంఎల్ఎన్ వరప్రసాదరావు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆదిత్య ఆర్య, రిటైర్డ్ డీజీపీ డాక్టర్ అనంత మాధవమోహన్, ప్రొఫెసర్లు అంబప్రసాద్, పి.శ్రీహరిరావు, రాజ్‌మోహన్ పాల్గొన్నారు. అంతకుముందు క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో సెంటర్‌ఫర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ అనే అంశంపై వర్క్‌షాపు జరిగింది.



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న నిట్ బిద్యాధర్ సుబుధి

కెనాల్‌లో పడిపోయిన వాహనం

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 9: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతగట్టు క్యాంపు వద్ద శుక్రవారం రాత్రి బొలేరో వాహనం పడిపోయింది. హనుమకొండ నుంచి ఇద్దరు వ్యక్తులు కరీంనగర్ వైపు బొలేరో వాహనంలో వెళుతున్నారు. కెనాల్ బ్రిడ్జికి సరైన రేలింగ్ లేకపోవడంతో అదుపుతప్పి వాహనం కెనాల్‌లో పడిపోయింది. వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనం వెలికితీసే యత్నం చేశారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వాహనం వెలికి తీయలేని పరిస్థితి ఉంది. కాగా, వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు తమిళనాడుకు చెందినవారిగా పోలీసులు తెలిపారు.

ఎంజీఎంలో స్తంభించిన సేవలు

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 9: ఎంజీఎం ఆస్పత్రిలో మలేరియా, డెంగీ ల్యాబ్‌లు తెరుచుకోవడం లేదు. అదే విధంగా టీబీ వ్యాధి సేవలు సైతం నిలిచిపోయాయి. ఈ సేవల కోసం ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్న రోగుల తీవ్ర అవస్థలు పడుతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని అన్ని రకాల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఎంజీఎం ఆస్పత్రిలోని మలేరియా, డెంగీ ల్యాబ్‌తోపాటు జిల్లా క్షయ వ్యాధి నివారణ కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగుల డిప్యూటేషన్లు కూడా రద్దు అయ్యాయి. ఆయా ఉద్యోగులు వారి వారి సొంత స్థానాల్లో చేరిపోయారు. ఫలితంగా సేవలకు అంతరాయం ఏర్పడింది.

బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ న్యాయవాది వేముల రమేష్


అదాలత్ సెంటర్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న న్యాయవాదులు

సుబేదారి, ఫిబ్రవరి 9: బీఆర్ఎస్ చిల్లర నాయకుడు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ న్యాయవాది వేముల రమేష్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా లీగల్ సెల్ న్యాయవాదుల ఆధ్వర్యంలో శుక్రవారం అదాలత్ సెంటర్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వేముల రమేష్ మాట్లాడుతూ.. ఉస్మానియా విద్యార్థి నాయకుడిగా, తెలగాణ ఉద్యమనాయకుడిగా చెప్పుకునే బాల్క సుమన్.. గత ఎన్నికల్లో ఓటమిపాలై, రేవంత్ రెడ్డి సారథ్యంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని జీర్ణించుకోలేక విచక్షణకోల్పోయి మాట్లాడుతున్నాడన్నారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులకు సుమన్ క్షమాపణ చెప్పాలని, లేదంటే రాష్ట్రంలో ఎక్కడా తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ న్యాయవాదులు కందుకూరి రజనీకాంత్, సిద్దం యుగేందర్, అరుణ్ ప్రసాద్, ఆనంద్ మోహన్, తోట రాజ్‌కుమార్, రేత రాజు రవి, నల్ల మహాత్మ, నిఖిల్, వినయ్, శ్రీనాథ్, అరుణ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేయాలి

వడ్డెపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేయాలని కాంగ్రెస్ వరంగల్ లీగల్ సెల్ చైర్మన్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర నేత జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ లీగల్ సెల్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకొని జాగ్రత్తగా మాట్లాడాలని, సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బాల్క సుమన్ కల్వకుంట్ల కుటుంబానికి బానిసగా మారి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని భాషను మార్చుకోవాలని హితవు పలికారు. అనంతరం హనుమకొండలోని అశోక జంక్షన్‌లో బాల్క సుమన్ దిష్టి బొమ్మను చెప్పులతో కొట్టి దహనం చేశారు. తొలుత పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని సీపీ కార్యాలయంలో పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝాను కలిసి బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర, జిల్లా నాయకులు తోట రాజ్‌కుమార్, పోతరాజు రవి, అబ్బాస్ అలీ, నోముల నరేందర్ యాదవ్, రవీందర్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ మహిళాఅధ్యక్షురాలు బంక సరళాయాదవ్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న రావుల శ్రీనివాస్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి

నేడు ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా

సుబేదారి, ఫిబ్రవరి 9 : ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ(బాలుర) కళాశాలలో శనివారం అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. జుమ్లానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్(హెలిక్యాప్టర్ తయారీ సంస్థ)వారు ఈ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్రెంటిస్ మేళాకు హాజరుకావాలనుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా ఐటీఐలో ఫిట్టర్ లేదా మెషినిస్ట్ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులై ఉండాలని, 18 నుంచి 24 ఏళ్ల వయో పరిమితి కలిగి ఉండాలని జుమ్లానాయక్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అనధికార నిర్మాణాల తొలగింపు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 9: జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో వరంగల్ ఉర్సు, కరీమాబాద్ ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలను అధికారులు శుక్రవారం కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా పెంట్‌హౌస్‌లు నిర్మించడం, ప్లాన్‌కు విరుద్ధంగా జరిపిన నిర్మాణాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో రెండురోజుల జాతీయ సదస్సు

సుబేదారి, ఫిబ్రవరి 9 : సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని కామర్స్ విభాగంలో 'తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆర్థిక సహకారంతో ఫిన్‌టెక్ విప్లవం డిజిటల్ యుగంలో ఆర్థిక సేవలను పునర్నిర్మించడం' అనే అంశంపై శుక్రవారం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేయూ వీసీ తాటికొండ రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న ఐలయ్యాలు అధ్యాపకులతో కలిసి సెమినార్ బ్రోచర్లను ఆవిష్కరించారు. మొదటిరోజు సదస్సులో పరీక్షల నియంత్రణాధికారి డ్టార్ ఏ. రాజు, సెమినార్ డైరెక్టర్ మాదాసి కనకయ్య, కామర్స్ విభాగ అధ్యాపకులు డాక్టర్ సావుల సురేష్, డాక్టర్ ఏ. సునిత, కళాశాల అధ్యాపకులు డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ ఫిరోజ్ పాషా పాల్గొన్నారు.

విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు బోనస్ చెల్లించాలి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 9: హనుమకొండలోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో బస్సు డ్రైవర్లుగా పనిచేస్తున్న అబ్దుల్ హలీమ్, సాధిక్‌లను అకారణంగా తొలగించారని, వీరికి కార్మిక చట్టాల ప్రకారం రావాల్సిన వేతనంతోపాటు బో నస్ ఇప్పించాలని తెల ంగాణ ఓరుగల్లు ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్స్, క్లీనర్స్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొడ్డిపాటి సారయ్య, ప్రధాన కార్యదర్శి బండి భాస్కర్లు కార్మిక శాఖ ఉప కమిషనర్ రమేష్‌ను కోరారు. శుక్రవారం హనుమకొండలోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆయనను యూనియన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల్లో 8 యేళ్లుగా అబ్దుల్ హలీం, సాధిక్ 6 యేళ్లుగా డ్రైవర్లుగా పనిచేస్తున్నారని అన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా వీరిని తొలగించారని వీరికి రావాల్సిన వేతనాలు, బోనస్ ఇప్పించాలని సంబంధిత ప్రిన్సిపాల్‌పై తగిన చర్య తీసుకోవాలని కోరారు. కార్మిక శాఖ ఉప కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘ నేతలు పూజారి హరిప్రసాద్, మిరుపురి బెనర్జి, పల్నాటి రమేష్, గొడిశాల నరేష్ తదితరులు ఉన్నారు.

కేయూ పీహెచ్‌డీ-2 అడ్మిషన్ల ప్రవేశాలపై కమిటీ

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 9: కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ-2 అడ్మిషన్లపై ప్రవేశాలపై నిజనిజాలను తేల్చేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు ప్రొఫెసర్ వెంకటరమణ నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణతోపాటు సీపీగెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, మరో టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటేశ్వర్లుతో కూడిన త్రిసభ్య కమిటీని నియమించారు. కేయూ పీహెచ్‌డీ-2 అడ్మిషన్లపై రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పీహెచ్‌డీ-2 అడ్మిషన్లపై వర్సిటీలో నిరసన ఆందోళనలు, పోలీసుల దాడులు, విద్యార్థుల నిరసన దీక్షల నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రముఖ రాజకీయ నేతలు విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అడ్మిషన్లలో నిజనిజాలను నిగ్గు తేల్చేందుకు కమిటీని ఏర్పాటు చేయడంపై వర్సిటీలో తీవ్రమైన చర్చ జరుగుతోంది. విచారణ కమిటీ సభ్యులందరూ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు కావడంతో వర్సిటీ అధికారులను రికార్డులను హైదరాబాద్‌కు తేవాలని చెబుతారా? లేదా వర్సిటీలోనే విచారిస్తారా; విషయాన్ని గోప్యంగా ఉంచారు. అయితే పీహెచ్‌డీ-2 బాధితులు, విద్యార్థి సంఘాల నేతలు త్రిసభ్య కమిటీతో మాట్లాడనున్నారని తెలిసింది.

నకిలీ ఫిట్‌నెస్ తయారీదారులను అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 9: ఆర్‌టీవో ఆఫీసు ఎదురుగా ఉంటూ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు తయారు చేసే వారిని శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వరంగల్ ఆర్‌టీవో ఆఫీస్ కార్యాలయం ఎదురుగా గొడుగు ప్రభాకర్, గొడిశాల ప్రకాశం, హనుమకొండ చింతగట్టు ఆర్‌టీఓ ఆఫీస్ వద్ద ఠాగూర్ మోదీసింగ్, చెల్ల నర్సింహారావు అనే వ్యక్తులు వుంటూ డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం తప్పనిసరైన ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ ఇస్తూ డబ్బులు వసూళ్లు చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు వీరివద్ద స్టాంపులు, స్టాంపు ప్యాడ్‌లు, సంతకాలు పెట్టి పేర్లు రాయకుండా ఖాళీగా ఉన్న ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, గ్రీన్ పెన్నులు స్వాధీనం చేసుకున్నారు. విచారణ కోసం నిందితులను పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అల్లం రాంబాబు, ఎస్సై శరత్, హెడ్‌కానిస్టేబుల్స్ అశోక్, రఘు ఉన్నారు.

సమగ్ర వివరాలతో నమోదు చేయండి..

బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 9: గ్యాస్ లబ్ధిదారుల సమగ్ర వివరాలతో నమోదు జరగాలని బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా మెప్మా ఆర్‌పీలను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా డివిజన్లవారిగా వివరాలు ఉండాలన్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు జరుగుతుందన్నారు.

అండర్-20 రెజ్లింగ్ చాంపియన్ హైదరాబాద్

ముగిసిన రాష్ట్రస్థాయి అండర్-20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు

హనుమకొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 7: తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో అండర్ 15, 20 బాలబాలికల విభాగాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ముగిశాయి. అండర్-20 రెజ్లింగ్ విభాగంలో గురువారం రాత్రివరకు జరిగిన హోరాహోరీ పోరులో హైదరాబాద్ జట్టు రంగారెడ్డి జట్టుపై విజయం సాధించి చాంపియన్‌షిప్ సాధించింది. రంగారెడ్డి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. శుక్రవారం ఇండోర్‌స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రీడా ముగింపు సమావేశంలో నిర్వాహకులు విజేతగా నిలిచిన జట్లకు ట్రోఫీతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 600 మంది బాలబాలికలు పాల్గొన్నారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డి. కరీమ్ తెలిపారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభతో రాణించిన క్రీడాకారులను ఈనెల 11 నుంచి 17 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ రెజ్లింగ్ పోటీలలో 33, 36, 39, 42, 46, 50, 54, 58, 62, 66 కేజీల విభాగాలలో బాలురకు ఫ్రీస్టైల్, గ్రీకు రోమన్, బాలికలకు ఫ్రీస్టైల్ కేటగిరిలలో పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అసోయేషన్ బాధ్యులు సుధాకర్, శ్రీనివాస్, రాజు, సాయిలు, రాజేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

11న రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 9: ఈ నెల 11వ తేదీన హనుమకొండ భీమారంలోని కేఎల్ఎన్ కన్వెన్షన్ హాలులో ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) నేతలు తెలిపారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో టీజీటీఏ అసోసియేటెడ్ ప్రెసిడెంట్ బి.నాగేశ్వర్‌రావు, వైస్‌ప్రెసిడెంట్ మహ్మద్ ఇక్బాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.విక్రమ్‌కుమార్ మాట్లాడారు. ఎన్నో ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధిం చుకున్నామని, స్వరాష్ట్రంలలో భూ రికార్డుల ప్రక్షాళన చేసి పాలకుల మెప్పు పొందాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ కుటుంబ సభ్యులను, ఉద్యోగ సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి ఉద్యోగుల్లో భరోసా నింపేందుకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు.

సీపీని కలిసిన కొత్త ఇన్‌స్పెక్టర్లు


సీపీ అంబర్ కిశోర్ ఝాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఇన్‌స్పెక్టర్లు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 9: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇటీవల పెద్దఎత్తున ఇన్‌స్పెక్టర్లు బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు వివిధ పోలీసుస్టేషన్‌లలో బాధ్యతలు చేపట్టిన అధికారులు శుక్రవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. సీపీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసా ప్రజలకు కల్పించాలని సూచించారు. సీపీని కలిసిన వారిలో ఇన్‌స్పెక్టర్లు గోపి, సతీష్, అబ్బయ్య, సంతోష్, బాబులాల్, శ్రీనివాస్, చంద్రమోహన్, శ్రీధర్, కరుణాకర్‌లు ఉన్నారు.

ఎస్సార్ యూనివర్సిటీలో మోడల్ యునైటెడ్ నేషన్ ప్రోగ్రామ్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 9: మండలంలోని అనంతసాగర్ వద్ద గల ఎస్సార్ యూనివర్సిటీలో శుక్రవారం మోడల్ యునైటెడ్ నేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆర్.అర్చనారెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 380 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యార్థులు ఆయా దేశాల్లోని ముఖ్యమైన సమస్యలపై చర్చించి, పరిష్కారాలు తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ ఎండీ సల్లావుద్దీన్, ప్రిన్సిపాల్ ఐ.రాజశ్రీ, డీన్ వినూత్న, కో-ఆర్డినేటర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 9: ఆశా వర్కర్లకు రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ మాట్లాడుతూ.. జిల్లాలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు డిసెంబరు, జనవరి నెలలకు సంబంధించిన పారితోషికాలు ఇంకా రాలేదని, గతంతో ప్రతీ నెలా 2వ తేదీన ఆశావర్కర్ల ఖాతాల్లో పడేవని తెలిపారు. నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో కుటుంబ అవసరాల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు కాసు మాధవి మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.18వేలు పెంచి, ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈనెల 16వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును అందజేశారు. ఆశా వర్కర్లు యాకూబీ, రజిత, శ్రీవాణి, రమ, పద్మ, శోభ, శ్వేత, గంగ, జమున, నవమని పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 9: కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగ, కార్మికులకు వేతనాలు పెంచకపోతే ఫిబ్రవరి 16 నుంచి సమ్మెకు దిగుతామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ నేతృత్వంలో ఉద్యోగులు సమ్మె నోటీసును అందచేశారు. శుక్రవారం కేయూ పరిపాలన భవనంలోని రిజిస్ట్రార్ చాంబర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా రాగుల రమేశ్ మాట్లాడుతూ.. వర్సిటీలో ఉద్యోగులకు ఆరేళ్లుగా వేతనాలు పెంచడం లేదన్నారు. 507 మంది దినసరి, లంసం, క్యాజువల్, ఫుడ్ వర్కర్లు వేతనాలు పెరుగకపోవడంతో కుటుంబాల పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కనీస వేతనాలు అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌తో ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మెకు దిగుతున్నామని స్పష్టం చేశారు. ఉద్యోగుల మధ్యలో చిలికలు తెచ్చేందుకు వర్సిటీ అధికారులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వేతనాలు పెంచకపోతే భవిష్యత్‌లో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) కేయూ అధ్యక్షుడు ఆకుతోట రామచందర్, ప్రధాన కార్యదర్శి దేశిని రవికుమార్, కోశాధికారి మొగిలి రాజేందర్, ఆఫీస్ బేరర్స్ మధు, సంగాల రాజు, ఎస్. శ్రీనివాస, శోభ తదితరులు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, సీఐటీయూ మండల కార్యదర్శి పుల్ల అశోక్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం హసన్‌పర్తిలో భారత్ బంద్ వాల్ పోస్టర్‌ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి మంద సందర్, కీర్తి సమ్మక్క, భిక్షపతి, కిషన్, మంజుల, హేమలత, సారయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.


బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట పోస్టర్‌ను ఆవిష్కరించిన అవుట్ సోర్సింగ్ జేఏసీ ప్రతినిధులు

● జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ): ఈ నెల కార్మికుల తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె పోస్టర్‌ను జీడబ్ల్యూఎంసీ అవుట్ సోర్సింగ్ జేఏసీ ప్రతినిధులు ఆవిష్కరించారు. శుక్రవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు పుల్లా రమేశ్, గ్రేటర్ మున్సిపల్ సంఘ అధ్యక్షుడు పాశం రవి యాదవ్, ఏక సుధాకర్ పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి


మహాసభల పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 9 : దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, సీఐటీయూ మండల కార్యదర్శి పుల్ల అశోక్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం హసన్‌పర్తిలో భారత్ బంద్ వాల్ పోస్టర్‌ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లయినా రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. రెండు కోట్ల ఉద్యోగాల ఊసేలేదన్నారు. ఈ నెల 16న జరిగే భారత్ బంద్‌లో అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి మంద సందర్, కీర్తి సమ్మక్క, భిక్షపతి, కిషన్, మంజుల, హేమలత, సారయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

పీవీ దేశానికే గర్వకారణం

కాజీపేట, ఫిబ్రవరి 9 : తెలంగాణ బిడ్డ, బహుభాషా కోవిదుడు, దివంగత ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న రావడం యావత్ దేశానికి గర్వకారణం అని తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ అభిప్రాయపడ్డారు. పీవీకి భారతరత్న అవార్డుపై శుక్రవారం ఆయన కాజీపేటలో మీడియాతో మాట్లాడారు. భూదానోద్యమంలో వేల ఎకరాల భూములను పేదలకు పంచిన మహనీయుడు పీవీ నర్సింహారావు అని చెప్పారు. రాష్ట్ర మంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖలకు మంత్రిగా, దేశ ప్రధానిగా దేశంలో ఆర్థిక సంస్కరణలు తెచ్చిన మహనీయుడన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

తెలుగు నేల పుత్రుడు పీవీ

హనుమకొండ రూరల్: తెలుగు నేల పుత్రుడు అయిన పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నతన పురస్కారం భారతరత్న ప్రకటించడం పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పీవీని ఎన్నో అవమానాలను గురి చేసినా నేడు బీజేపీ ఆయన సేవలను గుర్తించి తగిన గుర్తింపు ఇచ్చిందన్నారు. ఎన్నో ఏళ్లుగా మాతృభూమికి వివిధ రూపాల్లో సేవలందిం చిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావును భారతరత్నతో సత్కరించడం సతోషకరమైన విషయమన్నారు. పీవీ దూరదృష్టితో దేశ ఆర్థిక సంస్కరణలు, నిర్మాణానికి విశేషమైన కృషి చేశారని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రావు పద్మ పేర్కొన్నారు.

పీవీకి భారత రత్న పురస్కారంపై హర్షం

వడ్డెపల్లి, ఫిబ్రవరి 9: భారత మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం హర్షనీయమని తెలుగుదేశం పార్టీ వరంగల్ పార్లమెంట్ అధ్యక్షుడు అర్షనపల్లి విద్యాసాగర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, ప్రధానిగా సేవలందించిన ఏకైక తెలుగు జాతి గర్వించదగ్గ నేత పీవీకి భారత రత్న ప్రకటించడం అభినందనీయమని పేర్కొన్నారు. పురస్కారాన్ని ప్రకటించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ విజన్‌తోనే రైల్వేల అభివృద్ధి

» దేశంలో 'జీవనాడి'లా రైల్వేలు: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ విజన్ వల్ల దేశంలో రైల్వే వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అమెరికా, చైనా, రష్యా తర్వాత అతిపెద్ద రైల్వే వ్యవస్థ భారత్‌దేనని చెప్పారు. మన రైల్వేలు దేశప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని వెల్లడించారు. గత పదేళ్లలో రైల్వే రంగంలో భారత్ సాధించిన ప్రగతిపై శుక్రవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కిషన్ మీడియాతో మాట్లాడారు. దేశంలో రైల్వేలు 'జీవనాడి'లా సేవలందిస్తున్నాయన్నారు. నిత్యం 2 కోట్ల మంది, ఏడాదికి దాదాపు 800 కోట్ల మంది ప్రయాణికులు రైల్వేల ద్వారా ప్రయాణిస్తున్నారని చెప్పారు. 2022-23లో 151 కోట్ల టన్నుల సరుకుల రవాణా రైల్వేల ద్వారా జరిగిందని తెలిపారు. 2022-23లో మొత్తం స్విట్జర్లాండ్‌లోని రైల్వే నెట్‌వర్క్‌తో సమానంగా 5,243 కిలోమీటర్ల రైల్వే వ్యవస్థ నిర్మాణం జరిగిందని వెల్లడించారు. స్వదేశీ సాంకేతికతతో రూపొందిన సెమీ హైస్పీడ్ వందేభారత్ రైళ్లు అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఏపీలో రైల్వేజోన్ ఏర్పాటుకు 59 ఎకరాల స్థలం కావాలని అడిగామని.. ఇంతవరకు జగన్ సర్కారు నుంచి భూబదలాయింపు జరగలేదన్నారు. దీంతో ఏపీకి ప్రత్యేక రైల్వే జోన్ విషయంలో ముందడుగు పడటం లేదని వివరించారు.

నల్లగొండలో బీఆర్ఎస్ సభకు అనుమతి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 9: కృష్ణానది జలాల సాధనకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభకు శుక్రవారం పోలీసుల అనుమతి లభించింది. కొన్ని నిబంధనల మేరకు అనుమతులిస్తూ నల్గొండ డీఎస్పీ లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. 13న మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సభ నిర్వహించుకోవాలని, రోడ్లపై సాధారణ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని నిబంధనల్లో పేర్కొన్నారు. రెచ్చగొట్టే ప్రకటనలు ఉండకూడదని, దుర్భాషలాడకూడదని తెలిపారు. ఇటీవల జిల్లాలో పోలీసులు 30 యాక్ట్‌ను అమల్లోకి తేవడంతో బహిరంగ సభ నిర్వహణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు జిల్లా ఎస్పీ చందనాదీప్తిని కలిసి సభకు అనుమతివ్వాల్సిందిగా వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన ఎస్పీ తదుపరి చర్యల నిమిత్తం డీఎస్పీ లక్ష్మీనారాయణకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సభ నిర్వహణకు శుక్రవారం అనుమతిచ్చారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సభ ఏర్పాట్లను ముమ్మరం చేశాయి.

నేటి నుంచి ప్రజాహిత యాత్ర

» తొలి విడతలో 119 కిలోమీటర్ల మేర నడక

» మీ కోసం సమిధనై వస్తున్నా: బండి సంజయ్



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ప్రజాహితయాత్ర పేరిట పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా ఈ పాదయాత్ర కొనసాగనుంది. శనివారం ఉదయం 10 గంటలకు కొండగట్టు అంజన్న సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం మేడిపల్లి నుంచి పాదయాత్రను ప్రారంభించనున్నారు. తొలి విడత పాదయాత్ర సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలో ఈనెల 15 వరకు కొనసాగనుంది. 119 కి.మీ. మేర కొనసాగిన తర్వాత సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో ముగింపు సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. "మీ కోసం సమిధనై వస్తున్నా.. ఆశీర్వదించండి. మీలో ఒకడినైన నన్ను మీ ఓటుతో ఎంపీగా ఎన్నుకున్నందుకు సదా రుణపడి ఉంటాను. మీరిచ్చిన ఈ సదవకాశంతో ప్రజా సంగ్రామ యాత్ర చేపట్టి రాష్ట్రంలో పార్టీ విస్తరణకు కృషి చేశాను. రాష్ట్రమంతా పాదయాత్ర చేసి ప్రజల కష్టాలు కళ్లారా చూసిన.. అప్పటి ప్రభుత్వం నాపై 100కు పైగా కేసులు పెట్టినా, దాడులు చేసినా మీరిచ్చిన ధైర్యంతో పోరాడిన.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్నా. దేశహితం కోసం అబ్‌కీ బార్ 400 పార్.. తీసరీ బార్ మోదీ సర్కార్ నినాదాలతో మూడోసారి బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు కోసం జరుగుతున్న ఈ మహాయాగంలో మరోసారి సమిధగా మారడానికి మీ బిడ్డ సిద్ధమయ్యాడు" అని వివరించారు. కాగా, ప్రజాహిత పాదయాత్రలో భాగంగా మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు బండి సంజయ్ తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అన్యాయాన్ని మరో సారి ప్రజలకు వివరిస్తానని, అధికార కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతానని 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు.

గ్రూపు-4 పరీక్ష ఫలితాల వెల్లడి!

» త్వరలోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్

» అనంతరం నియామక పత్రాలు

» 8,180 పోస్టులు.. 7.26 లక్షల మంది అభ్యర్థులు

» 220 మార్కులు సాధించిన అభ్యర్థికి మొదటి ర్యాంకు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-4 ఫలితాల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్న అభ్యర్థుల నిరీక్షణ ఇన్నాళ్లకి ఫలించింది. గ్రూపు-4 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి అభ్యర్థుల మెరిట్ జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను త్వరలోనే చేపడుతామని, అనంతరం నియామక పత్రాలను అందజేస్తామని అధికారులు వెల్లడించారు. అందుకోసం జిల్లాల వారీగా ఉన్న పోస్టుల సంఖ్య, మెరిట్ జాబితాను సిద్ధం చేయాల్సి ఉంది. సుమారు 8,180 గ్రూపు-4 పోస్టుల భర్తీ కోసం 2022 డిసెంబరు 1వ తేదీన నోటిఫికేషన్‌ను (19/2022) జారీ చేయగా, సుమారు 9.51 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది జులై 1వ తేదీన నిర్వహించిన పరీక్షకు 7,62,872 మంది అభ్యర్థులు హాజరయ్యారు. తిరస్కరణకు గురైన వారు పోను...7,26,837 మంది అభ్యర్థుల ర్యాంకులను విడుదల చేశారు. మొత్తం 300 మార్కులకు గాను, 220.458 మార్కులు సాధించిన కుమురం భీం జిల్లాకు చెందిన అభ్యర్థి మొదటి స్థానంలో నిలిచారు. తర్వాత వరుసగా 219.009, 217.226, 216.377, 215.213 మార్కులను సాధించిన అభ్యర్థులు మొదటి ఐదు స్థానాల్లో నిలిచారు. ఆయా జిల్లాల్లో ఉన్న ఉద్యోగాల సంఖ్య ఆధారంగా స్థానికతను పరిగణలోకి తీసుకుని అభ్యర్థుల జిల్లా మెరిట్ జాబితాలను రూపొందిస్తారు. ఎంపికైన అభ్యర్థులు పోస్టులను కోరుకోవడానికి వీలుగా వెబ్ ఆప్షన్ల అవకాశాన్ని ఇవ్వనున్నారు. కాగా మిగిలిన పరీక్షల ఫలితాలను కూడా త్వరలోనే విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. అలాగే గ్రూపు-2,3 పోస్టుల పరీక్షల షెడ్యూల్‌ను కూడా ప్రకటించే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికే నిర్వహించిన గ్రూపు-1 పరీక్షను రద్దు చేసి, తిరిగి కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేయాలని నిర్ణయించారు.

దళిత మహిళను వివస్త్రను చేసి దాడి

కళ్లలో కారం కొట్టి, స్తంభానికి కట్టేసి దెబ్బలు.. కామారెడ్డి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి

» ఆమెను పెళ్లి చేసుకున్న వ్యక్తిపైనా దాడి

» ఆ వ్యక్తి మొదటి భార్య, ఆమె తరఫువారి పనే

» ఎస్పీ సీరియస్.. నలుగురిపై కేసు



మాచారెడ్డి, ఫిబ్రవరి 9: దళిత మహిళను, ఆమెతో తొలుత సహజీవనం చేసి, పెళ్లి చేసుకున్న వ్యక్తిని పూర్తిగా బట్టలు విప్పదీసి.. కళ్లలో కారం కొట్టి.. ఇద్దరినీ విద్యుత్తు స్తంభానికి కట్టేసి దారుణంగా కొట్టారు. దీన్నంతా వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలో ఇది ఆలస్యంగా వెలుగుచూసింది. దళిత మహిళను వివస్త్రను చేసినవారిలో ఇద్దరు మహిళలుండటం గమనార్హం. దాడికి పాల్పడింది దళిత మహిళను పెళ్లి చేస్తున్న వ్యక్తి.. మొదటి భార్య, ఆమె తరఫువారే! స్థానికుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన సందాని నరేశ్ ముదిరాజ్ వ్యవసాయ కూలీ.. మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన సంధ్య అనే యువతిని పెళ్లి చేసుకొని ఇల్లరికం వెళ్లాడు. వీరికి ఏడాది వయసు పాప ఉంది. అయితే నరేశ్ తన అమ్మమ్మ వాళ్ల ఊరైన సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని ఓ గ్రామానికి తరచూ వెళ్లేవాడు. అక్కడ ఓ దళిత యువతితో అతడికి పరిచయం ఏర్పడింది. ఆ దళిత యువతికి భర్త ఉన్నా అతడికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో వేరుగా ఉంటోంది. నరేశ్‌కు ఆ దళిత యువతితో పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇది నరేశ్ భార్య సంధ్యకు తెలియడంతో ఐదు నెలల క్రితం కుల పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. తీరు మార్చుకోవాలని నరేశ్‌ను కుల పెద్దలు హెచ్చరించారు. అయినా నరేశ్ పద్ధతి మార్చుకోకపోవడంతో సంధ్య తరచూ గొడవ పడేది. కొన్నాళ్లకు నరేశ్ ఆ దళిత యువతిని ఇటీవల పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరూ రామారెడ్డిలోని ఓ రైస్‌మిల్లులో పని చేసుకుంటూ అదే మండలంలోని ఇసన్నపల్లిలో ఓ ఇల్లును అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఇది తెలిసి సంధ్య, ఆమె కుటుంబసభ్యులు నెల 4వ తేదీన నరేశ్ అద్దెకు ఉండే ఇంటికొచ్చారు. లోపలికి చొరబడి ఇద్దరినీ వివస్త్రలుగా చేసి దాడి చేశారు. ఇద్దరిపై కారం చల్లుతూ పాశవికంగా దాడి చేసి.. దాన్నంతా వీడియో తీశారు. ఆపై సోషల్ మీడియాలో పెట్టారు. అదే రోజు అర్ధరాత్రి ఇద్దరినీ అక్కాపూర్‌కు తీసుకొచ్చి ఓ విద్యుత్తు స్తంభానికి తాళ్లతో కట్టి బంధించారు. మాచారెడ్డి పోలీసులొచ్చి వారిని విడిపించి గ్రామ పంచాయతీ వద్ద కూర్చోబెట్టి వెళ్లిపోయారు. మర్నాడు ఉదయం మాచారెడ్డి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేయాల్సిందిగా పలువురు కోరగా ఈ ఘటన రామారెడ్డి మండలంలో జరిగిందని అక్కడే పిటిషన్ ఇవ్వాలని మాచారెడ్డి పోలీసులు తెలిపినట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై రామారెడ్డి ఎస్సై సుధాకర్‌ని వివరణ కోరగా.. దళిత యువతి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కాగా దళిత యువతిని వివస్త్రను చేసిన ఘటనపై కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధూశర్మ సీరియస్ అయ్యారు. ఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం బాధితులను తన కార్యాలయానికి పిలిపించుకుని జరిగిన ఘటనపై ఆరా తీశారు. దాడికి పాల్పడిన నరేశ్ భార్య సంధ్య, నాగరపు ఎల్లయ్య, బాలలక్ష్మి, లక్ష్మీరావులపల్లి గ్రామానికి చెందిన పుట్ట నరసింహులుపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కాగా దళిత మహిళను వివస్త్రను చేసి.. దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మాచారెడ్డిలో ఆందోళన చేశారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

తనకు దక్కని అమ్మాయి బతక్కూడదనే..

ప్రక్కా ప్రణాళికతోనే అలేఖ్యను హత్య చేసిన శ్రీకాంత్.. పెళ్లి చేసుకోవాలని వేధింపులు

» గతంలో ఒక సంబంధం చెడగొట్టిన వైనం

» హత్య కోసం వేట కొడవలి తయారు చేయించిన నిందితుడు

» అరెస్టు.. కేసు వివరాలు వెల్లడించిన పోలీసులు

ఖానాపూర్, ఫిబ్రవరి 9: ప్రేమిస్తున్నానని వెంటబడినా తిరస్కరించడం.. ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో తనకు దక్కని అమ్మాయి ప్రాణాలతో ఉండకూడదని భావించి పక్కా ప్రణాళికతోనే అలేఖ్యను శ్రీకాంత్ హత్యచేశాడు. ఈ మేరకు నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో షెట్పల్లి అలేఖ్యను కత్తితో నరికి దారుణంగా హత్య చేసిన ప్రేమోన్మాది జూకింది శ్రీకాంత్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఘటన వివరాలను ఖానాపూర్ సీఐ మోహన్ వెల్లడించారు. ఖానాపూర్‌లోని అంబేద్కర్ కాలనీకి చెందిన శ్రీకాంత్.. అదే కాలనీకి చెందిన అలేఖ్య (23) అనే యువతిని గత ఐదేళ్లుగా ప్రేమిస్తున్నానని వెంటపడుతున్నాడు. ఆమె తిరస్కరిస్తున్నా తననే పెళ్లి చేసుకోవాలని వెంటపడి వేధించాడు. మూడు నెలల క్రితం అలేఖ్యకు పెళ్లి సంబంధం కుదిరితే శ్రీకాంత్ చెడగొట్టాడు. దీనిపై అలేఖ్య కుటుంబసభ్యులు కుల పెద్దల ముందు పంచాయితీ పెట్టి శ్రీకాంత్‌ను మందలించారు. అయినప్పటికీ అతడి తీరు మార్చుకోకుండా పదే పదే అలేఖ్యను వెంట పడి వేధించాడు. ఇటీవల అలేఖ్యకు మళ్లీ పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో తనకు దక్కని అమ్మాయి ప్రాణాలతో ఉండకూడదని శ్రీకాంత్ పగను పెంచుకున్నాడు. ఆమెను చంపేందుకు పక్కా ప్రణాళిక రచించాడు. ఒక పదునైన వేటకొడవలి (కొబ్బరిబోండాలు నరికే కత్తి)ని తయారు చేయించుకొని అలేఖ్యను అంతం చేయాలని వేచిచూశాడు. అలేఖ్య గురువారం ఉదయం తన వదిన జయశీల, అల్లుడు రియాన్స్‌తో కలిసి ఖానాపూర్‌లోని సన్‌స్కిల్స్ టైలరింగ్ సెంటర్‌లో శిక్షణ పొందేందుకు వెళ్లింది. ఆమె తిరిగి మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్తుండగా.. శ్రీకాంత్ ఖానాపూర్‌లోని శివాజీ నగర్ ప్రాంతంలో వేట కొడవలితో అలేఖ్య తల, మెడ, ఇతర చోట్ల విచక్షణారహితంగా నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అలేఖ్యను శ్రీకాంత్ నరుకుతుండగా అడ్డుపడిన ఆమె వదిన జయశీలను సైతం విచక్షణారహితంగా నరకడంతో ఆమె కొడుకు మూడేళ్ల బాలుడు రియాన్స్‌కు తీవ్ర గాయాలయ్యాయని సీఐ మోహన్ వివరించారు. నిందితుడు శుక్రవారం ఉదయం ఖానాపూర్ పట్టణ శివారులోని కొమురం భీమ్ చౌరస్తా వద్ద శ్రీకాంత్ పట్టుబడినట్లు తెలిపారు. వెంటనే అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

వంగర, లక్నేపల్లిలో సంబరాలు



వంగరలో పీవీ విగ్రహానికి పూలమాల వేస్తున్న గ్రామస్థులు

భీమదేవరపల్లి / నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 9: భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారత రత్న పురస్కారం దక్కడంపై ఆయన పుట్టి పెరిగిన గ్రామాలైన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర, వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లిలో శుక్రవారం సంబరాలు మిన్నంటాయి. వంగరలో పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవీ అమరహై అంటూ ర్యాలీ తీశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి, టపాసులు కాల్చారు. పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడం అభినందనీయమని, ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పీవీ సోదరుడి కుమారుడు మదన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వంగ రవి, పీవీ మదన్‌మోహన్‌రావు, మాజీ సర్పంచ్‌లు ఆర్.వెంటకొరెడ్డి, ఆలూరి రజిత, ఒల్లాల రమేష్, మొండయ్య, తిరుపతిరెడ్డి, సతీష్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే లక్నేపల్లి గ్రామంలో కూడా సంబరాలు అంబరాన్నంటాయి. టపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంతోషాన్ని వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని నర్సంపేట తదితర మండలాల్లో పీవీ అభిమానులు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవీకి భారతరత్న వరించడం పట్ల మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

గ్రామంలో 1921, జూన్ 28న రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పీవీ జన్మించారు. ఆ తర్వాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు దత్తత తీసుకోవడంతో అప్పటి నుంచి పాములపర్తి వెంకటనర్సింహారావు అయ్యారు. పీవీ జన్మించిన లక్నేపల్లిలో ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పీవీ నర్సింహారావు స్మారక మందిరాన్ని నిర్మించి అందులో పీవీ సాధించిన విజయాలు, ఆయన రాజకీయ చరిత్రకు సంబంధించిన ఫోటోలను సందర్శనార్థం ఏర్పాటు చేశారు. ఆవరణలో పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతీ ఏడాది జూన్ 28న జయంతి, డిసెంబర్ 23న వర్ధంతిని నిర్వహించడం జరుగుతున్నది.

షెడ్లను తొలగించారని ఆదివాసీల ఆగ్రహం

అదనపు కలెక్టర్ వాహనాన్ని చుట్టు ముట్టి నిరసన

మేడారం జాతరలో ఉద్రిక్తత

మేడారం, ఫిబ్రవరి 9: తాడ్వాయి మండలం మేడారం మహాజాతరలో దుకాణాల తొలగింపుపై ఉద్రిక్తతకు దారితీసింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో డీపీవో వెంకయ్య, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, పోలీసు సిబ్బందితోపాటు పారిశుధ్య కార్మికులతో కలిసి ములుగు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ దుకాణాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కొందరు వ్యాపారులు సామాన్లు తీసివేసి షెడ్లను మాత్రం వదిలేశారు. మరికొందరు సామాన్లతో పాటు షెడ్లను ఉంచారు. ఈ క్రమంలో సామానుతో పాటు షెడ్లను పూర్తిగా జేసీబీ వాహనంతో అధికారులు కూల్చివేశారు. ఆగ్రహించిన ఆదివాసీ వ్యాపారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు కూల్చారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిలో షెడ్లు ఎలా వేసుకుంటారని అదనపు కలెక్టర్ శ్రీజ అనడంతో ఆదివాసీ వ్యాపారులు ఒక్కసారిగా విరుచుకపడ్డారు. వరదల కారణంగా చాలా నష్టపోయామని, ఇప్పుడు షాపులను కూల్చివేసి మరింత నష్టం చేశారని అదనపు కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.



మేడారంలో అదనపు కలెక్టర్‌తో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

కాగా, అక్కడి నుంచి వాహనం ఎక్కేందుకు అదనపు కలెక్టర్ యత్నించగా ఆదివాసీ వ్యాపారులు అడ్డుపడ్డారు. అదనపు కలెక్టర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కారు చుట్టూరా బైఠాయించారు. తమకు న్యాయం చేస్తే తప్పా వెళ్లనీయని నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ ఆదివాసీ వ్యాపారులను సముదాయించారు. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళతామని, పరిష్కారం చేసే దిశగా ప్రయత్నాలు చేద్దామని హామీ ఇవ్వడంతో వాహనాన్ని వదిలేశారు.

మే 5న నీట్.. మార్చి 9 వరకు దరఖాస్తులు


» మార్చి 1 నుంచి లాసెట్ దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకై నిర్వహించే నీట్-యూజీ రాత పరీక్ష తేదీ ఖరారైంది. ఈ ఏడాది మే 5న నీట్ నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీయే) శుక్రవారం ప్రకటించింది. ఈ మేరకు నీట్- 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 9 నుంచి మార్చి 9 వరకు అవకాశం కల్పించింది. తెలుగు, ఇంగ్లీష్, హిందీతో పాటు 13 భాషల్లో నీట్‌ను నిర్వహించనున్నట్లు ఎన్టీయే వెల్లడించింది. దరఖాస్తు రుసుము జనరల్ కేటగిరి వారికి రూ.1,700, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.1,600, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్ జండర్లకు రూ.1,000 గా నిర్ణయించినట్లు నోటిఫికేషన్‌లో తెలిపింది. మే 5న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్ష జరగనుంది. కాగా, వచ్చే నెల 1 నుంచి లాసెట్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. శుక్రవారం లా సెట్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం అధికారులు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దాని ప్రకారం ఫిబ్రవరి 28న నోటిఫికేషన్‌ను జారీ చేసి, మార్చి 1 నుంచి ఏప్రిల్ 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. జూన్ 3న పరీక్ష నిర్వహించనున్నారు.

ఈసెట్ షెడ్యూల్ విడుదల

ఈసెట్ షెడ్యూల్ శుక్రవారం విడుదలైంది. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 16 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మే 6న పరీక్ష ఉంటుంది.

రైతు నాయకుడు చరణ్‌సింగ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: భారత రాజకీయాల్లో ఎందరో నాయకులు తాము రైతుల పక్షమని చెప్పుకొన్నారు. అన్నదాతల సంక్షేమమే తమ లక్ష్యం అని కూడా ప్రకటించేవారు. కానీ, చరిత్ర చూస్తే అసలైన రైతు నాయకుడు' ఎవరంటే మాత్రం ఒక్కరి పేరే చెబుతారు. ఆయనే చౌధురి చరణ్‌సింగ్. అన్నదాతల సంక్షేమం కోసం జీవితాంతం పాటుపడిన నేతగా ఆయనను పేర్కొంటారు. చరణ్‌సింగ్ జయంతిని జాతీయ రైతు దినోత్స వంగా జరుపుకొనడాన్ని బట్టే ఆయన ప్రాధాన్యం ఏమిటో తెలుస్తోంది. ఉత్తరప్ర దేశ్‌లోని మేరఠ్‌లో మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో 1902 డిసెంబరు 23న జన్మించారు చరణ్‌సింగ్. గాంధీజీ ప్రేరణతో స్వాతంత్ర్య సమరంలో పాల్గొ న్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1937లో ఛప్రౌలీ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 1946, 1952, 1962, 1967లోనూ విజయం సాధించారు. మంత్రిగానూ పనిచేశారు. కాంగ్రెస్‌తో విభేదించి 1967లో భారతీయ క్రాంతిదళ్‌ను స్థాపించారు. సంయుక్త విధాయక్ దళ్ కూటమి తరఫున ఆ ఏడాది ఏప్రిల్‌లో యూపీకి సీఎం అయ్యారు. ఆ రాష్ట్రానికి కాంగ్రెసేతర తొలి సీఎం చరణ్‌సింగ్ కావడం గమ నార్హం. మరోసారి సీఎం అయిన తర్వాత చరణ్‌సింగ్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లారు. ఎమర్జెన్సీ సమయంలో జైలు శిక్ష అనుభవించారు. ఆ తర్వాత ఏర్పాటైన జనతా పార్టీ ప్రభుత్వంలో మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో ఉప ప్రధానిగా పని చేశారు. హోం, ఆర్థిక శాఖలు చూశారు. 1979లో జన సంఘ్ మద్దతు ఉపసంహ రణలో మొరార్జీ ప్రభుత్వం పడిపోయింది. ఇందిరాగాంధీ సారథ్యంలోని కాంగ్రెస్ అండతో, దేశ ఐదో ప్రధానిగా చరణ్‌సింగ్ 1979 జూలై 28న బాధ్యతలు చేప ట్టారు. కేవలం 23 రోజులకే.. లోక్‌సభలో ఆయన బలం కూడా నిరూపించుక ముందే కాంగ్రెస్ మద్దతు వెనక్కు తీసుకోవడం ప్రభుత్వం పడిపోయింది. చరణ్ సింగ్ 1980 జనవరి 14 వరకు ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ వ్యవధిలో ఆయన పార్లమెంటుకు ఒక్కసారిగా కూడా వెళ్లలేదు. పార్లమెంటుకు వెళ్లని ఏకైక ప్రధాని చరణ్‌సింగ్ మాత్రమే. ప్రధానిగా దిగిపోయాక.. 1980లో లోక్‌దళ్ పేరిట చరణ్ సింగ్ సొంత పార్టీని నెలకొల్పారు. చరణ్‌సింగ్ తొలిసారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే.. రైతులను రుణ విముక్తులను చేసేందుకు 1939లోనే బిల్లు ప్రవేశపెట్టారు. జమీందారీ వ్యవస్థ రద్దు, భూ పరిమితి చట్టం తీసుకొ చ్చారు. ఈ నేపథ్యంలోనే జాట్‌లు, యాదవులు, గుజ్జర్లు, కుర్మీలు వంటి వ్యవ సాయ సామాజిక వర్గాలు చరణ్‌సింగ్ నాయకత్వాన్ని బలపరిచాయి. ప్రస్తుతం చరణ్‌సింగ్ మనమడు జయంత్ చౌధురి లోక్‌దళ్ అధ్యక్షుడిగా ఉన్నారు. చరణ్ సింగ్ 1987 మే 29న తుది శ్వాస విడిచారు. రైతులకు చేసిన సేవలకుగాను రాజ్‌ఘాట్‌లోని ఆయన స్మారకానికి కిసాన్ ఘాట్‌గా పేరుపెట్టారు.

భారతరత్నం పీవీ



(మొదటి పేజీ తరువాయి)

కొనియాడారు. 'మన మాజీ ప్రధానమంత్రి శ్రీ పీవీ నరసింహారావు గారిని భారతరత్నతో గౌరవిస్తున్నామని తెలియజేయటానికి సంతోషిస్తున్నా. విఖ్యాత మేధావిగా, రాజనీతిజ్ఞుడిగా నరసింహారావు గారు దేశానికి పలు హోదాల్లో అపారమైన సేవలు అందించారు. ఉమ్మడి ఏపీ సీఎంగా, కేంద్రమంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా కూడా అనేక సంవత్సరాలపాటు ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి. భారత్‌ను ఆర్థికంగా ఆధునిక దేశంగా మలచటంలో, దేశాభివృద్ధికి, సుసంపన్నతకు పటిష్ఠమైన పునాది వేయటంలో ఆయన దార్శనిక నాయకత్వం కీలకమైనది. ప్రధానమంత్రిగా నరసింహారావుగారి హయాంలోనే భారత మార్కెట్ల తలుపులను ప్రపంచానికి తెరిచే కీలక నిర్ణయం తీసుకున్నారు. తద్వారా ఓ కొత్త ఆర్థిక శకానికి నాంది పలికారు' అని మోదీ పేర్కొన్నారు. భారత విదేశాంగ విధానం, భాషలు, విద్యా రంగాల్లో పీవీ కృషి, అందించిన సేవలు ఆయన బహుముఖ ప్రజ్ఞను తెలియజేస్తాయన్నారు. క్లిష్టమైన పరివర్తన దశలో భారత్‌కు సారథ్యం వహించిన నరసింహారావు గారు మన దేశ సాంస్కృతిక, మేధోరంగాలను కూడా సుసంపన్నం చేశారని ప్రధాని మోదీ శ్లాఘించారు. చౌదరీ చరణ్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వటంపై మోదీ స్పందిస్తూ.. రైతు సంక్షేమం కోసం, రైతుల హక్కుల కోసం చరణ్‌సింగ్ జీవితాంతం కృషి చేశారు. యూపీ సీఎంగా, కేంద్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆయన రైతుల కోసం అనేక చర్యలు తీసుకున్నారు. జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా చరణ్‌సింగ్ చేసిన పోరాటం, ప్రజాస్వామ్యం పట్ల ఆయన అంకితభావం జాతి యావత్తుకూ స్ఫూర్తి కలిగించింది' అని పేర్కొన్నారు. విఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌ను తాను దగ్గరి నుంచి చూశానని, ఆయన సలహాలకు సూచనలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇచ్చే వాడినని ప్రధాని వెల్లడించారు. 'వ్యవసాయం, రైతు సంక్షేమం రంగాల్లో దేశానికి డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ చేసిన సేవలు నిరుపమానమైనవి. భారత వ్యవసాయరంగం గట్టి సవాళ్లను ఎదుర్కొంటూ కూడా స్వయంసమృద్ధి సాధించటంలో, సాగును ఆధునీకరించటంలో ఆయన అత్యంత ముఖ్యపాత్ర పోషించారు. ఆయన దార్శనిక నాయకత్వం దేశ వ్యవసాయరంగం ముఖచిత్రాన్ని మార్చివేయటమే కాదు, దేశానికి ఆహార భద్రతను కల్పించి సంపదను సృష్టించింది' అని ప్రధాని మోదీ ప్రశంసించారు.

దిగ్గజాల నేపథ్యం

1991-96 మధ్య దేశ ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చిన పీవీ నరసింహారావు 1921లో జన్మించారు. ఆయన స్వస్థలం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వంగర. వరంగల్‌లో ప్రాథమిక, హైస్కూలు ఉన్నత విద్యాభ్యాసం తర్వాత హైదరాబాద్, నాగపూర్, పూణేలలో చదివారు. నిజాం వ్యతిరేక పోరాటంతోపాటు స్వాతంత్రోద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారు. శాసన సభ్యుడుగా, ఎంపీగా, ముఖ్యమంత్రిగా, కేంద్రంలో విదేశాంగ, మానవ వనరుల మంత్రిగా, హోంమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన తర్వాత.. రాజీవ్‌గాంధీ మరణానంతరం ఆయన దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఐదేళ్లపాటు స్థిరంగా దేశాన్ని పాలించిన పీవీ బహుభాషా కోవిదుడు, కవి, రచయిత, పండితుడుగా గుర్తింపు పొందారు.

ప్రధానికి పీవీ కుమారుడి కృతజ్ఞతలు

పీవీకి భారతరత్న పురస్కారంపై ఆయన తనయుడు ప్రభాకర్‌రావు మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇది తెలుగువారికే కాక మొత్తం భారతీయులకు సంతోషం కలిగించే సందర్భమన్నారు. దాదాపు ఆరు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసిన తన తండ్రి స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రపై చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. ఆయన దూరదృష్టి వల్ల దేశం అభివృద్ధి పథంలోకి పయనించిందని చెప్పారు.

రాజకీయ కారణాలు

బీజేపీయేతర పార్టీల నేపథ్యం నుంచి వచ్చిన పీవీ, చరణ్‌సింగ్‌లకు భారతరత్న ప్రకటించటం ద్వారా బీజేపీ దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో తనకు ఆమోదయోగ్యతను సాధించుకునే వ్యూహం ఉన్నదని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా పీవీకి కాంగ్రెస్ తగిన గౌరవం ఇవ్వలేదన్న విమర్శ ఎంతోకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో ఆయనకు భారతరత్న ప్రకటించటం వల్ల కాంగ్రెస్‌పై పైచేయి సాధించటానికి బీజేపీకి మరో కారణం లభిస్తుందని అంటున్నారు. మరోవైపు, చరణ్‌సింగ్ మనవడు జయంత్‌సింగ్ ప్రస్తుతం రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్డీ) పార్టీకి సారథ్యం వహిస్తున్నారు.

లోకం తీరు



పీవీకి భారతరత్న సముచితం

దేశ చరిత్రను లిఖించిన రాజనీతిజ్ఞుడు అయిన పీవీ నరసింహారావుకు భారత రత్న ప్రకటించడం సముచితం. అత్యంత దుర్భర కాలంలో సంస్కరణలు అమలు చేసి దేశ ఆర్థిక వ్యవస్థను సరైన దిశలో నడిపించే విషయంలో పీవీ అందించిన సేవలు చిరస్మరణీయం. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

- అమిత్ షా, కేంద్ర హోం శాఖ మంత్రి

స్వాగతిస్తున్నా.. సందేహమేంటి?

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత రత్న ప్రకటిస్తూ ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. అందులో సందేహం ఏముంది?

- సోనియా గాంధీ, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు

కాన్షీరామ్‌కు కూడా ఇవ్వాలి

భారతరత్న పురస్కారాల ప్రకటనలో ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నాం. కానీ, ఈ విషయంలో దళిత నేతలకు తగిన గౌరవం లభించడం లేదు. అత్యున్నత పురస్కారానికి వారిని ఎంపిక చేయకపోవడం సరి కాదు. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. కాన్షీరాంకు కూడా భారతరత్న ప్రకటించాలి

- మాయావతి, బీఎస్పీ అధ్యక్షురాలు

మోదీ సంస్కారానికి నిదర్శనం

» పీవీ కుమార్తె సురభి వాణీదేవి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా పీవీ సేవలను గుర్తించి భారతరత్న ప్రకటించడం ప్రధాని మోదీ సంస్కారానికి నిదర్శనమని పీవీ కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. పీవీకి భారతరత్న ఇవ్వడంతో ఆ పురస్కారం విలువ మరింత పెరిగిందన్నారు. 'పీవీకి భారతరత్న ప్రకటించడంతో తెలంగాణ ప్రజలు, మా కుటుంబసభ్యుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పీవీని గౌరవించుకోవడమంటే.. మనల్ని మనం గౌరవించుకున్నట్టే. భారత్.. ఇప్పుడు అన్ని రంగాల్లో అత్యున్నతంగా నిలిచిందంటే దానికి కారణం.. మా తండ్రి వేసిన బాటలే.. జీవించినంత కాలం పీవీ కాంగ్రెస్‌లోనే ఉన్నారు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా భారతరత్న ఇచ్చింది' అని వాణీదేవి వ్యాఖ్యానించారు. టెక్నాలజీని ఉపయోగించడంలో పీవీ దిట్ట అని.. తాను చూసిన మొదటి ల్యాప్‌టాప్ నాన్నదేనని వాణీదేవి చెప్పారు. అష్టావధానం, ఫొటోగ్రఫీ అంటే ఆయనకు ఎంతో మక్కువన్నారు.

ఆకలిపై దేశాన్ని గెలిపించిన.. కృషీ రత్నం

ఆహార కొరత, కరువుకాటకాల భారత్‌కు గోధుమ జన్యు పరిశోధనలతో కొత్త జీవం



చెన్నై, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆకలి రక్కసిని అంతమొందించేందుకు నిరంతరం శ్రమించిన హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్. ఇప్పుడు ఆయన భారత రత్న కూడా అయ్యారు. స్వామినాథన్ పూర్తి పేరు 'మాన్‌కొంబు సాంబశివన్ స్వామినాథన్'. తమిళనాడులోని తిరుచ్చి జిల్లా కుంభకోణంలో 1925 ఆగస్టు 7వ తేదీన డాక్టర్ ఎంకే సాంబశివన్, పార్వతి తంగమ్మాళ్ దంపతులకు జన్మించారు. స్వామినాథన్ తండ్రి వైద్యుడు. స్వామినాథన్ కూడా తనలాగే వైద్యవృత్తిని స్వీకరించి, తన వైద్యశాల బాధ్యతలు నిర్వర్తించాలని ఆయన కోరుకునేవారు. అయితే అప్పట్లో బెంగాల్‌లో ఏర్పడిన విపరీతమైన కరువు పరిస్థితులు స్వామినాథన్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. స్వామినాథన్ 11 యేళ్ల వయస్సులో ఉండగా ఆయన తండ్రి కన్నుమూశారు. పిన తండ్రి సంరక్షణలో పెరిగిన ఆయన.. వ్యవసాయ రంగంలో పరిశోధనలు చేయాలని భావించారు. 1940-44లో మద్రాస్ వ్యవసాయ కళాశాలలో చేరి వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. ఆ తర్వాత ఢిల్లీలో జన్యు పంటల పరిశోధనలకు సంబంధించి ప్రథమశ్రేణిలో పీజీ డిగ్రీని పొందారు. 1948లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కానీ పోలీసుశాఖలో చేరలేదు. పలు పరిశోధనా సంస్థల్లో పనిచేయడానికి మొగ్గుచూపారు. వ్యవసాయ పరిశోధనలపై అనేక గ్రంథాలను రచించారు.

ఇదీ గోధుమ విప్లవం...

1960 దశకంలో దేశంలో కరువు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఈ గండం గట్టెక్కేందుకు అప్పట్లో అమెరికా నుంచి గోధుమలను దిగుమతి చేసుకునేవారు. సరిగ్గా ఇదే తరుణంలో స్వామినాథన్ కొత్త ప్రయోగానికి నాంది పలికారు. జపాన్‌లో కొత్తగా కనుగొన్న గోధుమ వంగడాన్ని దేశంలో ప్రవేశపెట్టి, అధిక ఉత్పత్తిని, రెట్టింపు లాభాలను సాధించేందుకు ఆయన దోహదపడ్డారు. దీనినే 'గోధుమ విప్లవం' అని నాటి ప్రధాని ఇందిర కొనియాడారు. అదేవిధంగా చైనా వరివంగడాలను కూడా దేశంలో ప్రవేశపెట్టి వరిధాన్యాల ఉత్పత్తిని ఆయన అధికం చేశారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో దేశం స్వయం స్వంవృద్ధిని సాధించేందుకు ఎంతో కృషి చేశారు. పస్తులు లేని భారత దేశమే తన సంకల్పమని ఆయన పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. ఇందుకోసం తమిళనాడులో 1980ల్లో 'ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్'ను స్థాపించారు.

అవార్డులకే వన్నె..

పేరు గడించిన పరిశోధనా సంస్థల్లో ప్రొఫెసర్‌గా, పరిశోధకుడిగా, విభాగాధిపతిగా ఎన్నో పదవులను అధిరోహించిన స్వామినాథన్‌ను దేశవిదేశాల్లోని యూనివర్సిటీలకు చెందిన 84 గౌరవ డాక్టరేట్లు, వందలాది అవార్డులు వరించాయి. 'రామన్ మెగసెసే' అవార్డు ఆయన్ని వరించింది. కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శిగా, కేంద్ర ప్రణాళికా సంఘం సభ్యుడిగా సేవలందించారు. స్వామినాథన్‌కు పద్మశ్రీ (1967), పద్మభూషణ్ (1972), పద్మవిభూషణ్ (1989) అవార్డులు వచ్చాయి. ఇప్పుడు ఆయన మరణానంతరం 'భారతరత్న'ను ప్రకటించడంతో కేంద్రప్రభుత్వం అందించే అన్ని పౌర పురస్కారాలు పొందిన వ్యక్తిగా స్వామినాథన్ రికార్డులకెక్కారు. ఆయన 2007 నుంచి 2013 వరకు రాజ్యసభ సభ్యునిగానూ వ్యవహరించారు. స్వామినాథన్ గత ఏడాది సెప్టెంబరు 28వ తేదీన తన 98వ యేట కన్నుమూశారు.

అధిక దిగుబడులనిచ్చే గోధుమలు, వరిధాన్యాలు..

1960లో భారత్, పాకిస్థాన్‌లలో ఆహారధాన్యాల కొరత తీవ్ర రూపం దాల్చింది. తన పరిశోధనల ద్వారా అధిక దిగుబడులనిచ్చే గోధుమ, వరి వంగడాలను ప్రవేశపెట్టి ఆహారధాన్యాల ఉత్పత్తిలో రెండు దేశాలూ స్వయం సమృద్ధిని సాధించేందుకు స్వామినాథన్ దోహదపడ్డారు. ఆ పరిశోధనల్లో ప్రముఖ శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్ ఆయనకు అండగా నిలిచారు. అప్పట్లో రైతులందరినీ కొత్త వంగడాలకు చెందిన వరిపంటలను పండించేందుకు ప్రోత్సహించడం వల్లే హరిత విప్లవాన్ని విజయవంతం చేయగలిగారు. అంతర్జాతీయ వరిధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఆర్ఆర్ఐ) డైరెక్టర్ జనరల్‌గా స్వామినాథన్ అందించిన సేవలకు 1987లో తొలి ప్రపంచ ఆహార పురస్కారం ఆయనను వరించింది.

చిన్నప్పటి నుంచే పంటలపై ఆసక్తి..

స్వామినాథన్ పదిహేనేళ్ల బాలుడిగా ఉన్నప్పుడే తన ఊరిలోని కొబ్బరి, మామిడి తోటల పెంపకందార్లు, రైతులతో సుదీర్ఘ చర్చలు జరిపేవారు. వరి, మామిడితోపాటు కాఫీ గింజలను కూడా పెంచాలని ఆయన రైతులకు సూచించేవారు. తండ్రిలా వైద్యవృత్తిని స్వీకరించలేదు. తొలి నుంచీ రైతుల బాగోగులపైనే ఆయన దృష్టిసారించారు. కనుకనే ఆయన జీవిత పర్యంతం వ్యవసాయ రంగంపైనే పరిశోధనలు సాగించి, యువ వ్యవసాయ శాస్త్రవేత్తలను ప్రోత్సహిస్తూ వచ్చారు. పస్తులు లేని సమాజస్థాపనే తన జీవిత లక్ష్యమని ఆయన పదేపదే ప్రకటించారు. ఆ దిశగానే తుదిశ్వాస విడిచేంత వరకూ ఆయన తన పరిశోధనలు సాగించారు.

భారతరత్నాలు 53 మంది!

» 2024లోనే అత్యధికంగా ఐదుగురికి ప్రదానం

» ఒకే ఏడాదిలో ఇంతమందికివ్వడం తొలిసారి

» 1999లో నలుగురికి ప్రతిష్ఠాత్మక పురస్కారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చరణ్‌సింగ్‌తో పాటు హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్రం 'భారత రత్న' ప్రకటించడంతో ఇప్పటి వరకూ ఈ అత్యున్నత పౌర పురస్కారం అందుకున్నవారి సంఖ్య 53కు చేరింది. ఇందులో 2024లో ఏకంగా ఐదుగురిని ఈ అవార్డు వరించింది. బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ అడ్వాణీ, బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌లకు ఇటీవలే భారతరత్న ప్రకటించారు. ఒక ఏడాదిలో ఇంత మందిని ఎంపిక చేయడం ఇదే మొదటిసారి. ఇప్పటి వరకూ అత్యధికంగా 1999లో నలుగురు గ్రహీతలకు ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందించారు. చివరిసారిగా 2019లో ప్రణబ్ ముఖర్జీకి, మరణానంతరం భూపేంద్ర కుమార్ హజారికా, నానాజీ దేశ్‌ముఖ్‌కు భారతరత్న ప్రదానం చేశారు. 2020-23 మధ్యకాలంలో ఈ అవార్డును ఎవరికీ ఇవ్వలేదు.

- దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న. మానవ జాతి అభివృద్ధికి పాటుపడే ఏదైనా రంగంలో విశేష కృషి లేదా చేసిన సేవకు గుర్తింపుగా దీన్ని ప్రదానం చేస్తారు.
- 1954లో భారతరత్న, పద్మవిభూషణ్ అనే రెండు పౌర పురస్కారాలను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్రపతి కార్యాలయం ప్రకటించింది. రెండోదానిలో తొలుత మూడంచెలు ఉండగా, 1955 జనవరి 8న రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారా వాటికి పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీగా నామకరణం చేశారు.
- ఈ పురస్కారం కోసం సిఫారసులు చేసే విధానం లేకపోయినప్పటికీ ప్రధానమంత్రి మాత్రమే రాష్ట్రపతికి గ్రహీతల జాబితాను సూచిస్తారు.
- చాలా సందర్భాల్లో ఏడాదిలో ముగ్గురికి, ఇద్దరికి ఈ అవార్డు ప్రకటించగా, అసలు ఎవరికీ ప్రదానం చేయని సంవత్సరాలు కూడా ఉన్నాయి.
- తొలి ఏడాది సి. రాజగోపాలాచారి, సర్వేపల్లి రాధాకృష్ణన్, చంద్రశేఖర వెంకట రామన్‌కు ఈ పురస్కారం లభించింది.
- అవార్డు గ్రహీతలకు రాష్ట్రపతి సంతకం చేసిన సనద్ (సర్టిఫికెట్), పతకం అందజేస్తారు. ఈ పురస్కారం కింద ఎలాంటి నగదు మంజూరు చేయరు.

తాతకు భారతరత్న.. ఆ వెంటనే పొత్తు

» బీజేపీతో కలిసి నడిచేందుకు ఆర్ఎల్డీ అధినేత జయంత్ సై

» పొత్తు ప్రతిపాదనను ఇప్పుడు ఎలా కాదనగలను?

» చరణ్ సింగ్‌కు అవార్డు ప్రకటించిన కొద్దిసేపటికే వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉంటుందని రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్డీ) అధ్యక్షుడు జయంత్ చౌదరీ ప్రకటించారు. ఆయన తాత, మాజీ ప్రధాని చౌదరీ చరణ్ సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన గంటల వ్యవధిలోనే జయంత్ చౌదరీ ఈ ప్రకటన చేయడం విశేషం. బీజేపీతో పొత్తు గురించి వస్తున్న కథనాలపై స్పందన కోరగా.. "బీజేపీ ప్రతిపాదనను ఇప్పుడు నేనెలా కాదనగలను?" అని వ్యాఖ్యానించారు. పైగా ఏ పార్టీ ఇప్పటిదాకా చేయలేని విధంగా తనదైన విజన్‌తో మోదీ పనులు చేశారని కొనియాడారు. జాట్ల సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న పశ్చిమ యూపీలో ఆర్ఎల్డీకి విశేష పట్టు ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆర్ఎల్డీతో పొత్తు పెట్టుకుంటే ఇక్కడ భారీగా స్థానాలను దక్కించుకోవచ్చునని బీజేపీ భావిస్తోంది. సీట్ల పంపకాల్లో భాగంగా ఆర్ఎల్డీకి యూపీలోని భాగ్పత్, బిజ్నోర్ లోక్‌సభ స్థానాలను కేటాయించడంతో పాటు, ఓ రాజ్యసభ స్థానంపై బీజేపీ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ఉచితంగా ఆధార్ అప్‌డేట్

తుది గడువు మార్చి 14

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఆధార్‌లోని వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఇప్పటికే పలుదఫాలు కేంద్రం విజ్ఞప్తి చేసింది. చివరిసారిగా డిసెంబరు 2023న మరో మూడు నెలలు.. మార్చి 14, 2024 వరకూ పొడిగిస్తూ ఉచితంగా ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవడానికి ఇదే చివరి అవకాశమని పేర్కొంది. గడువు ముగిసిన తర్వాత ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలంటే నిర్దేశిత సొమ్మును చెల్లించాల్సి ఉంటుంది.

దేశంలో 96.88 కోట్ల ఓటర్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: దేశంలో 96.88 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం వెల్లడించింది. వీరు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం ఉంది. 2019తో పోల్చితే ఓటర్లు 6శాతం పెరిగారు. 18-29 ఏళ్ల మధ్య వయసుగల 2 కోట్ల మంది యువత ఓటరుగా నమోదు చేసుకున్నారని ఈసీ తెలిపింది. ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు 2023లో 940మంది స్త్రీ ఓటర్లుండగా 2024లో 948కి పెరిగారు.

పేపరు లీకుల నిరోధక బిల్లుకు పార్లమెంటు ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: పోటీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలను నిరోధించడానికి ఉద్దేశించిన బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. పబ్లిక్ పరీక్షల అక్రమ మార్గాల నిరోధక బిల్లు-2024 పేరుతో రూపొందించిన దీన్ని శుక్రవారం రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. కొందరు ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన సవరణలను తిరస్కరించింది. ఈ బిల్లు మంగళవారమే లోక్‌సభ ఆమోదం పొందింది.

మా ఆదేశాలు అమలు చేయలేదేమి?

» యూపీ సర్కారును ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: సహచరుడ్ని కొట్టిన ఘటనలో విద్యార్థులందరికీ కౌన్సెలింగ్ ఇప్పించాలన్న తమ ఆదేశాలు ఎందుకు అమలు చేయలేదని యూపీ ప్రభుత్వాన్ని శుక్రవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముజఫర్‌నగర్ జిల్లా ఖుబ్బాపూర్ గ్రామ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఓ ముస్లిం విద్యార్థిని హోం వర్కు చేయలేదన్న కారణంతో ఆ క్లాసు టీచరు శిక్షించారు. తోటి విద్యార్థులతో ఆ బాలుడ్ని కొట్టించడంతోపాటు మతపరంగా వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై మహాత్మాగాంధీ ముని మనుమడు తుషార్‌గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారించిన ధర్మాసనం సంఘటనకు పాల్పడిన, సాక్షులుగా ఉన్న విద్యార్థులను ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ జరపాలని ఆదేశించింది. తగిన ఏర్పాట్లు చేయక పోవడంతో తాజాగా విచారించిన ధర్మాసనం తప్పుపట్టింది.

దేశాన్ని సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్

యూపీఏ పాలనలో కుటుంబానికే ప్రాధాన్యం.. నిర్మలా సీతారామన్ మండిపాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ నేతృత్వంలోని గత యూపీఏ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను దుర్వినియోగం చేసిందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ విమర్శించారు. కుటుంబానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చిన ఆ పార్టీ 2014లో దేశాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టిందని, ఇప్పుడు ఆర్థిక వ్యవస్థను నిర్వహించడంపై మోదీ ప్రభుత్వానికి ఉపన్యాసాలు ఇస్తోందని ఎద్దేవా చేశారు. 'భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం, దేశ ప్రజల జీవితాలపై దాని ప్రభావం' అనే అంశంపై లోక్‌సభలో శుక్రవారం ఆమె చర్చను ప్రారంభిస్తూ... దేశానికి తొలి ప్రాధాన్యం ఇచ్చిన మోదీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను టాప్-5కు తీసుకెళ్లిందని తెలిపారు. భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని చెప్పారు. ప్రభుత్వం చిత్తశుద్ధి, పారదర్శకతతో వ్యవహరించి దేశానికి తొలి ప్రాధాన్యం ఇస్తే ఫలితాలు ఎలా ఉంటాయో ఈ శ్వేతపత్రం స్పష్టంగా చెబుతోందన్నారు. "దేశానికికాకుండా కుటుంబానికి మాత్రమే మొదటి ప్రాధాన్యం ఇచ్చినప్పుడు పారదర్శకత కాకుండా వేరే ఆలోచన చేసినప్పుడు ఎలాంటి ఫలితాలు వచ్చాయో అందరూ చూశారు. అదే ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంటే వచ్చే ఫలితాలు కూడా బాగుంటాయని కొవిడ్ అనంతర పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. 2008 తర్వాత ప్రపంచ ఆర్థిక సంక్షోభం కంటే కొవిడ్ సంక్షోభం చాలా ప్రాణాంతకమైంది. మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధి, అంకితభావంతో ప్రజలకు ఉచితంగా టీకాలు ఇచ్చింది"అని సీతారామన్ అన్నారు.

యూపీఏ హయాం..కుంభకోణాల మయం

"2008నాటి సంక్షోభ సమయంలో దేశ ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు. ఒకటి తర్వాత ఒకటిగా కుంభకోణాలు వెలుగుచూశాయి. భారత ఆర్థిక వ్యవస్థను కాపాడలేకపోయిన వారు ఇప్పుడు మాకు పాఠాలు చెబుతున్నారు" అని నిర్మల మండిపడ్డారు. యూపీఏ హయాంలో బొగ్గు కుంభకోణం వల్ల దేశానికి రూ.1.86 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని, 214 బొగ్గు బ్లాకుల లైసెన్స్‌లను సుప్రీంకోర్టు రద్దుచేయాల్సి వచ్చిందన్న కాగ్ నివేదికను మంత్రి ఉదహరించారు. మోదీ ప్రభుత్వం పారదర్శకంగా బొగ్గు వేలం నిర్వహించిందన్నారు. మీరు బొగ్గును బూడిదగా మారిస్తే మోదీ ప్రభుత్వం తన విధానాల ద్వారా దాన్ని వజ్రాలుగా మార్చిందన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులకు బొగ్గు గనులు కేటాయించిన వారు క్రోనీ కేపిటలిజంపై ఉపన్యాసాలు ఇస్తున్నారని విమర్శించారు. కాగా, శ్వేతపత్రంపై చర్చకు ప్రతిపక్ష సభ్యులు సౌగతారాయ్ (టీఎంసీ), ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్‌పీ) అభ్యంతరం తెలిపారు. గత యూపీఏ ప్రభుత్వాన్ని కించపరిచే ప్రయత్నమన్నారు.



పదండి... మీకో పనిష్మెంట్ ఉంది..!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ శుక్రవారం 8మంది ఎంపీలకు ప్రత్యేకంగా విందు ఇచ్చారు. పార్లమెంట్ క్యాంటీన్‌లో వారితో కలిసి మధ్యాహ్నం శాకాహార భోజనంతోపాటు రాగి లడ్డూలు తిన్నారు. బీజేపీ, బీఎస్పీ, బీజేడీ, ఆర్ఎస్‌పీ ఎంపీలతోపాటు టీడీపీ ఎంపీ రామ్మోహన్‌నాయుడు విందులో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రధానితో లంచ్‌కు సంబంధించి ఎంపీలకు సమాచారం అందింది. వెంటనే అంతా పార్లమెంట్ క్యాంటీన్ వద్దకు చేరారు. అక్కడకు వచ్చిన ప్రధాని 'పదండి. మీకో పనిష్మెంట్ ఇవ్వాలనుకుంటున్నాను' అని వారితో సరదాగా అన్నట్లు తెలిసింది. పార్లమెంట్ సమావేశాల సమయంలో అవకాశం ఉన్నప్పుడల్లా ప్రధాని ఇలా విందులు ఇస్తుంటారని రామ్మోహన్ తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో హింస.. ఆరుగురి మృతి

» అక్రమంగా నిర్మించిన ప్రార్థనామందిరం కూల్చివేత సందర్భంగా ఘర్షణ

» హల్ద్వానీలో కర్ఫ్యూ..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఉత్తరాఖండ్‌లో అక్రమంగా నిర్మించిన మదర్సా కూల్చివేత సందర్భంగా పెద్ద ఎత్తున అల్లర్లు చెలరేగాయి. ఈ ఘర్షణల్లో కనీసం ఆరుగురు ఆందోళనకారులు మరణించగా, 300 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో 100 మందికి పైగా పోలీసులు, డజన్లకొద్దీ మునిసిపల్ సిబ్బంది ఉన్నారు. ఆందోళనకారులు ముందస్తు ప్రణాళిక ప్రకారం అల్లర్లకు పాల్పడ్డారని శుక్రవారం అధికారులు తెలిపారు. గురువారం హల్ద్వానీలోని బన్‌భూల్‌పురా ప్రాంతంలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేయడానికి వచ్చిన మున్సిపల్ కార్మికులు, పోలీసులపై స్థానికులు రాళ్లు రువ్వారు. ఒక జేసీబీ మిషన్‌ను, 70కి పైగా వాహనాలను తగులబెట్టి, పోలీస్‌స్టేషన్‌కు నిప్పుపెట్టారు. ఘటన జరిగిన ప్రాంతంలో కర్ఫ్యూ విధించి, భారీగా పోలీసు బలగాలను మోహరించారు. అల్లర్లు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా ఉత్తరాఖండ్ ప్రభుత్వం రాష్ట్రమంతా హైఅలర్ట్ ప్రకటించింది. ఇంటర్నెట్ సేవలను బంద్ చేసింది. నైనిటాల్ జిల్లా మేజిస్ట్రేట్ వందనా సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. ఆందోళనకారులు ముందస్తు ప్రణాళిక ప్రకారం ఘర్షణలకు పాల్పడ్డారని చెప్పారు. కాగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలోనూ భారీ ఎత్తున అల్లర్లు చెలరేగాయి. ప్రభుత్వ ముస్లిం వ్యతిరేక విధానాలకు నిరసనగా 'జైల్ భరో' ఆందోళనకు స్థానిక ముస్లిం మతగురువు మౌలానాతౌఫిక్ రజా పిలుపునివ్వడంతో ఇస్లామియా బిహారీపూర్ మైదానంలోకి వేల సంఖ్యలో జనం చేరుకున్న దరిమిలా తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

పాకిస్థాన్‌లో స్వతంత్ర అభ్యర్థుల ముందంజ

» వారిలో అత్యధికులు ఇమ్రాన్ ఖాన్ పార్టీ పీటీఐ మద్దతున్న వారే!

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 9: పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్‌సాఫ్(పీటీఐ) మద్దతున్న స్వతంత్ర అభ్యర్థులు ముందంజలో ఉన్నట్లు శుక్రవారం వెలువడిన ఫలితాలనుబట్టి తెలుస్తోంది. పాక్ ఎన్నికల సంఘం పీటీఐకి ఎన్నికల గుర్తు బ్యాట్‌ని నిరాకరించడంతో ఆ పార్టీ అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగారు. 201 సీట్లకు ఫలితాలు ప్రకటించగా 86 మంది స్వతంత్రులు విజయం సాధించారు. వీరిలో అత్యధికులు పీటీఐ మద్దతున్నవారే. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ పార్టీ పీఎమ్ఎల్-ఎన్ 59, బిలావల్ జర్దారీ పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) 44 సీట్లు గెలుచుకున్నాయి. పీఎంఎల్-ఎన్ అధినేత నవాజ్ షరీఫ్ పీటీఐ అభ్యర్థిపై భారీ మెజారిటీతో గెలుపొందారు.

సర్వనాశే సముత్పన్నే..
అర్థం త్యజతి పండితః

.." పూర్తిగా నాశనమవుతున్న పరిస్థితుల్లో వివేకవంతులు తమకున్న దాంట్లో సగం వదులుకుంటారు. తద్వారా, మిగిలింది పూర్తిగా నాశనం కాకుండా కాపాడుకోగల మని విశ్వసిస్తారు" అని దీని అర్థం. పీవీ అధికారం చేపట్టిన తర్వాత 1991 సంవత్సరం జూలై 13వ తేదీన విశ్వాస తీర్మానం లోక్‌సభలో ఓటింగ్‌కు వచ్చింది. ప్రధాన మంత్రిగా చేసిన తొలి ప్రసంగంలో సంస్కరణల గురించి చెబుతూ ఆయన చెప్పిన మాటలివి.

సంస్కరణలు ఎందుకంటే..

ఆ రోజు 45 నిమిషాలపాటు అనర్గళంగా స్వేచ్ఛా ప్రసంగం చేసిన ఆయన ఇలాంటి మేలిముత్యాల్లాంటి మాటలెన్నో చెప్పారు. బంగారం అమ్మకాలు, రూపాయి విలువ తగ్గింపు, ఐఎంఎఫ్‌తో చర్చలు వంటి బలమైన చర్యలను వరుసగా తీసుకోక తప్పలేదని సమర్థంగా వివరించారు. "మేము చేసిన దానికి ప్రత్యామ్నాయం ఏమీ లేదని మాకు తెలుసు. మేము ఈ దేశ ప్రతిష్ఠను మాత్రమే కాపాడాము" అని తేల్చిచెప్పారు.




పీవీ మన లీవీ



కంప్యూటర్ భాషలూ..

నేర్చుకోవడానికి వయసు అడ్డంకి కాదంటూ కంప్యూటర్ భాషలనూ పీవీ తన వృద్ధాప్యంలో నేర్చుకున్నారు! కోబాల్, బేసిక్ లాంగ్వేజెస్‌ను నేర్చుకుని.. యునిక్స్‌లో ప్రోగ్రామింగ్ కూడా చేసేవారంటారు. ఆయన పడగ్గదిలో ఒక కంప్యూటర్, ప్రింటర్ ఉండేవి. ప్రధానిగా ఉన్నప్పుడు ఇక్కడి నుంచి తెలుగు డీటీపీ ఆపరేటర్‌ను ఢిల్లీకి పిలిపించుకుని.. తెలుగులో టైప్ చేయడం నేర్చుకున్నారు. ఆ తర్వాత కాలంలో తన పుస్తకాలను తానే డీటీపీ చేసుకునేవారాయన.





మాటే మంత్రం అంటారుగానీ..
మౌనమే అసలు మంత్రమని,
కుటిల రాజకీయాల్లో ఎలాంటి
క్లిష్టపరిస్థితులనైనా ఎదురొడ్డి నిలిచే
శక్తినివ్వగల రహస్య తంత్రమని..
తెలిసి మసలుకొన్న మహా జ్ఞాని..
మౌన ముని..

పాములపర్తి వెంకట నరసింహారావు!

ఆయన మాటల మనిషి కాదు. చేతల మనిషి. సముద్రమంత లోతైన మనసున్న లోపలి మనిషి.

పదిహేడు భాషలు మాట్లాడగలిగే బహుభాషా కోవిదుడైనా.. 'పలుకు'ను బంగారం కన్నా పొదుపుగా వాడి మాటకున్న శక్తిని మౌనంగానే నిరూపించిన అపర బృహస్పతి.

సంక్షోభంలో చిక్కుకుని.. అదుపు తప్పిన ద్రవ్యోల్బణ సుడిగుండంలో పడి కొట్టుకుపోతున్న దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దిన అపర కౌటిల్యుడు.. ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడై ఉజ్వల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసిన ఆధునిక భారత నిర్మాత!

నిప్పులగుండంలాంటి నిత్య అసమ్మతిని నిమ్మళంగా ఎదుర్కొంటూనే.. ముఖ్యమంత్రిగా ఇక్కడ భూసంస్కరణలు.. ప్రధానిగా అక్కడ ఆర్థిక సంస్కరణలతో పచ్చటి భవితకు బాటలు వేసిన చాణక్యుడు!

ఇన్ని మాటలేల.. భరతమాత సిగను ధరించిన నిజమైన రత్నం పీవీ! ప్రభుత్వం ఇప్పుడిచ్చిన భారతరత్న పురస్కారం లాంఛనమే!!

సిసలైన భారతరత్నం

పీఠాధిపతి అవుదామనుకుంటే..

కాంగ్రెస్ పార్టీ 1991 ఎన్నికల్లో పీవీకి టికెట్ కేటాయించలేదు. మరో వైపు.. తమిళనాడు కుర్తాళంలోని సిద్ధేశ్వర పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించాలంటూ పీఠం నుంచి ఆయనకు సందేశాలు వస్తున్నాయి. ఎన్నికల్లో టికెట్ కూడా రాకపోవడంతో ఆయన రాజకీయ జీవితానికి చుక్క పెట్టి ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పీఠానికి సంకేతాలు కూడా పంపారు. కానీ.. విధి ఆయనకు మరో బాధ్యతను అప్పజెప్పబోతున్న విషయం ఆయనకు అప్పటికి తెలియలేదు. అనూహ్యంగా రాజీవ్‌గాంధీ హత్యకు గురికావడం.. సోనియా గాంధీ పార్టీ పగ్గాలు చేపట్టడానికి నిరాకరించడంతో.. పార్టీ బాధ్యతలను ఎవరికి అప్పజెప్పాలన్న ప్రశ్న తలెత్తింది. జనంలో కరిష్మా ఉన్న అతిరథ, మహారథుల్లాంటి నేతలను కాదని సొంత బలం లేని పీవీకి పార్టీ పగ్గాలు అందించాలని సోనియా తీసుకున్న నిర్ణయం దేశ చరిత్రనే మార్చేసింది.


సాహితీ మూర్తి

ఆ నిద్రాణ నిశీథిని మానిసి మేల్కాంచినాడు
ఒళ్లు విరిచి కళ్లు తెరిచి ఓహో అని లేచినాడు
కటిక చీకటుల చిమ్మెడు కారడవిని పయనించు
నిజ జఠరాగ్ని జ్వాలలు నింగినంత లేపినాడు

ఈ కవితను రాసిన వ్యక్తి ఎవరో కాదు పీవీ నరసింహారావు. 1972 ఆగస్టు 15న స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా అర్ధరాత్రి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆయన చేసిన కవితాగానమిది. ఇదొక సుదీర్ఘ కవిత. అర్ధరాత్రి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు లేచిన భారతీయుడి హృదయ గానం. ఆ మేల్కొన్న మనిషి ఎవరు? ఆయనే వివరించారు.

యుగయుగాల అన్యాయం
నగుమోముల దిగమ్రింగగ
సాంధ్యారుణ రౌద్ర క్షితిజ ముఖుడై చెలంగినాడు
వాడొక విప్లవ తపస్వి

పీవీ వర్ణించిన భారతీయుడు సామాన్యుడని, ఆకలితో దహించుకుపోతున్నాడని, అన్యాయాన్ని సహించలేక రుద్ర రూపం దాల్చిన విప్లవ తపస్వి అని స్పష్టంగా అర్థమవుతుంది. ఎక్కడ విప్లవం, ఎక్కడ తపస్సు. విప్లవ తపస్విఅనేదే ఒక విరోధాభాస. అదిపీవీకే సాధ్యమయింది. పీవీ నరసింహారావుకు పాండిత్యం, భాషాపరిజ్ఞానంతో సరిసమానంగా చైతన్యవంతమైన, కవికి అవసరమైన భావోద్వేగాలున్నాయని ఈ ఒక్క కవిత చదివితే అర్థమవుతుంది. పీవీ రాజకీయనాయకుడైనప్పటికీ ఆయన జీవితంలో సాహిత్యం అంతర్లీనంగా ప్రవహిస్తూ వచ్చింది. పీవీ, ఆయన మిత్రుడు సదాశివరావు



కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో పీవీ

కలిసి కాకతీయ అనే పత్రిక నడిపేవారు. కాకతీయ కళాసమితి పేరిట ప్రతిసంవత్సరం సంగిత సాహిత్య సభలు నిర్వహించేవారు. వరంగల్‌లో తెలంగాణ తాత్విక కవిగా గుర్తింపు పొందిన గార్లపాటి రాఘవరెడ్డి.. హిందీ కవిత్వంలోని మార్మిక ఛాయావాదాన్ని వారికి పరిచయం చేశారు. కాళోజీ గురువు కూడా ఆయనే. విశ్వనాథ సాహిత్యాన్ని చదివి ఆయనపై అభిమానాన్ని పెంచుకున్న పీవీ.. 1955లో విశ్వనాథ ఒక సభకు వచ్చినప్పుడు ఆయనను కలిసి 'వేయిపడగలు' నవలను హిందీలో అనువదిస్తానని చెప్పి అనుమతి పొందారు. రాజకీయనాయకుడుగా తన చుట్టూ ఉన్న దుర్మార్గాలను చూసిన పీవీలో ప్రతిఘటనా స్వరం అడుగడుగునా కనిపిస్తుంది. విశ్వనాథ, సి.నారాయణరెడ్డికి జ్ఞానపీఠ, కాళోజీకి పద్మవిభూషణ్ పీవీ చొరవ వల్లే లభించాయి. పీవీ రచనలు.. లోపలి మనిషి (ఇన్‌సైడర్), గొల్ల రామవ్వ, మంగయ్య అదృష్టం.. మూడూ సామాజిక, రాజకీయ పరిణామాలపై విశ్లేషణలే. మరాఠీ నుంచి 'పన్ లక్షత్ కోన్ ఘెటో' నవలను పీవీ 'అబల జీవితం' పేరుతో అనువదించారు. దీన్ని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది.

భారత రాజకీయాల్లో అరుదైన మేధావి, ఆర్థిక సంస్కరణల ద్వారా దేశం ఆర్థిక, సామాజిక రూపురేఖల్ని పరివర్తనం చేసి, అభివృద్ధిని ఎజెండాగా మార్చిన రాజనీతిజ్ఞుడు, మైనారిటీ ప్రభుత్వమైనప్పటికీ అయిదు సంవత్సరాలు స్థిరంగా దేశానికి నాయకత్వం అందించిన చాణక్యుడు, అమెరికా, ఇజ్రాయిల్ తదితర దేశాలతో వినూత్న సంబంధాలు ప్రారంభించి, లుక్ ఈస్ట్ విధానం ద్వారా దేశ విదేశాంగ విధానాన్ని కొత్త పుంతలు తొక్కించిన దౌత్యనీతిజ్ఞుడు అయిన పీవీ నరసింహారావుకు ఆయన మరణించిన దాదాపు రెండు దశాబ్దాలకు భారత రత్న లభించింది. 1991-96 మధ్య ప్రధానిగా ఉన్న పీవీనరసింహారావు భారత దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను ఏ విధంగా మార్చారు? దేశానికి ఆయన చేసిన కృషి ఏమిటి? ప్రధానిగా ఆయన నిర్వహించిన పాత్రపై ఆంధ్రజ్యోతి ఢిల్లీ బ్యూరో చీఫ్ రచించిన 'విప్లవతపస్వి' నుంచి కొన్ని భాగాలు..

సంస్కరణల సారథి

పీవీ గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆర్థిక సంస్కరణలు ప్రారంభించారు. ఆయన పగ్గాలు చేపట్టేనాటికి మన ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. అంతర్జాతీయ ఏజెన్సీలు భారత ఆర్థిక వ్యవస్థ పతనాన్ని సూచించాయి. విదేశీ రుణాలు పుట్టడం కష్టతరమైంది. రుణ చెల్లింపులను వాయిదా వేయడం కూడా గగనమైంది. ద్రవ్యలోటు జీడీపీలో 8 శాతానికి, విదేశీ అప్పులు జీడీపీలో 41 శాతానికి చేరుకోవడంతో దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో మునిగి ఉన్నదని, దిగుమతులకు చెల్లించడానికి విదేశీ మారక ద్రవ్య నిల్వలు కేవలం రెండువారాలకు మాత్రమే సరిపోతాయని ఆయన గమనించారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టినప్పటికీ సాహసోపేతంగా వాటిని అమలు చేసి దేశంలో నూతన ఆర్థిక సంస్కృతికి ఒరవడి దిద్దిన నేత నరసింహారావు. దేశంలో ప్రజల జీవన నాణ్యత పెరుగుదల పీవీ చలవేనంటే అతిశయోక్తి కాదు. అలాగే.. ఈ సంస్కరణల అమలు క్రమంలో ఆయన ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకుని ఎన్నో పథకాలకు ఆద్యుడుగా నిలిచారు. ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన, ఎంపీ లాడ్స్ పథకం, పార్లమెంటు స్థాయీసంఘాల వ్యవస్థను ప్రవేశపెట్టడం వంటివి ఇందుకు ఉదాహరణలు. ఆర్థిక సంస్కరణలను అమలు చేసేవిషయంలో పీవీ.. మన్మోహన్ సింగ్‌ను ఒక ఉపకరణంగా మాత్రమే ఉపయోగించుకున్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికైన వెంటనే ఆయన.. అప్పటి క్యాబినెట్ సెక్రటరీ నరేశ్ చంద్ర, ఫైనాన్స్ సెక్రటరీ ఎస్.పి. శుక్లా, ప్రధాన ఆర్థిక సలహాదారు దీపక్ నయ్యర్‌ను పిలిచి దేశ



ఇందిర, ప్రణబ్‌తో..

అభివృద్ధి మీకొద్దా?

ఆర్థిక పరిస్థితిపై చర్చించారు. ఆర్థిక మంత్రిగా రాజకీయ నాయకుడిని కాక ఒక ఆర్థిక వేత్తను నియమించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఆయన తనకు సన్నిహితుడైన పీసీ అలెగ్జాండర్ (ఇందిరాగాంధీ కాలంలో ప్రిన్సిపల్ సెక్రటరీ) సలహా తీసుకున్నారు. తొలుత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ డైరెక్టర్, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ ఐజీ పటేల్ (ఇంద్రవదన్ గోవర్ధన్ భాయి పటేల్)ను ఆర్థిక మంత్రిగా నియమించాలనుకున్నారు. కానీ ఆయన అందుకు అంగీకరించపోవడంతో మన్మోహన్ సింగ్‌ను ఎంపిక చేశారు. ప్రధాన మంత్రి పదవి నుంచి దిగిపోయాక 2018 డిసెంబర్‌లో తన పుస్తకం 'చేంజింగ్ ఇండియా' ఆవిష్కరణ సందర్భంగా మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ.. తాను యాదృచ్ఛికంగా ఆర్థిక మంత్రిని అయ్యానన్న విషయాన్ని అంగీకరించారు.

నిర్ణయం తీసుకోకపోవడమూ..

కొన్ని సందర్భాల్లో నిర్ణయాలు తీసుకోకపోవడం కూడా ఒక నిర్ణయమే అన్నది పీవీ నమ్మి ఆచరించిన సిద్ధాంతం. అది నిర్ణయ రాహిత్యమేననే ఆరోపణను ఆయన ఎంతమాత్రం ఒప్పుకోలేదు. 'నాది నిర్ణయరాహిత్యమే అయితే దేశంలో ఇన్ని బృహత్తర మార్పులు వచ్చేవా?' అని పీవీ తన మూడున్నర ఏళ్ల పాలన తర్వాత ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. ఆర్థిక సంస్కరణలు అనుకున్న విధంగా అమలు అయి భారత దేశం పేదరికం వంటి సమస్యలు పరిష్కారం కావాలంటే రాజకీయ సుస్థిరత ముఖ్యమని, అందుకే ఎన్ని అడ్డంకులు వచ్చినా స్పందించకుండా తన పనితాను చేసుకుపోవడం ముఖ్యమని పీవీ భావించారు.

విదేశాలతో సంబంధాలు

విదేశాంగ వ్యవహారాల విషయంలో పీవీ కొత్త ఒరవడిని సృష్టించారు. ఇజ్రాయిల్‌ను గుర్తించడం, చైనాతో సరిహద్దు

చంద్రబాబునాయుడు ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ చేపట్టారు. ఈ రోడ్ల విస్తరణ కారణంగా నష్టపోతున్న పీవీ సన్నిహితులు, బంధువులు కొందరు.. 'ఈ సీఎంకు చెక్ పెట్టాలంటే పీఎంను కలవాల్సిందే' అనుకుంటూ ఢిల్లీ బాట పట్టారు. తన ఇంటికి వచ్చినవారిని సాదరంగా ఆహ్వానించిన పీవీ.. వారు వచ్చిన పని గురించి అడిగి తెలుసుకున్నారు. అంతా మౌనంగా విని.. పార్లమెంటు నుంచి వచ్చాక సాయంత్రం వారితో సావకాశంగా మాట్లాడతానని చెప్పారు. ఈలోగా ఢిల్లీ చూసి రావాలంటూ వారికి ఒక ఏసీ వాహనం ఏర్పాటు చేశారు. వారు ఆ వాహనంలో ఢిల్లీని చుట్టబెట్టి సాయంత్రానికి పీవీ ఇంటికి చేరారు. అప్పటికే ఇంటికి వచ్చి ఉన్న పీవీ.. 'వచ్చారా. ఢిల్లీ బాగుందా?' అని అడిగారు. అందరూ ముక్తకంఠంతో.. 'చాలా బాగుంది' అని చెప్పారు. 'మరి ఇలాంటి రోడ్లు కావాలన్నా.. మీ ఊరు అభివృద్ధి చెందాలన్నా రోడ్ల విస్తరణ చేయాల్సిందే కదా?' అని అడగడంతో వారి వద్ద సమాధానం లేకపోయింది.

సంఘర్షణలను నివారించడం వంటి అనేక అంశాలపై ఆయన ఏకాభిప్రాయ సాధన తెచ్చేందుకు ప్రయత్నించారు. అమెరికాలో ఆరు రోజులు పర్యటించి ఆ దేశంతో సంబంధాల్లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. అణు పరీక్షలపై నిషేధాన్ని అమలు చేసే ఒప్పందం (సీటీబీటీ) పై అమెరికాను చర్చల్లోకి దించి, చివరి వరకు ఆ ఒప్పందంపై సంతకం చేయకుండా కాలక్షేపం చేసిన పీవీ దౌత్యనీతి అమోఘం. 1947లో ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయిల్ ఆవిర్భావానికి వ్యతిరేకంగా ఓటు వేసిన భారత్ అప్పటి నుంచీ ఆ దేశంతో పూర్తి స్థాయి దౌత్య సంబంధాలు ఏర్పర్చుకోలేదు. ముంబైలో ఇజ్రాయిల్‌కు ఒక చిన్న దౌత్య కార్యాలయం మాత్రమే ఉండేది. ఇజ్రాయిల్‌లో భారత్‌కు ఆ మాత్రం ఉనికి కూడా ఉండేది కాదు. పీవీ నరసింహారావు ఈ



వాజపేయి, పీవీ ఆత్మీయ ఆలింగనం

పరిస్థితిని మార్చి వేశారు. అయితే.. ఇజ్రాయిల్‌తో సంబంధాలు ఏర్పరచుకునే ముందు ఆయన పాలస్తీనా నేత యాసర్ అరాఫత్ ను 1992 జనవరిలో భారత దేశానికి ఆహ్వానించారు. ఇక్కడ తనకు లభించిన ఘన స్వాగతానికి అరాఫత్ ఉబ్బి తబ్బిబ్బయ్యారు. వెళుతూ వెళుతూ 'భారత దేశం ఇజ్రాయిల్‌తో సంబంధాలు పెట్టుకుంటే తప్పేమిటి..' అని అరాఫత్ ప్రశ్నించడంతో.. అందరూ నివ్వెరపోయారు. ఫలితంగా.. 43 ఏళ్లుగా ఇజ్రాయిల్‌తో కొనసాగుతున్న ప్రతిష్టంభన కొద్ది రోజుల్లోనే తొలగిపోయింది. సింగపూర్, జపాన్ వంటి తూర్పు ఆసియా దేశాలతో సంబంధాలను కూడా పీవీయే పునరుద్ధరించారు. పీవీ అవలంబించిన 'లుక్ ఈస్ట్' విధానం మంచి ఫలితాలను ఇచ్చింది. చైనాతో కూడా నరసింహారావు సంబంధాలు పెంచుకోవాలనుకున్నారు. చైనా ప్రధాని లీ పెంగ్ 1991లో భారత్ రాగా, నరసింహారావు 1993లో చైనాకు వెళ్లారు. ఆయన హయాంలోనే భారత్, చైనా సరిహద్దుల్లో ప్రశాంతతకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నాయి.

సామగ్రి తయార్ హై.. వాజపేయికి అణు రహస్యం

పీవీ హయాంలో పృథ్వి, అగ్ని క్షిపణి పరీక్షలు జరిగాయి. పృథ్వి క్షిపణితో ఇస్లామాబాద్ పై దాడి చేయగల శక్తి సమకూర్చుకుంటే.. అగ్ని క్షిపణితో చైనాపై కూడా దాడి చేయగల సామర్థ్యాన్ని సంపాదించుకున్నాం. 1995 డిసెంబర్‌లో అణు పరీక్షలకు కూడా పీవీ రంగం సిద్ధం చేశారు. ఆ విషయాన్ని అమెరికా పసిగట్టడంతో వాటిని తాత్కాలికంగా వాయిదా వేసి ఆ బాధ్యతను వాజపేయికి అప్పజెప్పారు. పీవీ మరణించిన తర్వాత వాజపేయి ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఈ విషయాన్ని చెప్పారు "అణు పరీక్షల నిజమైన ఘనత పీవీదే. ఆయనే అణు పరీక్షలకు సిద్ధం చేసి.. 'సామాగ్రి తయార్ హై' అని నాకు చెప్పారు.." అని గుర్తుచేసుకున్నారు.

ఐక్యరాజ్యసమితికి వాజపేయిని పంపి..

అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ ప్రతినిధులు కశ్మీర్ సమస్యను లేవనెత్తకుండా ఉండేందుకు ప్రధాన ప్రతిపక్షమైన భారతీయ జనతా పార్టీని ఉపయోగించుకోవడం పీవీ బుద్ధికుశలతకు నిదర్శనం. 1991లో ఆస్ట్రియాలో యూరోపియన్ పార్లమెంట్ నిర్వహించిన సదస్సుకు బీజేపీ లోక్‌సభా పక్ష నేత అడ్వాణీ, కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్‌ను పంపించారు పీవీ. ఆ తర్వాత 1994లో జెనీవాలో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ సదస్సుకు అటల్ బిహారీ వాజపేయిని ప్రతినిధిగా పంపారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, విదేశాంగ సహాయమంత్రి సల్మాన్ ఖుర్షీద్ భారత్ తరఫున ఆధునిక ముస్లింలుగా రంగంలోకి దిగారు.



పీవీ నరసింహారావు బహు భాషా కోవిదుడనే విషయం అందరికీ తెలుసు. ఆయనకు 17 భాషలు వచ్చు. తెలుగు, ఉర్దూ, తమిళం, కన్నడం, సంస్కృతం, ఒరియా, మరాఠీ, బెంగాలీ, గుజరాతీ, ఫ్రెంచ్, స్పానిష్, పర్షియన్, జర్మన్, అరబిక్, ఇంగ్లిష్ తదితర భాషలు చక్కగా మాట్లాడేవారు. సంభాషించడమేకాదు.. ఒక భాషలో పుస్తకాలను మరోభాషలోకి అనువదించే స్థాయి పాండిత్యం ఆయనది. మహారాష్ట్రలోని పుణెలో బీఎస్సీ చదివినప్పుడు మరాఠీ భాషను క్షుణ్ణంగా నేర్చుకున్న ఆయన.. అక్కడి ప్రముఖ రచయిత హరినారాయణ్ ఆప్టే నవలను 'అబలా జీవితము' పేరుతో తెలు

బహుభాషా కోవిదుడు

గులోకి అనువదించారు. అలాగే విశ్వనాథవారి 'వేయిపడగలు'ను హిందీలోకి 'సహస్రఫణ్'గా అనువాదం చేశారు. వేరే దేశాల అధ్యక్షులు, ప్రధానులు వస్తే వీలైనంతవరకూ వారి భాషల్లోనే మాట్లాడేవారు. ఒకసారి స్పెయిన్‌కు చెందిన దౌత్యప్రతినిధులు బృందం మనదేశానికి వచ్చి ఇంగ్లిష్‌లో మాట్లాడబోతే.. 'ఎందుకు మీ భాషలోనే మనం మాట్లాడుకుందాం' అని చక్కగా సంభాషించడంతో నివ్వెరపోవడం వారి వంతు అయింది. అంతేనా.. 1980లో ఆయన హవానా పర్యటనకు వెళ్లినప్పుడు నాటి ప్రధాని ఇందిరాగాంధీ నుంచి ఆయనకు ఒక సందేశం వెళ్లింది. అక్కడున్న అలీన ఉద్యమ నాయకులతో మాట్లాడి.. వారి తదుపరి సమావేశాన్ని ఇరాక్‌లో కాకుండా భారత్‌లో పెట్టేలా ఒప్పించాలన్నది దాని సారాంశం. వెంటనే పీవీ అక్కడున్న క్యూబన్లతో స్పానిష్ భాషలో.. ఇరాన్‌వారితో పర్షియన్‌లో.. ఇరాక్, ఈజిప్ట్‌వారితో అరబిక్‌లో, ఆఫ్రికా దేశాల ప్రతినిధులతో ఫ్రెంచ్ భాషలో, పాకిస్థానీ ప్రతినిధులతో ఉర్దూలో మాట్లాడి ఒప్పించారు!

దేశానికే గర్వకారణం: సీఎం రేవంత్

పీవీ సేవలకు సరైన గుర్తింపు: కిషన్‌రెడ్డి





హైదరాబాద్/న్యూఢిల్లీ/హుస్నాబాద్/అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశానికి ప్రధానిగా ఎనలేని సేవలందించిన తెలుగు బిడ్డ, తెలంగాణ బిడ్డ పాములపర్తి వెంకట (పీవీ) నరసింహారావుకు భారతరత్న పురస్కారం దక్కటం దేశ ప్రజలందరికీ గర్వకారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆలస్యమైనా పీవీకి గౌరవం దక్కటం సంతోషంగా ఉందని చెప్పారు. అసెంబ్లీలో రేవంత్ మాట్లాడుతూ.. ప్రధానిగా అనేక ఆర్థిక సంస్కరణలు తెచ్చి ప్రపంచ దేశాలతో పోటీపడేలా దేశాన్ని తీర్చిదిద్దిన ఘనత పీవీకే దక్కిందన్నారు. సీఎంగా శాసనసభ తరఫున, తెలంగాణ ప్రజల తరఫున వారి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు సభలో ప్రకటించారు. ఇటు ఢిల్లీలో బీజేపీ స్టేట్ చీఫ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దూరదృష్టి గల నాయకుడిగా దేశానికి వివిధ హోదాల్లో పీవీ చేసిన సేవలకు సరైన గుర్తింపు లభించిందన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలకు గుర్తుగా భారతరత్న పురస్కారం లభించటం హర్షించదగిన విషయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టుగా పీవీ నిలిచారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పీవీకి భారతరత్న దక్కడం గర్వించతగిన విషయమని తెలంగాణ శాసన మండలి తీర్మానం ఆమోదించింది. శుక్రవారం మండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తెలంగాణ ముద్దుబిడ్డ గొప్ప సంస్కరణలతో దేశాన్ని గాడిలో పెట్టారని ప్రశంసించారు.

బీఆర్ఎస్ డిమాండ్ మేరకు ప్రకటించినందుకు థ్యాంక్స్: కేసీఆర్



పీవీకి భారతరత్న.. తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అభివర్ణించారు. పీవీకి భారతరత్న ప్రకటించాలని బీఆర్ఎస్ చేసిన డిమాండ్‌ను గౌరవించి భారతరత్న ప్రకటించిన కేంద్రానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. పీవీకి భారతరత్న ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్రానికి ప్రతిపాదన పంపామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. పీవీకి స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సముచిత గౌరవాన్నిచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఏడాదిపాటు పీవీ శతజయంతి ఉత్సవాలను చేపట్టామని గుర్తు చేశారు.


సాయిరెడ్డి చెబుతారు!

పీవీకి భారత రత్నపై జగన్ 'స్పందన'

'తెలుగు వారైన పీవీ నరసింహరావుకు భారత రత్న ప్రకటించడంపై మీ స్పందనేమిటి?' అని ప్రశ్నిస్తే... .. 'సాయి రెడ్డి చెబుతారు' అంటూ ఏపీ సీఎం జగన్ అన్నారు. శుక్రవారం పార్లమెంటు భవనం నుంచి వస్తున్న ఆయనతో మాట్లాడించేందుకు విలేకరులు శతవిధాలా ప్రయత్నించి విఫలమయ్యారు.. పీవీకి భారత రత్న గురించి అడగ్గా, 'సాయి రెడ్డి చెబుతారు' అంటూ నేరుగా విమానాశ్రయానికి వెళ్లిపోయారు.

తెలుగు వారికి గర్వకారణం: చంద్రబాబు

పీవీ సేవలు చిరస్మరణీయం: పవన్





మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్‌కు 'భారతరత్న'ను కేంద్రం ప్రకటించడంపై టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. పీవీకి భారతరత్న ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా తెలుగుజాతికి గర్వకారణమన్నారు. పీవీ తెచ్చిన సంస్కరణలు భారత్‌ను ప్రపంచ వేదికపై నిలబెట్టాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికిన పీవీకి భారతరత్న ప్రకటించడంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు.



నెక్లెస్‌రోడ్‌లోని పీవీ జ్ఞానభూమి వద్ద మిఠాయిలు పంచుకుంటున్న ఆయన కుటుంబ సభ్యులు

కరీంనగర్ జిల్లా వాసిగా గర్వపడుతున్నా: సంజయ్

పీవీకి భారతరత్న ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నేతలు, రాష్ట్ర పార్టీ కార్యాలయం వద్ద సంబురాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్‌స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించడం హర్షణీయమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముద్దుబిడ్డకు అత్యున్నత పురస్కారం లభించడం పట్ల జిల్లా వాసిగా గర్వపడుతున్నానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తెలిపారు. పీవీకి భారతరత్న తెలుగు ప్రజలందరూ సంతోషించే విషయమని ఎంపీ అర్వింద్ అన్నారు. దేశం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్న సమయంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత పీవీదని ఆయన మనుమడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్ అన్నారు.

గ్రూప్-1 వయోపరిమితి 46

(మొదటిపేజీ తరువాయి)

విరుచుకుపడ్డారు. కృష్ణా జలాలను ఏపీకి రాసిస్తూ సంతకం పెట్టిందే గత కేసీఆర్ అని రేవంత్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి దక్కకుండా చేసి.. రైతుల పాలిట మరణ శాసనం రాశారన్నారు. "కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పామంటున్నారు. కాంగ్రెసోళ్లు వస్తే కాకి ఎత్తుకుపోయిందని, కేంద్రానికి రాసిచ్చేశామని మమ్మల్ని బద్నాం చేస్తున్నారు. అసలు కృష్ణా జలాలు తెలంగాణ రైతులకు పొక్కబెట్టి ఏపీకి రాసిచ్చిందే కేసీఆర్. దీనికి సంబంధించి 2015లోనే ఇరు రాష్ట్రాలు అంగీకారం తెలుపాయని కేంద్రమే పేర్కొంది. అంతేకాదు.. నిన్న పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి మంత్రి సమాధానం ఇచ్చారు. 2015-16లో రెండు రాష్ట్రాల అంగీకారంతోనే కృష్ణా జలాల వాటా తేల్చామని స్పష్టం చేశారు. ఆ తర్వాత 2016, 2017లోనూ సంతకాలు పెట్టారు. హరీశ్‌రావును అడుగుతున్నా. దీనికి ఏం సమాధానం చెప్తవు?" అని రేవంత్‌రెడ్డి నిలదీశారు. కనీసం ప్రతిపక్షంలోనూ బాధ్యతగా లేకపోతే, నిజాలు చెప్పకుంటే.. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీలోనూ ఉండరని, నాంపల్లి దర్గా వద్దకో, బిర్లా మందిర్ వద్దకో వెళ్లాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. కృష్ణా జలాలపై, రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఢిల్లీకి వెళ్లి జంతర్ మంతర్ వద్ద మోదీకి వ్యతిరేకంగా ఆమరణ దీక్ష చేపట్టాలన్నారు. అక్కడ పోలీసులు వారిని అరెస్టు చేయకుండా తమ ప్రభుత్వం భద్రత కల్పిస్తుందని చెప్పారు. "దీక్ష చేస్తూ అమరులైనా కండి.. లేదా సాధించైనా రండి" అని అన్నారు.

పునర్విభజన చట్టాన్ని తానే రాశానన్నారు..!

కృష్ణా ప్రాజెక్టుల నీటి వాటాలపై కేసీఆర్ ప్రభుత్వం సంతకాలు పెట్టడమే కాకుండా.. ఇంకో అడుగు ముందుకు కూడా వేసిందని సీఎం రేవంత్ తెలిపారు. కేంద్రానికి కృష్ణా ప్రాజెక్టులు, గోదావరి ప్రాజెక్టుల్ని అప్పగించాక వాటి నిర్వహణ డబ్బులను కూడా కేసీఆర్ ప్రభుత్వం ఇవ్వడానికి ఒప్పుకొందన్నారు. ఒక్కో దానికి రూ.200 కోట్ల చొప్పున నిధులను కూడా కేటాయించిందని తెలిపారు. ఆర్థిక శాఖ, నీటిపారుదల శాఖల్లో జరిగిన పాపాలన్నింటికీ ఆ పాపాల భైరవుడే కారణమని హరీశ్‌రావునుద్దేశించి వ్యాఖ్యానించారు. "పునర్విభజన చట్టంలో ప్రతీ పదాన్ని తానే రాశానని గొప్పగా చెప్పుకొనే కేసీఆర్.. కృష్ణా జలాల విషయంలో ఎందుకు మౌనం వహించారు. పునర్విభజన చట్టంలో కృష్ణా జలాలపై సభలో బిల్లు ప్రవేశపెట్టే సమయంలో లోక్‌సభలో కేసీఆర్, రాజ్యసభలో కేశవరావు పల్లెత్తు మాట అనలేదు. 2015లో కృష్ణా జలాలకు సంబంధించి 811 టీఎంసీల్లో 512 టీఎంసీలు ఏపీకి కేటాయించిందే కేసీఆర్ ప్రభుత్వం. రాష్ట్రానికి కేవలం 299 టీఎంసీలకు ఒప్పుకొని సంతకాలు పెట్టారు.మోదీపై కొట్లాడుతున్న మా కాళ్లలో కట్టెలు పెట్టి బోర్ల పడేసే ప్రయత్నం చేస్తున్నారు.

రోజా పెట్టిన పులుసు తిని అలుసిచ్చారు

ప్రగతిభవన్‌లో జగన్మోహన్ రెడ్డికి కేసీఆర్ పంచభక్ష పరమాన్నాలు పెట్టి జీవో-203 రాసిచ్చారు. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేసీఆర్ డైనింగ్ టేబుల్‌పై పునాదిరాయి పడ్డది. రోజుకు 8 టీఎంసీలు తరలించుకుపోయేలా అనుమతి ఇచ్చింది, టెండర్లు పిలిచింది, కాంట్రాక్టులు అప్పగించి పనులు పూర్తిచేసింది కేసీఆర్ హయాంలో కాదా.? ఏపీ పోలీసులు ఏకే-47 తుపాకులతో వచ్చి నాగార్జునసాగర్‌ను ఆక్రమించుకుంటే చాతకాని సన్నాసుల్లా ఇక్కడి ప్రభుత్వం చూస్తుండిపోయింది. దీనికి బాధ్యులెవరు.? వాళ్ల పెట్టిన పులుసు తిని అలుసు ఇవ్వడం వల్లే నేడు ఈ పరిస్థితి వచ్చింది. గత ముఖ్యమంత్రి కేసీఆర్ రాయలసీమకు వెళ్లి నేటి మంత్రి రోజా పెట్టిన రాగిసంగటి, రొయ్యల పులుసు తిని రాయలసీమను రతనాలసీమను చేస్తా అని వచ్చిండు. బేసిన్లు లేవు.. భేషజాలు లేకుండా మీరు కొట్టుకుపోండి అని అలుసు ఇచ్చినందునే.. మన జలాలను వాళ్లు కొట్టుకుపోయిన్రు. కేసీఆర్ కళ్లముందే చంద్రబాబు ముచ్చుమర్రి కట్టారు. రాజశేఖరరెడ్డి పోతిరెడ్డిపాడును 44 వేల క్యూసెక్కులకు పెంచుకుని మన జలాలు తరలించుకుపోయారు. అయినా కేసీఆర్ ఎన్నడూ అభ్యంతరం తెలుపలేదు. కృష్ణ జలాల నుంచి రోజుకు 13 టీఎంసీల నీరు తరలించుకుపోతున్నారు. నెలరోజులు మనం కళ్లు మూసుకుంటే శ్రీశైలంలో మనకు బురద కూడా ఉండదు.

80వేల పుస్తకాలు చదివిన మేధావి ఎక్కడ.?

నల్లగొండలో ఫ్లోరైడ్ బాధితులను ఆదుకునేందుకు ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును కోమటిరెడ్డి వెంకటరెడ్డి పోరాడి సాధించారు. అటవీ అనుమతులు రాకుంటే 42 కి.మి. సొరంగమార్గం ద్వారా ప్రాజెక్టు ప్రారంభించాం. 2014 నాటికి 32 కి.మీ. టన్నెల్‌ను పూర్తిచేసి కేసీఆర్ ప్రభుత్వానికి అప్పజెప్తే.. మిగిలిన 10 కి.మీ.ను ఏడాదిలోపు పూర్తి చేయాల్సి ఉండగా.. గత పదేళ్లలో 1.5 కి.మీ. మాత్రమే పూర్తి చేశారు. ఇంతకంటే చేతగానితనం, ఉంటుందా.? కల్వకుర్తి ఎత్తిపోతల నేటికీ పూర్తిచేయలేదు. పాలమూరు-రంగారెడ్డికి రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తే గుంట భూమికి కూడా నీరు ఇవ్వలేదు. ఏపీలో రోజుకు 12.5 టీఎంసీలు కృష్ణా జలాలు తరలించుకుపోయే సామర్థ్యంతో ప్రాజెక్టులు కట్టగా.. ఇక్కడ కృష్ణానదిపై కట్టిన ప్రాజెక్టుల సామర్థ్యం 2 టీఎంసీలు కూడా లేదు. పదేళ్లు అవకాశమిచ్చినా పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ప్రాజెక్టులను పూర్తిచేయకపోవడం వెనుక కారణం ఎవరు.? సొంత రాష్ట్రంలో పదేళ్లలో జరిగినంత అన్యాయం ఉమ్మడి రాష్ట్రంలోనూ తెలంగాణ ప్రజలకు జరగలేదు. సెంటిమెంటును రెచ్చగొట్టి దానికి ఆయింట్‌మెంట్ పూసి వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేసుకోవడం తప్ప.. ప్రాజెక్టుల పూర్తిపై ఆలోచనే లేకుండా పోయింది. ఇంత కీలకమైన అంశం నేడు సభలో చర్చ జరుగుతుంటే 80వేల పుస్తకాలు చదివిన (కేసీఆర్) ఆయన రారు. ఇక్కడున్నవారు నిజాలు మాట్లాడరు.



12న మేడిగడ్డకు..

12వ తేదీన కృష్ణా నది జలాల మీద పూర్తిస్థాయి చర్చకు రావాలి. కాళేశ్వరం అవినీతికి సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు 13వ తేదీన వెళ్తాం. అక్కడ ఆ మేడిగడ్డ అందం.. చందం.. మేడిపండు.. లోపల ఎన్ని పురుగులు ఉన్నాయో మొత్తం చూపిస్తాం. రాష్ట్ర సాధన కోసం చావునోట్లో తల పెట్టిన కేసీఆర్ కూడా 12న చర్చకు, 13న కాళేశ్వరం పర్యటనకు రావాలి. కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలు రూ.1.47 లక్షల కోట్లకు పెంచారు. రూ.97,500 కోట్లు చెల్లింపులు కూడా జరిగాయి. ఇంకో రూ.10 వేల కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణ పోరాటయోధులను, త్యాగాలు చేసినవారిని గుర్తించిందే మా ప్రభుత్వం.

అసలు త్యాగం కోమటిరెడ్డిది

తెలంగాణ ఉద్యమంలో ఖర్చులకు ఏమైనా డబ్బులు కావాలంటే రాజీనామా చేసి వసూళ్లు చేసుకునేవారు. మళ్లీ మూడు నెలలకు వచ్చి కుర్చీలో కూర్చునేవారు. అసలైన త్యాగం చేసింది కోమటిరెడ్డి వెంకటరెడ్డి. తెలంగాణ వచ్చేవరకు మంత్రిపదవి తీసుకోనన్నారు. వచ్చాకనే మంత్రి అయ్యారు. దొర ఏందిరో.. దొర పీకుడేందురో అని ప్రజల్లో చైతన్యం తెచ్చిన కవి గూడ అంజన్న క్యాన్సర్‌తో ఆస్పత్రిలో చివరిసారి కేసీఆర్‌ను చూడాలని కోరితే.. రాజసౌధం వదిలి కనీసం ఆస్పత్రికి వెళ్లే తీరిక ఆయనకు లేకుండా పోయింది. గద్దర్ వినతిపత్రం ఇద్దామని ప్రగతిభవన్‌కు వెళ్తే 3 గంటలు ఎండలో నిరీక్షింపజేశారు. ఆయన చనిపోతే కనీసం పరామర్శించేందుకు నాటి సీఎం కేసీఆర్‌కు పది నిమిషాలు సమయం లేకుండె. గద్దర్‌ను చరిత్రలో ఉండకూడదని భావిస్తే.. మేము ఏకంగా నంది పురస్కారాలు ఆయన పేరుతో ప్రకటించాం. వీళ్ల వద్దనుకున్న అందెశ్రీ గీతం జయజయహే తెలంగాణ వాళ్ల చెవుల్లో మోగాలనే రాష్ట్రగీతంగా ప్రకటించాం.

ఒకటో తేదీన జీతాలిచ్చాం..

ప్రజాస్వామ్యంలో రాచరిక పోకడలకు అవకాశం ఉండవద్దనే రాష్ట్ర చిహ్నంలో చార్మినార్, కాకతీయ తోరణాన్ని తొలగించాం. రాజకీయ పార్టీకి నకలుగా పార్టీ పేరు కలిసి వస్తుందని టీజీ స్థానంలో టీఎస్ అని పెట్టుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు 25వ తేదీ వరకు ఇచ్చే దుస్థితి బీఆర్ఎస్ హయాంలో ఉండేది. మొదటినెల 4న, రెండోనెల 1న జీతాలు ఇచ్చాం. 80శాతం పెన్షనర్లకు ఇచ్చాం. మరో 20శాతం త్వరలో ఇస్తాం.ఉచిత బస్సు ప్రయాణంతో ఇప్పటివరకు 15.21 కోట్ల మంది మహిళలు లబ్ధి పొందారు. వీరిపై ప్రభుత్వం రూ.535 కోట్లు ఖర్చు చేసింది. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు కుటుంబసభ్యులతో కలిసి దేవాలయాలకు వెళ్తుండటంతో దేవాదాయ శాఖకు ఆదాయం పెరుగుతోంది. నవంబరులో రూ.49.28 కోట్లుగా ఉన్న ఆదాయం డిసెంబరులో 93.24 కోట్లకు, జనవరిలో రూ. 68.69 కోట్లకు పెరిగింది. మరోవైపు ఆటో కార్మికుల సమస్యలపై ఆటోను తగలబెట్టడం.. సినిమాలో జూనియర్ ఆర్టిస్టు నటనలా అనిపిస్తోంది. ఒకే ఇంట్లో నలుగురికి ఉద్యోగాలు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ.. సింగరేణిలో కారుణ్య నియామకాలు మరిచింది. మైనార్టీలకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తున్నాం. సలహాదారుగా షబ్బీర్ అలీని నియమించాం. తొలిసారి అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా మైనారిటీని నియమించాం. సీఎంవోలో, టీఎస్‌పీఎస్సీలోనూ మైనారిటీలను నియమించాం. వర్సిటీల్లో వీసీల పదవులకూ వారి పేర్లను పరిశీలిస్తాం. ప్రజావాణి దరఖాస్తులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు స్వీకరిస్తున్నారని బద్నాం చేస్తున్నారు. వీటిని మంత్రులు స్వీకరిస్తున్నారు. ఐఏఎస్ అధికారి దివ్యను పూర్తిస్థాయి ఇన్‌చార్జిగా నియమించాం. 12 శాఖలకు చెందిన 21 మంది అధికారులకు బాధ్యతలు అప్పగించాం. గత ప్రభుత్వ తప్పిదాలతోనే ధరణి, గృహ నిర్మాణంపైనే ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయి. గత ప్రభుత్వం ఆనవాళ్లు ఒక్కటీ మా హయాంలో కనిపించవు. ఆ జిమ్మేదారి నాది. 9నెలల్లో ప్రగతిభవన్ కడతారు. వాస్తు బాగాలేదని సచివాలయం కడతారు. కానీ, వరంగల్‌లో కాళోజీ పేరుతో కళాక్షేత్రం తొమ్మిదిన్నరేళ్లలో పూర్తి చేయలేకపోయారు.

కొడుకు వస్తాడని భావిస్తే.. రైతు కొడుకుని నేనొచ్చాననే!

ఈ సీటులో నేనుండటం కొందరికి ఇష్టం లేదు. తన కొడుకు వస్తాడని భావిస్తే.. రైతు కొడుకు, ఓ సామాన్యుడు వచ్చాడని ఆయన అనుకుంటున్నారు. అందుకే నన్ను ఈ స్థానంలో చూడలేక ఇక్కడికి రావడం లేదేమో? నేను నా కళ్లతో చూడలేను.. నాకు ఈ శిక్ష వద్దు అని కళ్లల్లో నీసం పోసుకుంటే నేనేం చేయలేను. ప్రతిపక్షంలో ఉండగా వినతిపత్రం ఇద్దామని నేను సచివాలయానికి వెళ్తే.. అంతర్జాతీయ ఉగ్రవాది అయినట్టు వందలాది పోలీసులతో చుట్టుముట్టి నన్ను తీసుకెళ్లి ఇంటివద్ద పడేశారు. సీతక్క వెళ్తే ఆడబిడ్డ అని కూడా చూడకుండా అరెస్టు చేశారు. సచివాలయం, ప్రగతిభవన్ ఎవరికోసం కట్టారు.? ప్రజల కోసం కాదా.? గత 60 రోజుల పాలనలో చూడండి.. మా ప్రభుత్వం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటోంది. ఈ రాష్ట్రంలో రాజకీయపరంగా మీరు మేము వేరు ఉండొచ్చు. కానీ పక్క వారు వస్తే మనం కలిసి పోరాడాలి. కేంద్రం మన హక్కులను హరిస్తే.. కలిసి పోట్లాడేందుకు మాతో కలిసి రండి. ఆయన ఒక్కరి కోసం అందరినీ బలి ఇచ్చేట్టు ఉన్నారు. తొమ్మిదిన్నరేళ్లలో జరిగిన విధ్వంసాన్ని పునర్ నిర్మించుకునేందుకు ప్రతిపక్ష ఎమ్మెల్యేలంతా సహకరించాలి. అందరినుంచి సహకారం ఆశిస్తున్నా.

ఉర్దూలో రేవంత్ ప్రసంగం.. పాతబస్తీ అభివృద్ధికి 100కోట్లు

పాతబస్తీలో కూలిపోయే దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాల కోసం అవసరమైన బడ్జెట్ జీహెచ్ఎంసీ వద్ద లేకపోవడంతో హెచ్ఎండీఏ నుంచి రూ.100 కోట్లను ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అడిగిన పలు ప్రశ్నలకు సీఎం ఉర్దూలో సమాధానమిచ్చారు. పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. పాతబస్తీలో కృష్ణా నదీ జలాలను ఇచ్చేందుకు కూడా పనులు మొదలయ్యాయని, చాంద్రాయణ గుట్ట ప్రాంతంలోని సివరేజీ పనుల కోసం రూ.301 కోట్లను కేటాయించామని తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి విషయంలోనూ తమ ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. రంజాన్ వేడుకల కోసం రూ.500 కోట్లను కేటాయించినట్టు పేర్కొన్నారు. పాతబస్తీని అభివృద్ధి చేస్తామని, మెట్రో విస్తరణ కూడా చేపట్టామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదున్నర కిలోమీటర్లను కూడా పూర్తిచేస్తామన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని 'షాన్‌దార్'గా నిర్మిస్తామని చెప్పారు. 2050 మాస్టర్ ప్లాన్ దిశగా తమ ప్రభుత్వం ముందుకువెళుతోందని, దేశంలోనే హైదరాబాద్ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.



రెండో రోజూ సభకు కేసీఆర్ గైర్హాజరు



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శాసనసభ బడ్జెట్ సమావేశాల రెండో రోజు కూడా మాజీ సీఎం కేసీఆర్ గైర్హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం చర్చ జరగ్గా.. బీఆర్ఎస్ తరఫున కేసీఆర్ మాట్లాడతారని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆయన సభకు హాజరుకాలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక తొలి శాసనసభ సమావేశాలు జరిగినప్పుడు తుంటికి గాయం కారణంగా ఆస్పత్రిలో చేరిన కేసీఆర్ సభకు హాజరుకాలేదు. ఇటీవలే ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన బడ్జెట్ సమావేశాలకు హాజరుకానున్నారని పెద్దఎత్తున బీఆర్ఎస్ వర్గాలు ప్రచారం చేశాయి. కానీ సమావేశాలు ప్రారంభమైన రెండోరోజు కూడా సభకు రాకుండా ఆయన ముఖం చాటేశారు. తొలిరోజు అమావాస్య కావడంతో హాజరుకాలేదని భావించగా.. మర్నాడు ఇదే పరిస్థితి నెలకొంది. అయితే బడ్జెట్ సందర్భంగా శనివారం కేసీఆర్ సభకు వచ్చే అవకాశాలున్నాయని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

మారిన సీట్లు.. బీఆర్ఎస్ సభ్యుల వెతుకులాట

శాసనసభలో సీటింగ్ మారడంతో శుక్రవారం సభలోకి రాగానే తమ సీట్లు ఎక్కడున్నాయో వెతుక్కోవడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాసేపు ఇబ్బందిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, హరీశ్‌రావులకు ముందు వరుసలో సీట్లు కేటాయించారు. జూనియర్ ఎమ్మెల్యేలందరికీ చివరి వరుసలో సీట్లు ఇచ్చారు. పలువురు మాజీ మంత్రులకు వీరి మధ్యలో సీట్లు ఇవ్వడంతో ఓ దశలో మాజీ మంత్రి మల్లారెడ్డి 'మా సీటింగ్ మారింది' అంటూ అరిచారు. దాంతో వీరి వద్దకు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేరుకొని... సభా నియమాలకనుగుణంగా సీట్ల మార్పు జరిగిందని వారికి వివరించారు.

మిగతా హామీలకు గ్యారెంటీ లేదా?: శంకర్

కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీల గురించే చెబుతోంది కానీ మిగతా హామీలకు గ్యారెంటీ లేదా అని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రశ్నించారు. గత ప్రభుత్వ అహంకారం వల్లే ప్రజలు దాన్ని ఓడించారని, కొత్త ప్రభుత్వం అహంకారంలేకుండా పాలిస్తుందని ఆశిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో పట్టుదల ఉన్న వ్యక్తి అని, చాలా మొండితనం కూడా ఆయనలో ఉందని తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు తప్ప ఇతర హామీల గురించి పట్టించుకోవడంలేదన్నారు. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసిందన్నారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ మాటమారుస్తోందని చెప్పారు. ఆర్థిక పరిస్థితి గురించి గవర్నర్‌తోనే ప్రజలకు తెలియజేస్తే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.

రేవంత్.. జగన్ మధ్య పెద్దగా వైరుధ్యాలు లేవు

»» జల వివాదాలపై సయోధ్య అవసరం: కూనంనేని



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ మధ్య ఏర్పడిన జల వివాదాలను సయోధ్యతో పరిష్కరించుకోవాలని సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే కూనంనేని సూచించారు. శుక్రవారం శాసనసభ క్లారిఫికేషన్స్ అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్.. జగన్ మధ్య మంచి సత్సంబంధాలున్నాయని.. ఇపుడు రేవంత్‌రెడ్డి, జగన్ మధ్య కూడా పెద్దగా వైరుధ్యాలు ఏమీ లేవనుకుంటున్నానని చెప్పారు. ఆ మాటకు స్పందించిన హరీశ్.. చంద్రబాబుతో రేవంత్‌కు సత్సంబంధాలున్నాయని కూనంనేనితో అన్నారు. వెంటనే స్పందించిన కూనంనేని.. చంద్రబాబుతో మీరు కూడా బాగానే ఉన్నారు కదా? అంటూ హరీశ్‌కు సమాధానమిచ్చారు. అయితే ఇపుడు సీఎం చంద్రబాబు కాదు కాబట్టి.. జగన్‌తోనే మాట్లాడాల్సి ఉంటుందన్నారు. జగన్.. కేసీఆర్‌కు తమ్ముడవుతాడా.. లేదా శిష్యుడవుతాడా? తనకైతే తెలియదని, కానీ జలాల విషయంలో చొరవ తీసుకుంటే మంచిదని అన్నారు. తన నియోజకవర్గం పరిధిలోని స్పాంజ్ ఐరన్ కర్మాగారాన్ని మూసివేయకుండా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే చాలా మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ పాలనలో అధికారులు, రాజకీయ నాయకులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మిలాఖత్ అయిపోయి... వేల కోట్ల సంపదను దోచుకున్నారని, భూములు కాజేశారని ఆరోపించారు. శివబాలకృష్ణ ఏసీబీ కేసు, సోమేశ్‌కుమార్ భూముల వ్యవహారాలు కళ్లముందు ఉదాహరణలుగా కనిపిస్తున్నాయని చెప్పారు. అధికారుల అవినీతిపై విచారణ జరిపించాలని, తిన్న డబ్బులు కక్కించాలని... అప్పుడే మీరు రియల్ హీరో అవుతారని రేవంత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

రేవంత్.. జగన్ మధ్య పెద్దగా వైరుధ్యాలు లేవు

»» జల వివాదాలపై సయోధ్య అవసరం: కూనంనేని



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ మధ్య ఏర్పడిన జల వివాదాలను సయోధ్యతో పరిష్కరించుకోవాలని సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే కూనంనేని సూచించారు. శుక్రవారం శాసనసభ క్లారిఫికేషన్స్ అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్.. జగన్ మధ్య మంచి సత్సంబంధాలున్నాయని.. ఇపుడు రేవంత్‌రెడ్డి, జగన్ మధ్య కూడా పెద్దగా వైరుధ్యాలు ఏమీ లేవనుకుంటున్నానని చెప్పారు. ఆ మాటకు స్పందించిన హరీశ్.. చంద్రబాబుతో రేవంత్‌కు సత్సంబంధాలున్నాయని కూనంనేనితో అన్నారు. వెంటనే స్పందించిన కూనంనేని.. చంద్రబాబుతో మీరు కూడా బాగానే ఉన్నారు కదా? అంటూ హరీశ్‌కు సమాధానమిచ్చారు. అయితే ఇపుడు సీఎం చంద్రబాబు కాదు కాబట్టి.. జగన్‌తోనే మాట్లాడాల్సి ఉంటుందన్నారు. జగన్.. కేసీఆర్‌కు తమ్ముడవుతాడా.. లేదా శిష్యుడవుతాడా? తనకైతే తెలియదని, కానీ జలాల విషయంలో చొరవ తీసుకుంటే మంచిదని అన్నారు. తన నియోజకవర్గం పరిధిలోని స్పాంజ్ ఐరన్ కర్మాగారాన్ని మూసివేయకుండా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే చాలా మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ పాలనలో అధికారులు, రాజకీయ నాయకులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మిలాఖత్ అయిపోయి... వేల కోట్ల సంపదను దోచుకున్నారని, భూములు కాజేశారని ఆరోపించారు. శివబాలకృష్ణ ఏసీబీ కేసు, సోమేశ్‌కుమార్ భూముల వ్యవహారాలు కళ్లముందు ఉదాహరణలుగా కనిపిస్తున్నాయని చెప్పారు. అధికారుల అవినీతిపై విచారణ జరిపించాలని, తిన్న డబ్బులు కక్కించాలని... అప్పుడే మీరు రియల్ హీరో అవుతారని రేవంత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

అబద్ధాలు మానకపోతే.. 'అల్లా దేరా బాబా'నే!

»» బీఆర్ఎస్ నేతలకు మంత్రి కోమటిరెడ్డి హితవు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అబద్ధాలు చెప్పడం మానకపోతే నాంపల్లి దర్గా దగ్గర 'అల్లా దేరా బాబా' అనాల్సిందేనని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చెబుతున్నారు కానీ.. అంబేడ్కర్ జయంతి, వర్ధంతికి పదేళ్లలో ఏనాడైనా కేసీఆర్ నివాళి అర్పించారా అని ప్రశ్నించారు. ఈ మేరకు శాసనసభ క్లారిఫికేషన్స్ సమయంలో కోమటిరెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో ఇలా అంబేడ్కర్‌కు నివాళి అర్పించని వారెవరైనా ఉన్నారంటే అది కేసీఆరే అన్నారు. ఉద్యమ అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను అమరవీరుల స్థూపం ప్రారంభోత్సవం అప్పుడు అవమానించారని గుర్తు చేశారు. ప్రారంభోత్సవం ముందురోజు బుల్లెట్‌ప్రూఫ్ కారు, ఇద్దరు గన్‌మెన్‌లతో తీసుకొచ్చి.. కార్యక్రమం ముగిసిన వెంటనే అన్నింటినీ తీసుకుని ఆమెను వదిలేశారని పేర్కొన్నారు. శంకరమ్మకు ఇచ్చిన గౌరవాన్ని చూసి ఆమెను రాజ్యసభకు పంపిస్తారని లేదా ఎమ్మెల్సీ చేస్తారని ఆశించామని తెలిపారు. అమరవీరులు, అంబేడ్కర్, తెలంగాణ గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని స్పష్టం చేశారు. రాష్ట్రం కోసం తెలంగాణ సకల జనులు పోరాటం చేస్తే.. కాంగ్రెస్ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. రాష్ట్రం కోసం చావునోట్లో తల కాయ పెట్టామని చెబుతున్న వారు నిమ్స్‌లో చికిత్స ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. అవన్నీ దొంగదీక్షలు తప్ప మరొకటి కాదన్నారు. ఈ సందర్భంగా 'అల్లా దేరే బాబా' వ్యాఖ్య చేశారు.

రేవంత్‌రెడ్డి వర్సెస్ పోచారం

»» బీజేపీ, బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం

»» 2011లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఓటు వేశారు

»» కేటీఆర్‌ను సీఎం చేసేందుకు మోదీని కేసీఆర్ అనుమతి కోరారు: రేవంత్

»» బీజేపీతో ఏనాడూ కలవలేదు: పోచారం





హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మధ్య శుక్రవారం అసెంబ్లీలో మాటల యుద్ధం నడిచింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో.. బీజేపీతో మీరు కుమ్మక్కయ్యారంటే.. మీరే కుమ్మక్కయ్యారంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యులు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. తొలుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు ఇవ్వకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. దీంతో బీజేపీతో అంటకాగింది బీఆర్ఎస్సేనంటూ కాంగ్రెస్ సభ్యులు ప్రత్యారోపణ చేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఐదేళ్లు పాలిస్తుందని కోరుకుంటున్నానని, రేవంత్ సీఎం అయినందుకు తమకు ఎలాంటి ఈర్ష్య లేదని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలనే తాము గుర్తు చేస్తున్నామని తెలిపారు. బీజేపీతో తమకు ఎలాంటి కలయిక, అవగాహన లేదని, కాంగ్రెస్ సభ్యులు ఆరోపణలు చేయడం తగదని అన్నారు. పోచారం వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. 2011 ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు పెట్టుకున్నాయని గుర్తు చేశారు. ఆనాడు బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్న కిషన్ రెడ్డి.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటువేశారని తెలిపారు. కానీ, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రంగారెడ్డికి ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఓటు వేస్తే వారిని కేసీఆర్ సస్పెండ్ చేశారని చెప్పారు. తెలంగాణ ఏర్పాటైన తరువాత.. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మార్చాలని, కేటీఆర్‌ను సీఎం చేయాలని నాటి మంత్రివర్గమంతా కోరిందని రేవంత్ అన్నారు. కేసీఆర్ అప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ వద్దకు వెళ్లి తన కొడుకును సీఎంను చేసేందుకు మోదీ అనుమతి కోరారని చెప్పారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ నిజామాబాద్ పర్యటనకు వచ్చినపుడు స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్, బీజేపీది ఫెవికాల్ బంధమన్నారు. దీంతో.. బీజేపీతో తమకు ఫెవికాల్ బంధం ఉంటే ఆ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలను ఎందుకు ఓడిస్తామని పోచారం ప్రశ్నించారు. "మా పార్టీ సీఎంను మార్చాలనుకుంటే ఆ రోజు వంద మంది ఉన్న మేము ప్రధానిని ఎందుకు అడుగుతాం? మా ఎమ్మెల్యేలే సరిపోతారు. బీజేపీతో మాకు ఎలాంటి సంబంధం లేదు. ఎంఐఎం మాత్రమే మాకు మిత్రపక్షం" అని స్పష్టం చేశారు.

పల్లా వర్సెస్ శ్రీధర్‌బాబు..

బీఆర్ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి, మంత్రి శ్రీధర్‌బాబుకు మధ్య అసెంబ్లీలో సంవాదం నడిచింది. పల్లా మాట్లాడుతూ.. దావోస్‌లో అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలన్నారు. అదానీని క్రోనీ క్యాపిటలిస్టుగా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అభివర్ణించారని, అలాంటి వ్యక్తులతో ఒప్పందాలు ఎలా చేసుకుంటారని ప్రశ్నించారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. పెట్టుబడిదారులు ఎవరైనా పరిశ్రమ పెట్టేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామని చెప్పారు. అది అదానీ అయినా, పల్లా రాజేశ్వరరెడ్డి అయినా ఇద్దరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాబోయే ఐదేళ్ల ఐటీ, పరిశ్రమలను ప్రోత్సహిస్తామని తెలిపారు.

కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చాక టీజీ సిరీస్ అమలు: పొన్నం


హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాతే రాష్ట్రంలో టీజీ సిరీస్ అమలవుతుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఆయన శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టీఎస్ సిరీస్ స్థానంలో టీజీ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ సిరీస్ ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందన్న ప్రశ్నపై ఆయన స్పందిస్తూ... ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేయాల్సి ఉందన్నారు. ఈ విధానం అమల్లోకి వచ్చిన నాటి నుంచి వాహనాలకు టీఎస్ సిరీస్ బదులుగా టీజీ ఉంటుందని చెప్పారు. కాగా ఆర్టీసీ ఆదాయం పెంపునకు కార్గో సర్వీసును విస్తరించనున్నట్టు చెప్పారు. తెలంగాణలో కనీసం 20 శాతం కార్గో సేవలను ఆర్టీసీ ద్వారా అందించాలని భావిస్తున్నట్లు చెప్పారు. కాగా కరీంనగర్ స్మార్ట్ సిటీ పనుల్లో జరిగిన అవినీతిపై ఎంపీ బండి సంజయ్ స్పందించాలని మంత్రి డిమాండ్ చేశారు. దీనిపై ప్రస్తుతం విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టినట్లు చెప్పారు.

గంగుల అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిందే

బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తనను కలువాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని పొన్నం చెప్పారు. గతంలో తనను ఆయన తుక్కు అని విమర్శించారని, అప్పుడే మూడేళ్ల తర్వాత తన అపాయింట్‌మెంట్ కోరే పరిస్థితి వస్తుందని తాను చెప్పానని గుర్తుచేశారు. తాను అన్నట్టుగానే.. ఇప్పుడు అపాయింట్‌మెంట్ తీసుకొని తనను కలవాలని సూచించారు.

హరీశ్‌రావు.. సభను తప్పుదోవ పట్టిస్తున్నారు

»» ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించలేదు: ఉత్తమ్




హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావు.. సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేందుకు తాము ఒప్పుకోలేదని.. అసలు ఆ ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల చొప్పున ఇచ్చే ప్రతిపాదనకు ఒప్పుకొన్నది బీఆర్ఎస్సేనని అన్నారు. దాని ఫలితంగా పదేళ్లుగా నీటి వాటాల్లో అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జరిగిన కేఆర్ఎంబీ సమావేశాల్లో ప్రాజెక్టులను అప్పగించేందుకు ఒప్పుకోవడం లేదని చెప్పామని, ఈ మేరకు సంతకాలు కూడా ఉన్నాయన్నారు.

మా షరతులకు కేంద్రం ఒప్పుకోలేదు

»» మేమూ ప్రాజెక్టులను అప్పగించలేదు

»» 1న ఉద్యోగులకు జీతాలు పడలేదు

»» సభ హుందాతనాన్ని తగ్గించేలా సీఎం వ్యాఖ్యలు: హరీశ్‌రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తమ షరతులకు కేంద్రం ఒప్పుకోలేదని, ఆ కారణంగానే కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించేందుకు గత ప్రభుత్వమే బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై అసెంబ్లీలో ఆయన వివరణ ఇచ్చారు. కేఆర్ఎంబీకి రూ.200కోట్ల బడ్జెట్ కేటాయించినా, అంతకుముందే కేంద్రానికి కొన్ని షరతులు విధించామని చెప్పారు. కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణకు 50:50 చొప్పున పంచాలని, పోతిరెడ్డిపాడు నుంచి 34 టీఎంసీలను మించి ఒక్క చుక్క తీసుకెళ్లడానికి వీల్లేదని, శ్రీశైలం కనీస నీటిమట్టాన్ని 830 అడుగులుగా ఉంచాలని, తాగునీటిలో 20శాతం అకౌంటబిలిటి చేయాలని షరతులు పెట్టామన్నారు. వాటికి ఒప్పుకొంటే బోర్డుకు ప్రాజెక్టులు ఇస్తామన్నామని చెప్పామన్నారు. తమ షరతులకు కేంద్రం ఒప్పుకోలేదని.. దాంతో తాము నిధులనూ విడుదల చేయలేదని, ప్రాజెక్టులను అప్పగించలేదని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జరిగిన సమావేశాల్లోనే కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించి వచ్చారని దుయ్యబట్టారు. ఈ విషయంలో తప్పయిందని ఒప్పుకొంటే.. కేంద్రంపై పోరాటంలో వారికి మద్దతు ఇస్తామన్నారు. ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు వేస్తున్నామన్న సీఎం మాట సత్యదూరమని వ్యాఖ్యానించారు. 7వ తేదీ దాకా ఉద్యోగులకు జీతాలు ఇచ్చారని తెలిపారు. సభ హుందాతనాన్ని తగ్గించేలా సీఎం మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కొత్తగా వచ్చిన సీఎంకు పరిపాలనపై ఇంకా గ్రిప్ రాలేదని, ఇంకా సమయం పడుతుందన్నారు. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్షపాత్రను తాము గౌరవిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమం విషయంలో తనపై రేవంత్ విమర్శలు గుప్పిస్తున్నారని చెబుతూ ఉద్యమంలో ఉన్న ఆవేదన, తండ్లాట.. అందులో పాల్గొన్న వారికి తెలుస్తుందన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గతంలో పీవీకి భారతరత్న ఇవ్వాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపామని, ఇప్పుడు అవార్డు ప్రకటించిన నేపథ్యంలో భేషజాలు లేకుండా కృతజ్ఞత తెలుపుతూ తీర్మానం చేయాలని కోరారు.



ఆటోలో అసెంబ్లీకి వస్తున్న హరీశ్, సబిత, సత్యవతి

ఆటోల్లో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

- ఆటో డ్రైవర్లకు ప్రతి నెలా రూ.10వేలు ఇవ్వాలి: హరీశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లపై రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆటోల్లో అసెంబ్లీకి వచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, వివేకానంద, మాధవరం కృష్ణారావు, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతి తదితరులు శుక్రవారం హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీకి ఆటోల ద్వారా చేరుకున్నారు. ఆటో డ్రైవర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి మారాలని, వారిని ఆదుకోవాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఆటో కార్మికులను కూడా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటోడ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని, రెండు నెలల్లో 21 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్త చేశారు. ఆటోలకు డిమాండ్ లేకపోవడంతో 6.5లక్షల మంది ఆటో కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేక, ఈఎంఐలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. వారికి నెలకు రూ.10వేలు భృతి ఇవ్వాలని, మరణించిన ఆటో కార్మికుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం అందించాలని కోరారు. ప్రస్తుత బడ్జెట్‌లోనే ఇందుకోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ నేడే..

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శనివారం అసెంబ్లీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. మధ్యాహ్నం 12 గంటలకు సభ ప్రారంభం కాగానే డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. మరోవైపు శాసన మండలిలో ఐటీ, పరిశ్రమలు, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. దీనికి ముందు ఉదయం 9 గంటలకు అసెంబ్లీలో రాష్ట్ర మంత్రిమండలి సమావేశంకానుంది. ఈ సందర్భంగా 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది. శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందు క్యాబినెట్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. క్యాబినెట్ ఆమోదం పొందగానే సభలో ప్రవేశపెడతారు. బడ్జెట్ చదవడం పూర్తి కాగానే ఉభయ సభలు 12వ తేదీకి వాయిదా పడతాయి. 12న బడ్జెట్‌పై చర్చ చేపట్టి సభ్యుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తీసుకుంటారు. అదే రోజు సభ్యుల సందేహాలు, సూచనలపై ప్రభుత్వం సమాధానమిస్తుంది. ఈసారి స్వల్పకాలానికి ప్రవేశపెడుతున్న బడ్జెట్ ఎంత ఉండబోతోందన్న దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. వాస్తవ రెవెన్యూ రాబడులు, కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల ఆధారంగా బడ్జెట్ ప్రతిపాదన జరుగుతుందని ఇంతకు ముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆర్థిక శాఖ అధికారులకు కూడా ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆచితూచి బడ్జెట్‌ను రూపొందించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సమకూరుతున్న రాబడుల తీరును పరిగణనలోకి తీసుకుని కొత్త బడ్జెట్‌కు రూపమిచ్చారు. వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్ ఉంటేనే బాగుంటుందన్న అభిప్రాయంతో ప్రభుత్వం ఉంది.

ఉచిత బస్సుకు అనుకూలమా? వ్యతిరేకమా?

మహిళలు సంతోషపడుతుంటే ఓర్వలేకపోతున్నారు.. ఆటోవాలాలను అడ్డుపెట్టుకొని పుల్లలు పెట్టే ప్రయత్నం

- రెచ్చగొట్టి ఆందోళనలు చేయిస్తున్నారు
- బీఆర్ఎస్‌పై మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క పొన్నం ఫైర్
- మహాలక్ష్మి పథకంపై వాడీ వేడి చర్చ
- ఆటో డ్రైవర్లకు ఏటా 12 వేలిస్తాం
- ఈ బడ్జెట్‌లోనే నిధులు: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కారణంగా ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారంటూ బీఆర్ఎస్ నిరసన, మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటే ప్రతిపక్షం ఓర్వలేకపోతోందన్న అధికార కాంగ్రెస్ విమర్శలతో శుక్రవారం శాసనసభలో వాడీ వేడి చర్చ జరిగింది. ఆటోడ్రైవర్లకు సంఘీభావంగా ఆటోల్లో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ సభ్యులు.. మహాలక్ష్మి పథకం అమలుతో ఉపాధి కోల్పోయి 21 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని తెలిపారు. అయితే మహాలక్ష్మి పథకం అమలుకు బీఆర్ఎస్ అనుకూలమా? వ్యతిరేకమా? చెప్పాలని మంత్రులు నిలదీశారు. పదేళ్లపాటు ఆర్టీసీ ఆస్తులను ధ్వంసం చేశారని, ఆడవాళ్లు ఆర్టీసీ బస్సుల్లో వస్తుంటే తట్టుకోలేకపోతున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఆటోవాలాలను అడ్డం పెట్టుకొని మహాలక్ష్మి పథకానికి పుల్లలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. "ధనిక రైతులకు లక్షలాది రూపాయల రైతుబంధు ఇస్తుంటే.. పేద వర్గాలకు ఎందుకివ్వడం లేదంటూ మేమెప్పుడైనా మీ ఇళ్లముందు పేదలతో ధర్నాలు చేయించామా?" అని సీతక్క నిలదీశారు. మహాలక్ష్మి పథకం కారణంగా నెలకు రూ.ఐదారు వేల దాకా చార్జీలు మిగులుతున్నాయని మహిళలు సంతోషపడటాన్ని చూసి తట్టుకోలేకే ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, "ఉచిత బస్సు ప్రయాణంపై మిమ్మల్ని సూటిగా అడుగుతున్నా. మీరు వ్యతిరేకమా? అనుకూలమా? చెప్పండి" అంటూ బీఆర్ఎస్ సభ్యులను ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చామని, 48 గంటల్లోనే రెండు హామీలను అమలు చేశామని గుర్తు చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏటా రూ.12 వేల సహాయం చేయడానికి వీలుగా ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. కాగా, మహాలక్ష్మి పథకానికి వ్యతిరేకంగా ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి.. ఆందోళనలు చేయిస్తున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బెంజ్ కార్లలో తిరిగే పెద్ద పెద్ద దొరలు ఆటోల్లో వస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆర్టీసీ కార్మికులు 60 రోజులపాటు సమ్మె చేస్తే.. నిర్దయగా వ్యవహరించారని ఆరోపించారు. "ఆటోడ్రైవర్లకు నెలకు రూ.1000 మీరు ఇచ్చారా? పైగా, ఆటోవాలాలపై ఫైన్లు వేసి పీడించుకు తిన్నారు" అని పొన్నం ధ్వజమెత్తారు.

30 మోసాలు.. 60 అబద్ధాలుగా గవర్నర్ ప్రసంగం: పల్లా

గవర్నర్ ప్రసంగం 30 మోసాలు, 60 అబద్ధాలుగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. గవర్నర్ ధన్యవాద తీర్మానంపై ఆయన మాట్లాడుతూ.. ఆరు హామీల అమలును 420 అడుగుల లోతున పాతిపెట్టారని అన్నారు. ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి.. ప్రతి రోజూ ఒక గంట ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. కానీ, తొలుత సీఎం, ఆ తర్వాత మంత్రులు, ఇప్పుడేమో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారని విమర్శించారు. రెండు నెలల ప్రజావాణిలో స్వీకరించిన ఒక్క దరఖాస్తునైనా పరిష్కరించారా? అని ప్రశ్నించారు. 13 అంశాలుగా ఆరు హామీలు ఉంటే.. అందులో రెండు మాత్రమే అమల్లోకి తెచ్చారని అన్నారు. ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణంతో 6.5 లక్షల మంది ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని, ఆటోలకు ఈఎంఐలు కట్టలేక.. డ్రైవర్ల ఇళ్లలో పొయ్యి కూడా వెలగడంలేదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో 21 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, వారి కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.. కాంగ్రెస్ హామీల అమలు.. పంచ పాండవులు, మంచం కోళ్లలాగా ఉందన్నారు.

ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్‌కు సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసులో విచారణను తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్‌కు లేదా ఛత్తీస్‌గఢ్‌కు మార్చాలని దాఖలైన పిటిషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డికి సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసు జారీ చేసింది. ఓటుకు నోటు వ్యవహారానికి సంబంధించి హైదరాబాద్‌లోని విచారణ కోర్టులో పెండింగులో ఉన్న రేవంత్‌రెడ్డి, సండ్ర వెంకట వీరయ్యకు సంబంధించిన రెండు కేసులను తెలంగాణ నుంచి బదిలీ చేయాలని బీఆర్ఎస్ నేతలు జగదీ‌ష్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. రేవంత్ తెలంగాణ సీఎంగా ఉన్నందున ఈ కేసులపై విచారణ నిష్పక్షపాతంగా జరిగే అవకాశాలు లేవని పిటిషన్‌లో పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డిపై తెలంగాణలోని పలు కోర్టుల్లో 88 కేసులు పెండింగులో ఉన్నాయని, ఇవి ఆయన నేర నేపథ్యాన్ని తెలియజేస్తున్నాయన్నారు. 2015లోనే ఓటుకు నోటు కేసు దాఖలు అయినప్పటికీ విచారణను ఆలస్యం చేసేందుకు నిందితులు పలు దరఖాస్తులు వేస్తూ వచ్చారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రేవంత్‌రెడ్డి గతంలో తెలంగాణలోని పలువురు సీనియర్ పోలీసు అధికారులను బెదిరింపులకు గురి చేశారని, తనపై ఉన్న అవినీతి కేసు కొలిక్కిరాకుండా ఉండేందుకు నిజాయితీ పోలీసు అధికారులను ఆయన బదిలీ చేయగలరని ఆరోపించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సీఎం రేవంత్‌రెడ్డి హోంమంత్రిగా ఉన్నారని, ఏసీబీ ఆయన అధ్వర్యంలోనే ఉన్నదని పిటిషన్‌లో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో విచారణ నిష్పక్షపాతంగా జరగదని, విచారణను మధ్యప్రదేశ్ లేదా ఛత్తీస్‌గఢ్‌లలోని కోర్టుకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు సిద్దార్థ ధవే, దామ శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. పిటిషన్‌పై స్పందించాల్సిందిగా సుప్రీంకోర్టు జడ్జిలు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం రేవంత్‌రెడ్డికి నోటీసు జారీ చేసింది. సమాధానం ఇచ్చేందుకు నాలుగు వారాల సమయం ఇచ్చింది.

స్తంభించిన మండలి

రేవంత్ క్షమాపణ చెప్పాలంటూ.. నల్లకండువాలతో బీఆర్ఎస్ సభ్యుల నిరసన



మండలిలో నల్లకండువాలు ధరించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి శుక్రవారం బీఆర్ఎస్ సభ్యుల నిరసనలతో హోరెత్తింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశంపై చర్చ జరగాల్సి ఉండగా.. ఎటువంటి కార్యకలాపాలు లేకుండా స్తంభించిపోయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ ఇంటర్వ్యూలో శాసనమండలిని, మండలి సభ్యులను అవమానించేలా మాట్లాడారని, తన వ్యాఖ్యలపై సీఎం క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. ఉదయం సమావేశాలు ప్రారంభం కాగానే నల్లకండువాలు ధరించి సభలోకి వచ్చిన సభ్యులు.. పోడియం వద్దకు చేరుకుని సీఎం క్షమాపణ చెప్పేవరకు సభా కార్యకలాపాలు సాగనివ్వబోమంటూ అడ్డుకున్నారు. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు, నిరసనలతో హోరెత్తించారు. మండలి సభ్యులపై సీఎం చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని, ఇది చట్టసభలను, సభ్యులను కించపరచడమే అవుతుందని అన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తే రాజ్యాంగ సంస్థలు, సంస్థల్లోని సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ముఖ్యమంత్రి తీరు సభ గౌరవానికి భంగకరమన్నారు. సీఎం తరఫున మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు సమాధానం చెప్పడానికి ప్రయత్నించగా.. సభ్యులు అంగీకరించలేదు. నిరసనలు విరమించలేదు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదుసార్లు మండలి వాయిదా పడింది. చివరకు సాయంత్రం 6.50 గంటల వరకు సీఎం శాసనమండలికి రాకపోవడం, బీఆర్ఎస్ సభ్యులు పట్టు వీడకపోవడంతో సభా కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఎటువంటి చర్చ లేకుండానే మండలి శనివారానికి వాయిదా పడింది.

సభ్యులను అడ్డుకున్న మార్షల్స్..

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నిరసన తెలిపేందుకు నల్లకండువాలతో వచ్చిన బీఆర్ఎస్ సభ్యులను మండలి ప్రవేశద్వారం వద్దనే మార్షల్స్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. నల్లకండువాలతో సభలోకి ప్రవేశించరాదని మార్షల్స్ చెప్పడంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది. అయితే నిరసన తెలపడం తమ హక్కు అని, అవసరమైతే తమను సస్పెండ్ చేయమనండి అంటూ లోపలికి వెళ్లారు. సభ ప్రారంభమైన వెంటనే సీఎం వ్యాఖ్యలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయనే వచ్చి క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ముఖ్యమంత్రి శాసనసభలో ఉన్నారని, ఆయన తరఫున మంత్రులుగా తాము సమాధానం చెబుతామని మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు చెప్పినా అంగీకరించలేదు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వచ్చి వారితో మాట్లాడేందుకు ప్రయత్నించినా పట్టు వీడలేదు. చైర్మన్ సుఖేందర్‌రెడ్డి సముదాయించే ప్రయత్నం చేసినా వినలేదు.

ఆ ఐఏఎస్ అరవింద్ కుమార్!

- శివబాలకృష్ణ చెప్పింది ఆయన పేరే
- ఆయన విచారణకు ప్రభుత్వ అనుమతి కోరిన ఏసీబీ
- బెయిల్ కోసం కోర్టుకు శివబాలకృష్ణ

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ ఎదుట హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ వెల్లడించిన పేరు సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌దేనా!? కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లో ఆయన పేరునే చెప్పారా!? ప్రభుత్వ అనుమతితో అరవింద్ కుమార్‌కు నోటీసులు జారీ చేసి విచారించేందుకు ఏసీబీ సిద్ధమైందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. మార్కెట్ విలువ ప్రకారం వెయ్యి కోట్ల రూపాయల కుపైగా అక్రమాస్తులు కూడబెట్టారని ఆరోపణలు ఎదుర్కొంటున్న శివబాలకృష్ణ ఎనిమిది రోజుల ఏసీబీ కస్టడీలో కీలక విషయాలను వెల్లడించిన విషయం తెలిసిందే. ఓ ఐఏఎస్ అధికారి సూచన మేరకు నడుచుకున్నానని, ఆయనతో కలిసి కోట్ల రూపాయల లావాదేవీలు జరిపానంటూ ఆ వివరాలను ఏసీబీ అధికారుల ఎదుట వివరించారు. నార్సింగిలోని కొంత వివాదాస్పద భూమికి సంబంధించి సదరు ఐఏఎస్ అధికారి ఆదేశాల మేరకే అనుమతులు ఇచ్చానని, ప్రతిఫలంగా స్థిరాస్తి వ్యాపారి నుంచి సదరు ఐఏఎస్ రూ.10 కోట్లు డిమాండ్ చేశారని, అందులో మొదటి విడతగా గత డిసెంబరులో కోటి రూపాయలు చెల్లించానని ఏసీబీకి శివబాలకృష్ణ వివరించినట్లు తెలిసింది. సదరు ఐఏఎస్‌తో జరిపిన మొత్తం లావాదేవీలు, నగదు చేరవేత తదితర వివరాలను ఏసీబీ అధికారులకు వెల్లడించినట్లు సమాచారం. కస్టడీలో శివబాలకృష్ణ వెల్లడించిన కన్ఫెషన్ స్టేట్‌మెంట్ కాపీని ఏసీబీ అధికారులు కోర్టుకు, నిబంధనల మేరకు నిందితుడికి అందజేశారు. శివబాలకృష్ణతో కలిసి కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహించిన ఐఏఎస్ పేరు అధికారికంగా బయటకు రాలేదు. కానీ, ఏసీబీ ఎదుట శివబాలకృష్ణ చెప్పిన పేరు సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌దేనని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అరవింద్ కుమార్‌తో శివబాలకృష్ణకు సాన్నిహిత్యం ఉంద ని, ఆయన కార్యాలయంలోకి నేరుగా వెళ్లేవారని గుర్తుచేస్తున్నాయి. మరోవైపు, శివబాలకృష్ణ కస్టడీలో ఇచ్చిన కన్ఫెషన్ స్టేట్‌మెంట్ ఆధారంగా సదరు ఐఏఎస్‌ను విచారించేందుకు ఏసీబీ ఇప్పటికే ప్రభుత్వ అనుమతి కోరింది. అనుమతి ఇస్తే.. నోటీసులు జారీ చేసి విచారించేందుకు సిద్ధమైంది. వెరసి, వేగంగా మలుపులు తిరుగుతున్న ఈ కేసులో వచ్చే వారం మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. సదరు ఐఏఎస్‌తోపాటు మరికొందరికి ఏసీబీ నోటీసు లు జారీ చేసి ప్రశ్నించడంతోపాటు పక్కా ఆధారాలు ఉన్న వారిని అరెస్ట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా ఏసీబీ కస్టడీ ముగియడంతో బెయిల్ కోరుతూ శివబాలకృష్ణ కోర్టును ఆశ్రయించారు.



పత్రాల పరిశీలనకు రెవెన్యూ సహకారం

శివబాలకృష్ణ అరెస్ట్ సమయంలో, వరుస తనిఖీల్లో, బినామీల్ని విచారించిన సమయంలో స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాల్ని ఏసీబీ పరిశీలిస్తోంది. వేర్వేరు ప్రాంతాల్లో 214 ఎకరాల వ్యవసాయ భూములు, లే ఔట్లలో 29 ప్లాట్లు, అపార్ట్‌మెంట్లలో డబుల్, ట్రిబుల్ బెడ్‌రూం ప్లాట్లు 7, ఒక విల్లాను ప్రస్తుతానికి ఏసీబీ గుర్తించింది. ఇతర బినామీలను విచారించినప్పుడు కొత్త ఆస్తులు వెలుగులోకి వచ్చే అవకాశం లేకపోలేదని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. దాంతో, ఆయా ఆస్తుల కొనుగోళ్లకు సంబంధించి రికార్డులు, సోదాల్లో లభించిన డాక్యుమెంట్ల పరిశీలనకు రెవెన్యూ విభాగం సహకారం తీసుకుంటున్నారు.

నిఘాలో శివబాలకృష్ణ

సైదాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న శివబాలకృష్ణ భద్రత విషయమై అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. సీసీ కెమెరాల నిఘాతోపాటు నిరంతరం అధికారుల పర్యవేక్షణలో ఉంచినట్లు సమాచారం. ఆయనను ఉంచిన బ్యారక్ వద్ద జైలు సిబ్బంది 24 గంటలూ పహరా కాస్తున్నారు. అనుమానితులను అక్కడికి రానివ్వడం లేదని తెలిసింది. ఇదే కేసులో జైలులో ఉన్న బాలకృష్ణ సోదరుడు నవీన్‌కుమార్‌ను కలవనీయకుండా వేరే బ్యారక్‌లో ఉంచినట్లు సమాచారం.

ఐఏఎస్‌ల భూమాయ!

- ప్రభుత్వ పెద్దలతో సన్నిహితంగా ఉండి భూముల కొనుగోళ్లు
- ఇప్పటికే సోమేశ్ కుమార్ భార్య పేరిట భూములపై వివాదం
- తాజాగా వెలుగులోకి రజత్ కుమార్..
- గతంలో పనిచేసిన ఐఏఎస్‌ల భూముల కొనుగోళ్లపై కాంగ్రెస్ బృందం నజర్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత సలహాదారుగా వ్యవహరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్ భార్య డాక్టర్ జ్ఞాన ముద్ర పేరిట రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కొత్తపల్లిలో 25.19 ఎకరాల భూమి ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ అంశం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే, ప్రభుత్వానికి చెప్పి.. నిబంధనల ప్రకారమే ఆ భూమిని కొనుక్కున్నట్లు మాజీ సీఎస్ సోమేశ్ వివరణ ఇచ్చారు. గత ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన రజత్‌కుమార్ పేరిట మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం హేమాజీపూర్‌లో 15.15 ఎకరాలు ఉన్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అయితే, 2014 కంటే ముందే ఆ భూములను తాను కొన్నానని, 2021లో అమ్మేశానని, ఈ రెండు సందర్భాల్లోనూ జీఏడీకి సమాచారం ఇచ్చానని ఆయన వివరణ ఇచ్చారు. కానీ, ఇప్పటికీ ఆ భూములు ఆయన పేరిటే రికార్డుల్లో కనిపిస్తూ ఉండడం విశేషం. ఇద్ద రు సీనియర్ ఐఏఎస్‌ల భూముల కొనుగోలు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వ పెద్దలతో అత్యంత సన్నిహితంగా ఉండడమే కాకుం డా ఎప్పుడు, ఎక్కడ ఏయే ప్రాజెక్టులు రానున్నాయనే సమాచారం ముందుగా తెలిసే అధికారులు భూములు కొనుగోలుచేయడం తీవ్ర వివాదాస్పదమవుతోంది. వీరు కాకుండా ఇంకా ఎవరెవరు భూములు కొనుగోలు చేశారనే అంశంపై చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే, బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక పోస్టులు నిర్వహించిన కొందరు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారులు కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలపై కాంగ్రెస్ బృందం కన్నేసిందని తెలుస్తోంది. గత ప్రభుత్వంలో ఉన్నత పోస్టుల్లో ఉండి ఎక్కడెక్కడ ఎన్ని ఆస్తులు సంపాదించారనే అంశంపై సత్యశోధన చేస్తున్నట్లు సమాచారం. ఆ ఉన్నతాధికారులు, వారి కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న భూముల వివరాలను తెలుసుకునేందుకు ధరణి పోర్టల్‌ను ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది. వీరిలో కొందరు పదవీ విరమణ చేస్తే, మరికొందరు వివిధ శాఖల్లో పనిచేస్తున్నారు. వారందరి ఆస్తుల సమాచారాన్ని బహిర్గతం చేసేందుకు ఆ బృందం రాత్రింబవళ్లు ప్రత్యేకంగా పని చేస్తున్నట్లు సమాచారం. నిజానికి, రాష్ట్ర, కేంద్ర కేడర్లకు సంబంధించిన ఉన్నతాధికారులు ప్రభుత్వ అనుమతితోనే ఆస్తులను కొనుగోలు చేయాలి. రాష్ట్ర కేడర్‌కు సంబంధించిన అధికారులైతే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో, కేంద్ర కేడర్‌కు చెందిన అధికారులు కేంద్ర ప్రభుత్వ అనుమతితో కొనుగోలు చేయాలి. సదరు ఆస్తులపై కేంద్ర ప్రభుత్వ అధికారులు డీవోపీటీకి కూడా సమాచారం ఇవ్వాలి. ఈ నేపథ్యంలోనే, సదరు అధికారులు ఆయా ఆస్తులను ప్రభుత్వాలు, డీవోపీటీ అనుమతితోనే కొనుగోలు చేశారా!? అనే అంశం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ, ప్రభుత్వాల అనుమతితోనే కొనుగోలు చేసినా.. ప్రభుత్వ పెద్దలకు అత్యంత సన్నిహితంగా ఉండే వాళ్లు, ఎప్పుడు, ఎక్కడెక్కడ ప్రాజెక్టులు వస్తాయో తెలిసిన వాళ్లు భూములు కొనుగోలు చేయడం వివాదాస్పదమవుతోంది. భూముల రేట్లు పెరుగుతాయని తెలిసి.. తక్కువ ధరకే రైతుల నుంచి వాటిని కొనుగోలు చేయడం ఎంతవరకూ సమంజసమనే వాదన వ్యక్తమవుతోంది.

రెండు మునిసిపాలిటీలు హస్తగతం

మంచిర్యాల, నస్పూర్‌లలో ఎగిరిన కాంగ్రెస్ జెండా

మంచిర్యాల/సదాశివపేట/మోత్కూరు/ఆదిభట్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలోని నస్పూర్, మంచిర్యాల మునిసిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. శుక్రవారం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు సంబంధించి ప్రత్యేక సమావేశం జరిగింది. మంచిర్యాల మునిసిపల్ చైర్మన్‌గా డాక్టర్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్‌గా సల్ల మహేశ్, నస్పూర్ మునిసిపల్ చైర్మన్‌గా సురిమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్‌గా గెల్లు రజితలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు మునిసిపాలిటీలకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీకి సంఖ్యాబలం పెరిగింది. దీంతో రెండు మునిసిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది.

సదాశివపేట బీఆర్ఎస్ వర్సెస్ బీఆర్ఎస్

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్(బీఆర్ఎస్)పై సొంతపార్టీ సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శుక్రవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది కౌన్సిలర్లు ఓటేశారు. మొత్తం 26 వార్డులకుగాను బీఆర్ఎస్ 13 స్థానాలను గెలుచుకుంది. బీఆర్ఎస్ తరఫున జయమ్మ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. తర్వాత కాంగ్రెస్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరారు. మొత్తం 22 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టగా.. 21 మంది అనుకూలంగా ఓటేశారు. మరోవైపు.. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ సావిత్రిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. తొమ్మిది మంది కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 12 మంది కౌన్సిలర్లకుగాను 10 మంది హాజరయ్యారు. కాగా, రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మునిసిపాలిటీలో చైర్‌పర్సన్ ఆర్తీక (కాంగ్రెస్), వైస్ చైర్‌పర్సన్ కళమ్మ (బీఆర్ఎస్)లపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. కాంగ్రెస్ సభ్యులు.. బీఆర్ఎస్, బీజేపీ సభ్యులతో కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టారు. మొత్తం 15 మంది పాలకమండలి సభ్యులు ఉండగా.. శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి 14 మంది హాజరయ్యారు. 13 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేశారు.

17 లోక్‌సభ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల నిర్ణయం

- త్వరలో ప్రకటన: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే బీజేపీ అభ్యర్థుల జాబితాపై శుక్రవారం ఢిల్లీలో ఆ పార్టీ ఎన్నికల కమిటీ చర్చలు జరిపింది. 17 స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ఖరారు చేసి కేంద్ర పార్లమెంటరీ బోర్డుకు సమర్పించింది. ఈ స్థానాల్లో ముగ్గురి పేర్ల చొప్పున నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వీలైనంత త్వరగా అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారం ఎలా ఉండాలి.. ఎలాంటి ఎత్తుగడలతో ముందుకు వెళ్లాలన్న విషయంపైనా చర్చించామని తెలిపారు. తొలి జాబితాలోనే అధిక పేర్లు ఉంటాయన్నారు. బీజేపీ గెలుపొం దేందుకు తెలంగాణలో మంచి వాతావరణం ఉన్నదని, త్వరలో పెద్ద ఎత్తున చేరికలుంటాయని ఆయన పేర్కొన్నారు.

మానసిక నిపుణులతో రహస్యంగా కౌన్సెలింగ్ ఇచ్చివుంటే..

- భవ్యశ్రీ, వైష్ణవి బతికేవారన్న అభిప్రాయాలు
- భువనగిరి హాస్టల్ ఘటనలో ఐదుగురి విచారణ

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 9: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో భవ్యశ్రీ, వైష్ణవిలను మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహించి ఉంటే ఆ ఇద్దరు బాలికలు బతికేవారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఇద్దరు బాలికల తీరుపై కొందరు బాలికలు ఫిర్యాదు చేయడం.. ప్రత్యేక గదిలో పీఈటీ, హాస్టల్ వార్డెన్ కౌన్సెలింగ్ నిర్వహించడం.. బయటకు వచ్చాక ఫిర్యాదు చేసిన బాలికలు ఒకరకంగా చూడటంతో అవమానానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నారు. ఈ మేరకు ఆ హాస్టల్లో ఒకే గదిలో ఉంటున్న ఇద్దరు బాలికల ఆత్మహత్య ఘటనపై విచారణ కొనసాగుతోంది. ప్రభుత్వం నియమించిన జిల్లాకు చెందిన విచారణ అధికారి నాగలక్ష్మి, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, డీసీపీవో సైదులు సంక్షేమ వసతి గృహంలోని సిబ్బందిని విచారించారు. ఆత్మహత్యలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురిని సుమారు ఏడు గంటల పాటు విచారించి వివరాలు నమోదు చేసుకున్నట్లు సమాచారం. అయితే భవ్యశ్రీ, వైష్ణవి సున్నిత మనస్కులని, హాస్టల్ విద్యార్థినులు రెండు గ్రూపులుగా ఉంటూ తరచుగా గొడవ పడేవారని, కౌన్సెలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితులు, జరిగిన తీరుతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని విచారణ బృందంతో పాటు ఇతరులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా విచారణ బృందం సమర్పించే నివేదిక, పోస్టుమార్టం, సూసైడ్ నోట్ ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు అందితేనే భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్య మిస్టరీ తేలనుంది. మరోవైపు.. భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్యపై దేశ రాజధాని ఢిల్లీకి చెందిన ఉపభుక్త ఈవామ్ మానవ్ అధికార్ రక్షా సమితి ప్రతినిధులు శుక్రవారం హాస్టల్‌ను సందర్శించి ఆత్మహత్యకు దారి తీసిన కారణాలను పరిశీలించారు. జంట ఆత్మహత్యల ఉదంతాన్ని జాతీయ మానవ హక్కుల సంఘానికి వివరించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు సహెరా భాను తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై లుక్ అవుట్ సర్క్యులర్ కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్ కేసులో నిందితునిగా ఉన్న బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై పంజాగుట్ట పోలీసులు జారీచేసిన లుక్అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ)ని హైకోర్టు కొట్టేసింది. ఈ కేసులో ఆయనను అరెస్ట్ చేయరాదని ఆదేశించింది. అయితే 23 లోగా పోలీసుల ఎదుట హాజరుకావాలని, దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలని స్పష్టంచేసింది. పోలీసులు సీఆర్పీసీ 41ఏ ప్రొసీజర్‌ను అమలు చేయాలని పేర్కొంది. ప్రజాభవన్ వద్ద బారికేడ్లను ఢీకొట్టి బీభత్సం సృష్టించిన వ్యవహారంలో ప్రధాన నిందితుడైన తన కుమారుడు సాహిల్‌ను కేసు నుంచి తప్పించేందుకు మాజీ ఎమ్మెల్యే షకీల్ ప్రయత్నించారని, ఇద్దరు సీఐలతో కలిసి కుట్ర చేశారని ఆరోపిస్తూ పోలీసులు ఆయనను నిందితుడిగా చేర్చారు. విదేశాల్లో ఉన్న తమపై పంజాగుట్ట పోలీసులు ఎల్‌వోసీ జారీచేయడాన్ని సవాల్ చేస్తూ షకీల్ మరో ఇద్దరు నిందితులు హైకోర్టులో శుక్రవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసును పోలీసులు ఇంత వేగంగా దర్యాప్తు చేస్తుండటంపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. సాధారణ ప్రజలకు సంబంధించిన కేసులను సైతం పోలీసులు ఇంతే వేగంగా దర్యాప్తు చేస్తారా? అని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ప్రశ్నించింది. ఇదే కేసులో ఓ ఇన్‌స్పెక్టర్‌ను అరెస్ట్ చేసినట్లు తాము పత్రికల్లో చదివామని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఏడేళ్లలోపు శిక్షపడే కేసుల్లో నోటీసులు ఇవ్వకుండా ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని ప్రశ్నించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ నిందితులందరూ హైకోర్టులో క్వాష్ పిటిషన్‌లు దాఖలు చేశారని తెలిపారు. చట్టప్రకారం నోటీసులు జారీచేయాలని కోర్టు ఆదేశించినా పోలీసులు అరెస్ట్ చేస్తున్నారని ఆరోపించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. మాజీ ఎమ్మెల్యే షకీల్ సహా ఇతర పిటిషనర్లు 23లోగా పోలీసుల ఎదుట హాజరుకావాలని పేర్కొంది.

మంతూరు వద్ద మరో ఎత్తిపోతల పథకం

» ఆందోల్‌లో అదనంగా 40వేల ఎకరాల సాగుకు నీరు

» శ్రీకారం చుట్టిన మంత్రి దామోదర

సంగారెడ్డి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) పుల్కల్ మండలం మంతూరు వద్ద మరో ఎత్తిపోతల పథకం నిర్మించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆందోల్ నియోజకవర్గంలో 40 వేల ఎకరాల సాగుకు నీరందించే ఉద్దేశంతో ఈ ఎత్తిపోతల పథకం చేపట్టనున్నారు. సింగూరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఈ నియోజకవర్గంలోని పుల్కల్, చౌటకూర్, మునిపల్లి మండలాలలోని సుమారు 30 వేల పైచిలుకు ఎకరాలకు ఇప్పటికే సాగు నీరందిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో సుమారు లక్షకు పైగా చిలుకు ఎకరాలకు సాగు నీరందించేందుకు గత ప్రభుత్వం బసవేశ్వర ఎత్తిపోతల పథకం చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు 2022 ఫిబ్రవరిలోనే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నారాయణఖేడ్‌లో శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పటివరకు భూసేకరణ జరపకపోవడం, పనులు చేపట్టకపోవడం వంటి పరిణామాలకు తోడు ప్రభుత్వం కూడా మారిపోయింది. ఈ పరిస్థితులలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బసవేశ్వర ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని సమీక్షించాలని నిర్ణయించింది. ఈ ఎత్తిపోతల పథకం సంగతెలా ఉన్నా ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న దామోదర కొత్తగా పుల్కల్ మండలం మంతూరు వద్ద ఎత్తిపోతల ద్వారా పథకం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. ఇందుకోసం చేసే సర్వేకు అనుమతించాల్సిందిగా లేఖ రాశారు. నీటి పారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా కొత్త అధికారి రాగానే మంతూరు ఎత్తిపోతల పథకం ఏర్పాటు సర్వేకు అనుమతి వస్తుందని ఆ శాఖ తెలిపింది.

త్వరలో టీజీవో సంఘం ఎన్నికలు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘానికి త్వరలో ఎన్నికలు జరగనున్నాయని టీజీవో సెంట్రల్ సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం సచివాలయం మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, నల్లగొండ ఆర్డీవో ఎన్.రవిని ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా, స్టేట్ వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయంలో సహాయ కమిషనర్‌గా ఉన్న సి.సంపత్ కుమార్‌ను ఏఆర్‌వోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందని ఏలూరి తెలిపారు. పది రోజుల్లో ఎన్నికల ప్రకటన వెలువడుతుందని, నెల రోజుల వ్యవధిలో నూతన టీజీవో సంఘం బాధ్యతలు స్వీకరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

రూ.1000 కోట్ల అప్పు కోసం రాష్ట్రం ఇండెంటు

మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈనెల 13న రిజర్వ్ బ్యాంక్ ఇండియా నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించనుంది. 22 ఏళ్ల కాల పరిమితితో రుణం తీసుకోవడానికి సెక్యూరిటీ బాండ్లను జారీ చేసింది. రాష్ట్రం సహా దేశంలోని 9 రాష్ట్రాలు రూ.17,500 కోట్ల రుణాల కోసం బాండ్లను జారీ చేశాయి.

గోదావరి బోర్డు సమావేశం 27కు వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సమావేశం మరోమారు వాయిదా పడింది. తొలుత ఈ నెల 6వ తేదీన సమావేశం నిర్వహించాలని బోర్డు ప్రతిపాదించగా.. ఏపీలో అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున వాయిదా వేయాలని ఆ రాష్ట్ర అధికారులు నివేదించడంతో ఈ నెల 13వ తేదీకి వాయిదా వేశారు. కాగా తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున 13వ తేదీన సమావేశాన్ని వాయిదా వేయాలని రాష్ట్రప్రభుత్వం కోరడంతో ఈ నెల 27వ తేదీన తదుపరి సమావేశం ఉంటుందని బోర్డు శుక్రవారం సమాచారం ఇచ్చింది.

ఎంపీ అర్వింద్‌కు టికెట్ ఇవ్వొద్దు

» బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద కార్యకర్తల నిరసన



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న కార్యకర్త

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు టికెట్ ఇవ్వొద్దని ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. అర్వింద్‌కు బీ ఫాం ఇస్తే ఓడిస్తామని హెచ్చరించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద జగిత్యాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు అర్వింద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపీగా గెలిచిన అర్వింద్ జగిత్యాల జిల్లాలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను అణగదొక్కుతూ వస్తున్నారని.. ఈ విషయాన్ని పలుమార్లు కేంద్ర, రాష్ట్ర కమిటీలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. అర్వింద్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఓ కార్యకర్త ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. పక్కనున్న కార్యకర్తలు వెంటనే అతడిపై నీళ్లు పోశారు.

బీసీ వ్యతిరేక ప్రభుత్వాలను వదలం: జాజుల

» బీసీల ఉద్యమానికి మద్దతిస్తాం: డి.రాజా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బీసీ వ్యతిరేక పార్టీలను, ప్రభుత్వాలను వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయంగా బొందపెడతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. మార్చిలో లక్ష మందితో ఢిల్లీలో బీసీల జంగ్ సైరన్ పేరిట సభ నిర్వహించి, బీసీల తడాఖా చూపిస్తామని తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాజకీయ యాత్ర చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా క్లబ్‌లో శుక్రవారం జాతీయ ఓబీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ దేశంలో ఓబీసీల తరఫున పార్లమెంట్‌లో ప్రశ్నించాల్సిన వాళ్లు ఈడీ భయడంతో నోరు మెదపడం లేదని, ఆర్ఎస్ఎస్ భయంతో ఆయా ప్రభుత్వాలు స్పందించడం లేదని విమర్శించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ బీసీ ఉద్యమానికి తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. బీసీల డిమాండ్ల విషయంలో కేంద్రంపై మరింత ఒత్తిడి పెంచుతామన్నారు. టీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత కేశవరావు మాట్లాడుతూ రాజకీయంగా ఏకతాటిపైకి వచ్చి, ఓట్ల విప్లవాన్ని తీసుకొస్తేనే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

కొత్త విద్యుత్ ప్లాంట్లు నిర్మించాలి

» ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి: ఇంజనీర్స్ అసోసియేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం, భూపాలపల్లి, కొత్తగూడెంలలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాలు నిర్మించాలని తెలంగాణ విద్యుత్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అసోసియేషన్ వినతిపత్రాన్ని సమర్పించింది. కొత్తగూడెంలో పాత విద్యుత్ కేంద్రాలను క్రమంగా మూతపెట్టి, కొత్తగా 800 మెగావాట్ల యూనిట్ ఒకటి నిర్మించాలని, రామగుండంలో ఇప్పటికే పాతబడిన 62.5 మెగావాట్ల ప్లాంట్ స్థానంలో కొత్తగా 800 మెగావాట్లతో ఒక యూనిట్‌ను, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని చేల్పూరులో అదనంగా 800 మెగావాట్లతో ప్లాంట్‌ను నిర్మించాలని అసోసియేషన్ అధ్యక్ష, కార్యద ర్శులు ఎం.నెహ్రూ, ఎస్.భాస్కర్ కోరారు. విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న సబ్ ఇంజనీర్/అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులను భర్తీ చేయాలని, 1999-2004 మధ్యలో నియమితులైన విద్యుత్ ఇంజనీర్లకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల కేసు 12కు వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్‌అలీ ఖాన్‌ల నియామకాన్ని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణలు దాఖలు చేసిన పిటిషన్‌లపై శుక్రవారం వాదనలు కొనసాగాయి. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా పడింది. తుది తీర్పు వెలువడే వరకు ఎమ్మెల్సీల నియామకాలపై స్టేటస్ కో ఆదేశాలు కొనసాగుతాయని హైకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది.

యాసంగి పంటకు నీరెట్లా..?

డెడ్ స్టోరేజీకి చేరువలో సాగర్ జలాశయం.. నల్లగొండ జిల్లాలో అడుగంటిన భూగర్భజలాలు

» ప్రశ్నార్థకంగా 3 లక్షల ఎకరాల పైర్లు

» వన్యప్రాణులు, పశువులకూ తాగునీటి గండం

» వేసిన పంటలను దక్కించుకునేందుకు..

చెరువులనైనా నింపాలని రైతుల విన్నపం

నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో నీరులేని తీగల చెరువు



నల్లగొండ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తలాపునే కృష్ణమ్మ ఉన్నా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పంట భూములు మాత్రం ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండగా, వేసవి రాకముందే సాగు నీటికి ఇబ్బందులేర్పడే పరిస్థితి కనిపిస్తోంది. ఇక తాగు నీటి పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నాగార్జునసాగర్ ఆయకట్టుకు యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించినా రైతులు బోరుబావుల ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం బోరుబావుల్లో సైతం నీరు అడుగంటడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. వేసిన పంటలను కాపాడుకునేందుకు సాగర్ నీటితో చెరువులనైనా నింపాలని రైతులు కోరుతున్నారు. తాగునీటికి మినహా సాగర్ జలాశయం నుంచి నీళ్లివ్వలేమని అధికారులు తేల్చిచెబుతుండడంతో ఆయకట్టులో పంటలు చేతికందే పరిస్థితి లేకుండా పోయింది. మరోవైపు నాన్ ఆయకట్టు ప్రాంతాల్లోనూ నీటి కొరతతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా బేసిన్‌లో వర్షాభావ పరిస్థితి, ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల లేకపోవడంతో నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 518.40 అడుగులకు చేరింది. ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ నీటిమట్టం 510 అడుగులకు కేవలం ఎనిమిది అడుగుల వ్యత్యాసమే ఉంది. ఇప్పటికీ నిత్యం పాలేరుకు తాగు నీటికోసం, ఏఎమ్మార్పీ ద్వారా మొత్తం 4,872 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల కొనసాగిస్తున్నారు. మరోవైపు అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏకేబీఆర్) ద్వారా హైదరాబాద్ మహానగరానికి నిత్యం 1,350 క్యూసెక్కుల చొప్పున నీటిని, నల్లగొండ జిల్లాకు రోజుకు 45 క్యూసెక్కుల నీటిని తాగునీటికోసం సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జలాశయం త్వరలో డెడ్‌స్టోరేజీకి చేరువవడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే రెండు రాష్ట్రాలకు తాగునీటికోసం సాగర్‌జలాలు వినియోగించాల్సి ఉన్నందున వేసవిలో అవసరమైతే ఎమర్జెన్సీ మోటర్ల ద్వారా నీటిని పంపింగ్ చేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావం కారణంగా భూగర్భజలాలు గణనీయంగా పడిపోయాయి. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో సగటున 7.68 మీటర్ల లోతున భూగర్భజలాలు నమోదుకాగా, ఈ ఏడాది 8.68 మీటర్ల లోతుకు నీటి మట్టాలు పడిపోయాయి. అత్యధికంగా దేవరకొండ డివిజన్‌లో 9.36 అడుగుల లోతుకు భూగర్భజలాలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

యాసంగి పంటలు చేతికందడం కష్టమే

నల్లగొండ జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో సాగైన పంటలు చేతికందేలా కనిపించడంలేదు. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో 5.86లక్షల ఎకరాలకు గాను 2.99లక్షల ఎకరాలు మాత్రమే వరిసాగుతోపాటు ఇతర పంటలు సాగు చేశారు. ఇందులో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు కాగా, 50 వేల ఎకరాల్లో వేరుశనగ, 6వేల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న, ఆముదం, విఎనుము, బొబ్బెర, పెసర పంటలు సాగయ్యాయి. ఈ పంటలన్నింటికీ నీటిఎద్దడి నెలకొనడంతో పంటలు చేతికందేనా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా నాగార్జునసాగర్ ఆయకట్టులో ఎడమకాల్వ కింద నీటివిడుదల లేకపోవడంతో రైతులు యాసంగి సీజన్‌లోనూ బోరుబావుల కింద సుమారు 30వేల ఎకరాలకు లోబడి మాత్రమే పంటలు సాగుచేశారు. మరోవైపు ఏఎమ్మార్పీ, డిండి ప్రాజెక్టుల కింద కూడా వరి సాగుచేయలేదు. మూసీ ప్రాజెక్టు కింద మాత్రం 32వేల ఎకరాల్లో నాట్లు పడగా, మిగతా వరినాట్లు అన్నీ బోర్లు, బావుల కిందే వేశారు.

వన్యప్రాణులకూ, పశువులకూ నీటి ఎద్దడి

నల్లగొండ జిల్లాలో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించిన దేవరకొండ డివిజన్‌లో ఇటీవల అటవీ జంతువుల సంఖ్య పెరిగింది. వేసవి కావడం, నీటితొట్లలో సమృద్ధిగా నీరులేకపోవడంతో వన్యప్రాణులు, అటవీ జంతువులు నీటికోసం అడవి నుంచి బయటకు వచ్చే పరిస్థితి నెలకొంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా నల్లమలలో ప్రతీ సంవత్సరం మాదిరిగానే నీటితొట్లను అధికంగా ఏర్పాటుచేసి వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. వర్షాభావం, పశుగ్రాసం కొరత కారణంగా చందంపేట, నేరేడుగొమ్ము, దేవరకొండ ప్రాంత రైతులు పశువులను మేతకోసం గుంటూరు, మాచర్ల, నాగార్జునసాగర్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాగా డిండి ప్రాజెక్టులో ప్రస్తుతం 36 అడుగుల నీరు ఉంది. వేసవిని దృష్టిలో పెట్టుకొని అధికారులు చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని 36 చెరువులు, కుంటలను డిండి ప్రాజెక్టు నీటితో నింపి పశువులు, మూగజీవాలకు, రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పశువులకూ నీరు దొరకడం లేదు



ఈ సంవత్సరం వర్షాలు లేకపోవడంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. రెండు ఎకరాల్లో వేరుశనగ పంట వేయగా బోరులో నీరు అడుగంటిపోవడంతో ఎండే దశకు చేరింది. దీంతో లక్ష రూపాయల వరకు పెట్టుబడులు పెట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

- సత్తయ్య, రైతు, చందంపేట

పాస్‌పోర్టుల కేసులో ఐదుగురికి బెయిల్

హైదరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విదేశీయులకు భారత పౌరసత్వ ధ్రువపత్రాలు సృష్టించి పాస్‌పోర్టులు ఇప్పించిన కేసులో నిందితులు ఒక్కొక్కరుగా బెయిల్‌పై విడుదలవుతున్నారు. జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన ఈ కేసులో సీఐడీ ఇప్పటి వరకు 16 మంది నిందితులను అరెస్ట్ చేసింది. వారిలో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న పలువురుని సీఐడీ కస్టడీకి తీసుకుని విచారించింది. కస్టడీ ముగియడంతో ఐదుగురు నిందితులు కోర్టు ను ఆశ్రయించగా, విచారణ అనంతరం న్యాయస్థానం వారికి బెయిల్ మంజూరు చేసిం ది. కాగా నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులు పొందిన వారిలో శ్రీలంక నుంచి అక్రమంగా భారత్‌కు వచ్చిన యువకులే ఎక్కువగా ఉన్నట్లు సీఐడీ గుర్తించింది. ఈ ముఠా నుంచి పాస్‌పోర్టులు పొందిన వారిలో ఎక్కువ మంది సమాచారం ఇప్పటి వరకు సీఐడీ సేకరించలేకపోయింది. ఈ ముఠా 95 మందికి పాస్‌పోర్టులు ఇప్పించినట్లు పూర్తి ఆధారాలు సేకరించింది. అయితే వారిలో ఎక్కువ మంది ఇప్పుడు ఎక్కడున్నారు? విదేశాల్లో ఎంతమంది ఉన్నారు? ఎవరైనా ఏదైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు కుట్ర చేస్తున్నారా? అనే విషయాలను గుర్తించే పనిలో సీఐడీ ప్రత్యేక బృందం నిమగ్నమైంది.

పోలీసులతో ఎమ్మెల్యే వివేకానంద్ దురుసు ప్రవర్తన

» యూజ్‌లెస్‌ఫెలో అంటూ అసెంబ్లీ వద్ద ఏసీపీపై పరుష పదజాలం

» ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకునే యోచనలో పోలీసులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలోకి వెళ్తున్న క్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. రెండోరోజు అసెంబ్లీ సమావేశాలకు కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆటోల్లో వచ్చారు. అదే సమయంలో అక్కడకు కారులో వచ్చిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తన కారును ఎమ్మెల్యేలు అసెంబ్లీ లోపలికి వెళ్లే గేట్ నెంబర్ 3 రహదారిలో పెట్టి కిందకు దిగి, ఆటోల్లో వచ్చిన ఎమ్మెల్యేలకు మద్దతు తెలిపేందుకు వెళ్లారు. దీంతో అక్కడ ట్రాఫిక్ జామ్ అయ్యింది. అదేమార్గంలో మరికొందరు ఎమ్మెల్యేలు వస్తుండడంతో కారును అక్కడి నుంచి తరలించాలని పోలీసులు కోరినా డ్రైవర్ తీయలేదు. దీంతో సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్ జోక్యం చేసుకొని, కారును ముందుకు లేదా వెనక్కి తీయాలని వివేకానంద్‌ను కోరడంతో ఆయన వినకపోగా ఏసీపీపై విరుచుకుపడ్డారు. యూజ్‌లెస్‌ఫెలో అంటూ పరుష పదజాలంతో మాట్లాడడంతో పోలీసులు కంగుతిన్నారు. ఈ విషయంపై మొదట కేసు నమోదు చేయాలని భావించినా, రాత్రి వరకు కేసు మాత్రం నమోదు చేయలేదు. ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఇటీవలే ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వివేకానంద్ సహనం కోల్పోయి ఎన్నికల బరిలో ఉన్న ప్రత్యర్థిపై దాడి చేయడం వివాదాస్పదం కాగా.. ప్రస్తుతం పోలీసులపై పరుష పదజాలంతో విరుచుకుపడడం చర్చనీయాంశంగా మారింది.

ఈసారీ ట్రస్ట్ బోర్డు లేనట్టేనా..?

» మరో 14 రోజుల్లోనే మేడారం మహా జాతర

» నేటికీ బోర్డుపై నోటిఫికేషన్ ఇవ్వని సర్కారు

» రూ.105 కోట్ల పనులపై పర్యవేక్షణ ఎలా..?

» గత జాతరల నాటి పరిస్థితులే పునరావృతం



వరంగల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం మహా జాతర పనులను పర్యవేక్షించే ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై దేవాదాయ శాఖ దృష్టి సారించటం లేదు. జాతరలో భక్తులు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రెండు విడతల్లో రూ.105కోట్లు కేటాయించింది. ఈ నిధులతో చేపట్టే పనులను, జాతర ఏర్పాట్లను పర్యవేక్షించే ట్రస్టు బోర్డు ఏర్పాటు నియామకంలో సర్కారు తాత్సారం చేస్తోంది. మేడారం మహా జాతరకు ఆరు నెలల ముందే ట్రస్ట్ బోర్డుకు నోటిఫికేషన్ ఇవ్వడం ఆనవాయితీ. జాతరకు మరో 14 రోజుల సమయమే ఉన్న నేపథ్యంలో.. అసలు కమిటీ నియామకం ఎప్పుడు జరుగుతుందనే చర్చ సాగుతోంది. దీంతో గత నాటి జాతరల నాటి పరిస్థితులే పునరావృతం అవుతాయా..? అనే అనుమానం వ్యక్తమవుతోంది.

మహా జాతరకు ట్రస్ట్ బోర్డు..

మహా జాతర అభివృద్ధి, ప్రభుత్వం మంజూరు చేసే నిధుల వినియోగం, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, జాతర నిర్వహణ వాటిని ట్రస్ట్ బోర్డు సభ్యులు పరిశీలిస్తారు. గత పదేళ్లలో ఐదు జాతరలు రాగా, వీటిలో నాలుగు జాతరలకు ట్రస్ట్ బోర్డు కమిటీ లేకుండానే నిర్వహించారు. 2018 మహా జాతరలో ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడితోపాటు 14 మంది సభ్యులు, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావును ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నియమించారు. తర్వాత జాతరలకు ట్రస్ట్ బోర్డుకు బదులుగా పునరుద్ధరణ కమిటీని నియమించారు. గతంలో అధికార పార్టీ నేతలు కమిటీపై ఆధిపత్యం కోసం కొట్లాడి.. కమిటీ లేకుండానే జాతర నిర్వహించి విమర్శలు ఎదుర్కొన్నారు. 2014లో మహా జాతరకు ట్రస్ట్ బోర్డు కమిటీ ఎంపికలో అప్పటి అధికార కాంగ్రెస్‌లో విభేదాల ఏర్పడ్డాయి. దీంతో కమిటీ నియామకం జరగలేదు. ఈ క్రమంలో గద్దెల వద్ద సమ్మక్క-సారలమ్మల ప్రసాదం(బెల్లం) పంపిణీలో, తలనీలాల సేకరణ, క్యూలైన్ల ఏర్పాటు, కొబ్బరి కాయల అమ్మకం, గద్దెల వద్ద బెల్లం తొలగింపు తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. 2016లో బీఆర్ఎస్‌లో నెలకొన్న విభేదాల వల్ల ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయలేదు. మూడు నెలల ముందు జాతర పునరుద్ధరణ పేరుతో కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో జాతర పనులపై పర్యవేక్షణ, భక్తుల సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు తలెత్తాయి. 2020, 2022 జాతరలకు రాజకీయాలు అడ్డురావడంతో పునరుద్ధరణ కమిటీలతో మమ అనిపించారు. ప్రస్తుత జాతరకు కూడా పునరుద్ధరణ కమిటీతో మమ అనిపించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

బోర్డు ఉంటేనే మేలు..

మేడారం మహా జాతర ట్రస్ట్ బోర్డుకు ఉన్న అధికారాలు పునరుద్ధరణ కమిటీకి ఉండవు. జాతరకు వచ్చే అభివృద్ధి నిధులపై సమీక్షించే అధికారం బోర్డుకు ఉంటుంది. పనుల నాణ్యతను పరిశీలించటమే కాకుండా.. కొత్త పనులు చేపట్టేలా బోర్డు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తుంది. అధికారులు నిర్వహించే ప్రతీ సమీక్షలోనూ పాల్గొని.. అభివృద్ధి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రశ్నించటం.. సలహాలు, సూచనలు ఇవ్వడం వంటివి చేస్తుంది. కానీ, పునరుద్ధరణ కమిటీకి ఇలాంటి అధికారాలు లేవు. జాతరను ఎలా విజయవంతం చేయాలో మాత్రమే కమిటీ చూస్తుంది. అభివృద్ధి పనులకు ఈ పునరుద్ధరణ కమిటీకి సంబంధం ఉండదని సమాచారం. అధికారులపై ఒత్తిడి తెచ్చి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరే పరిస్థితి కూడా లేదని తెలుస్తోంది. ఓ రకంగా ఈ పునరుద్ధరణ కమిటీని ఉత్సవ కమిటీగా భావిస్తారని సమాచారం. దీంతో మహాజాతరలో పాలకమండలి పర్యవేక్షణ లేకపోతే అభివృద్ధిలో నాణ్యతకు తూట్లు పడే అవకాశం ఉంది. ప్రస్తుతం మేడారం మహా జాతరలో రూ.105కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటి పర్యవేక్షణపై పునరుద్ధరణ కమిటీకి ఎలాంటి అధికారం లేకపోవటంతో నాణ్యత లోపంతో పాటు ఇతర సమస్యలపై ప్రశ్నించేది ఎవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

నాగోబా మహాజాతర ప్రారంభం

ఆదివాసీ సంస్కృతికి అద్దం పట్టేలా సంప్రదాయ పూజలు


తయారు చేసిన పుట్టకు ప్రత్యేక పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 9 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నాగోబా జాతర శుక్రవారం అర్ధరాత్రి వైభవంగా ప్రారంభమైంది. ఉదయం నుంచే మెస్రం వంశీయులు తాము బస చేసిన మర్రి చెట్టు (వడమర) నుంచి పవిత్ర గంగాజలంతో నాగోబా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. మెస్రం వంశ పెద్దలు 22 కితల వారీగా కొత్త కుండలను ఇవ్వగా.. మహిళలు పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ వంశ అల్లుళ్లు, ఆడపడుచులు వరుసగా వెళ్లి వడమర సమీపంలోని కోనేరులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తకుండల్లో పవిత్ర జలం సేకరించి ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయం పక్కనే గల పాత మట్టి పుట్టలను అల్లుళ్ల తవ్వగా... ఆ మట్టితో మహిళలు తిరిగి కొత్తపుట్టను తయారుచేశారు. తయారు చేసిన పుట్టల నుంచి మట్టిని ఉండల రూపంలో తీసుకుని ఏడు వరుసలతో బౌల దేవతను తయారు చేసి మొక్కుకున్నారు. అనంతరం ఏడు వరుసలతో తయారు చేసిన మట్టి ఉండలతో నాగోబా ఆలయం పక్కనే ఉన్న ఆలయంలో సతిదేవతల బౌలను తయారుచేసి సంప్రదాయ పూజలు చేశారు. పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని రాత్రి 9 నుంచి 12గంటల వరకు గంగాజలంతో ఆలయాన్ని శుద్ధి చేసి నాగోబాకు జలాభిషేకం చేసి మహాపూజ నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు మెస్రం వంశీయులతో కలిసి నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి 1 నుంచి తెల్లవారు జామున 3 గంటల వరకు బేటింగ్ (పరిచయం) పూజలకు ఏర్పాటు చేశారు. బేటింగ్‌తో వారు పూర్తిగా మెస్రం వంశంలో చేరినట్లుగా భావిస్తారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావ్‌తో పాటు మెస్రం పెద్దలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ లక్ష్మణ్, పక్కన వేణుగోపాల్, నార్ల రవి. ఎస్.నారాయణరావు తదితరులు

ఎన్ఐఏ దాడులపై సీఎం స్పందించాలి

» పౌర హక్కులు, ప్రజాసంఘాల నేతలు

నల్లకుంట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దాడులు పుంజుకుంటున్నాయని, ప్రశ్నించే గొంతుకలైన కళాకారులు, రచయితలపై విచారణ పేరుతో ఇళ్లలో సోదాలు నిర్వహించడం దారుణమని, ఇటీవలి ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఇటీవల వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, నార్ల రవిల ఇళ్లపై ఎన్ఐఏ దాడులు చేయడం, కార్యాలయానికి రావాలని హుకుం జారీ చేయడం అన్యాయమన్నారు. ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తానని రేవంత్ అన్నారని కానీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. వెంటనే అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని, తెలంగాణ పబ్లిక్ సెక్యూరిటీ చట్టాన్ని తొలగించాలని, ఎన్ఐఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ప్రధాన కార్యదర్శి ఎస్.నారాయణరావు, నగర అధ్యక్షుడు పి.ఎం.రాజు, నార్ల రవి, నాయకుడు విష్ణు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాదవ, కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయండి

» మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నేతల వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు యాదవ, కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. శుక్రవారం మంత్రిని శాసనసభలోని ఆయన చాంబర్‌లో కలిసిన వారు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ అంశంపైన సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని ఈ సందర్భంగా పొన్నం వారికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో టీపీసీసీ అధికార ప్రతినిధులు సతీష్, లోకేష్ యాదవ్ ఉన్నారు.

ప్రసాదంలో ఎముకలు

» శ్రీశైలం క్షేత్ర పవిత్రతకు భంగం.. విచారణకు ఆదేశం

శ్రీశైలం, ఫిబ్రవరి 9: శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ప్రసాదంలో ఎముక ముక్కలు ప్రత్యక్షమవడం కలకలం రేపింది. ఈ ఘటనతో భక్తులు తీవ్రంగా కలత చెందారు. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు భక్తులు శుక్రవారం ఉదయం మల్లన్న, భ్రమరాంబికా అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం వెలుపలికి వచ్చే సమయంలో దేవస్థానంవారు భక్తులందరికీ ఉచిత తీర్థప్రసాదాలు అందిస్తుండగా.. వేణుగోపాల్ అనే వ్యక్తి ప్రసాదం పులిహోరను స్వీకరించాడు. ఆ ప్రసాదం నోట్లో వేసుకుంటుండగా.. రెండు ఎముక ముక్కలు రావడంతో కంగుతిన్నాడు. వెంటనే తమ ఫోన్లలో చిత్రీకరించి ఆలయ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రసాదంలో ఎముక ముక్కలు రావడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు కూడా చేశారు. ఈ ఘటనపై భక్తులు తీవ్రంగా మండిపడుతున్నారు. క్షేత్ర పవిత్రతకు భంగం కలిగే విధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసును వివరణ కోరగా విచారణకు ఆదేశించామని తెలిపారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్ 9
శనివారం • 10 ఫిబ్రవరి 2024

మొబైల్‌ని అతిగా ఉపయోగిస్తే
కీళ్ళు, మోకాలు నొప్పులు!



మొబైల్‌ని అతిగా వీక్షిస్తే మెడ నొప్పి ఖాయమని అందరికీ తెలిసిందే. తాజాగా జరిపిన సర్వేలో మోకాళ్ళ నొప్పికి తోడు జాయింట్స్ పెయిన్ కూడా వస్తోందని తేలింది. మొబైల్‌ని అతిగా వాడకం వల్ల కండరాలకు సంబంధించిన ఇబ్బందులు తప్పవని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై ఎన్‌ఐహెచ్ నిర్వహించిన సర్వే వివరాలను 'ఫోన్ ఎరీనా' బైటపెట్టింది. అతిగా ఫోన్ వినియోగానికి మోకాళ్ళు, జాయింట్స్ నొప్పులకు సంబంధం ఉందని ఆ పరిశోధనలో ఆశ్చర్యకరంగా బైటపడింది. స్మార్ట్ ఫోన్‌ను ఎక్కువ సేపు వినియోగిస్తే బాడీ వెయిట్ షిఫ్ట్ అవుతుంది. అది మోకాళ్ళపై ఒత్తిడిని కలుగజేస్తుందని పరిశోధనలో పాల్గొన్న టెక్నాలజీ నిపుణుడు ఒకరు తెలిపారు. ఒక దగ్గర కూర్చుని ఫోన్ చూస్తూ ఉంటారు. అంటే శరీరానికి తోడు కండరాల కదలిక నియంత్రణలోకి వెళతాయి. అంతిమంగా అది మోకాళ్ళ నొప్పులకు దారితీస్తుందని ఆయన వివరించారు. జాయింట్స్ కండరాలను కదుపుతూ ఉండాలి. అదే ఫ్లెక్సిబిలిటీ మెరుగుదలకు దోహదపడుతుంది. స్మార్ట్‌ఫోన్ వీక్షణ అందుకు వ్యతిరేకంగా ఉంటుంది. అలాగే ఈ సందర్భాల్లో మనిషి పొజిషన్ సక్రమంగా ఉండదు. అంటే పడుకొని, ఒకపక్కకు వేలాడి ఒదిగి ఉండటంతో శారీరక ఇబ్బందులు తలెత్తుతాయి. కదలిక లేనందున బరువు పెరిగే అవకాశం ఎక్కువ. అది మరిన్ని సమస్యలకు కారణమవుతుంది. మొత్తమ్మీద రోజుకు నాలుగు గంటలకు మించి డివైజ్ వీక్షణలో గడిపితే ఆరోగ్యపరంగా ఇబ్బందులు తప్పవని పరిశోధనలో తేలింది.



గూగుల్ మ్యాప్స్‌లో వెదర్ రిపోర్ట్

గూగుల్ మ్యాప్స్‌ను ఉపయోగించే ఆండ్రాయిడ్ డివైజ్‌ల్లో మరో వెసులుబాటు రానుంది. మ్యాప్ బ్రౌజర్లోనే వాతావరణ పరిస్థితులను యూజర్లు తెలుసుకోవచ్చు. ఈ అప్డేట్ విడుదల ఆరంభమైందని '9టు5గూగుల్' తెలిపింది. ఇదో సర్వర్ సైడ్ అప్డేట్. లేటెస్ట్ వెర్షన్‌కు వెళితేనే సదరు సౌలభ్యం సమకూరుతుంది. ఐఓఎస్ యూజర్లకు చాలాకాలంగా ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. మ్యాప్ బ్రౌజర్‌లోని ఎడమవైపు కార్నర్‌లో ఒక చిన్న బాక్స్ ఉంటుంది. అందులో వాతావరణానికి సంబంధించిన తాజా వివరాలు కనిపిస్తాయి. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ సైతం అప్పుడప్పుడు ప్రత్యక్షమవుతుంది. బాక్స్‌పై టాప్ చేస్తే వివరాలు పెద్ద స్థాయిలో చూడవచ్చు. తాజా ఫోర్‌కాస్ట్‌కు తోడు ఉష్ణోగ్రతలు, ఎయిర్ క్వాలిటీ తదితర సమాచారాన్ని దీంతో పొందవచ్చు. రాబోయే రోజుల్లో ఇండియా కేంద్రంగా పలు ఫీచర్లను ప్రవేశపెట్టనున్నట్టు గూగుల్ ఇటీవల ప్రకటించింది.

రెడ్‌మి 5 బడ్స్ విడుదల ఎల్లుండే

షావోమీ సబ్ బ్రాండ్ రెడ్‌మి సరికొత్త ఇయర్‌బడ్స్‌ని ఈ నెల 12న ఇండియాలో విడుదల చేస్తోంది. 'రెడ్‌మి బడ్స్ 5' పేరిట ఇవి మార్కెట్లోకి వస్తున్నాయి. చైనాలో గత ఏడాదే వీటిని రిలీజ్ చేశారు. తాజాగా తీసుకువస్తున్న ఆడియో వేరబుల్స్‌ని 'సూపర్‌బడ్స్' పేరిట కంపెనీ ప్రమోట్ చేస్తోంది. రెడ్‌మి బడ్స్ 5ని అమెజాన్.ఇన్‌లో లిస్ట్ చేశారు. 'నోటిఫై మి' అంటూ వచ్చింది. దీని ధర చైనాలో సుమారుగా రూ.2300



కాగా ఇండియాలో దీని ధర ఇంకా వెల్లడి కాలేదు. గ్లోబల్ మార్కెట్లలో దాదాపుగా రూ.4,000కి లిస్ట్ చేశారు. ఈ ఇయర్ బడ్స్‌కి 12.4ఎంఎం టిటానియం డ్రైవర్స్ ఉన్నాయి. హైబ్రిడ్ ఏఎన్‌సీ 46 డెసిబిల్స్ వరకు ఉంది. అది బ్యాక్‌గ్రౌండ్‌లో వచ్చే శబ్దాలను తగ్గిస్తుంది. ఆడియో అనుభవం బాగుంటుంది. వేర్వేరు మూడ్స్, కంటెంట్‌కు అనుగుణంగా మల్టిపుల్ సౌండ్ మోడ్స్ ఇందులో ఉన్నాయి. డ్యూయల్ డివైజ్ పెయిరింగ్ వంటి ఫీచర్లు సరేసరి. కాలింగ్ ఎక్స్‌పీరియెన్స్ బాగుంటుంది. పూర్తి బ్యాటరీ లైఫ్ 38 గంటలు.

SAMSUNG

ఈ గెలాక్సీ ఫోన్లకు అప్డేట్స్ కట్



గెలాక్సీ ఎస్24 సిరీస్‌ను తాజాగా తీసుకువచ్చిన శాంసంగ్, కొన్ని పాత ఆండ్రాయిడ్ ఉత్పత్తులకు అప్డేట్స్‌ను ఆపేసింది. గెలాక్సీ 51 సహా మరికొన్ని ఈ అప్డేట్ కట్ అయిన వాటిలో ఉన్నాయి. శాంసంగ్ సాఫ్ట్‌వేర్ అప్డేట్ పాలసీ ప్రకారం రిలీజ్ చేసిన వాటికి నాలుగేళ్ళు ఆండ్రాయిడ్ అప్డేట్స్ ఉంటాయి. అదేవిధంగా అయిదేళ్ళ పాటు సెక్యూరిటీ ప్యాచెస్ కూడా విడుదల అవుతాయి. 2021కి ముందు ఇది మూడు, నాలుగు సంవత్సరాలుగా ఉండేది. ఆ క్రమంలో తాజాగా అప్డేట్స్ నుంచి తొలగించిన వాటిలో గెలాక్సీ ఎ01, గెలాక్సీ ఎ51, గెలాక్సీ ట్యాబ్ ఎస్6 5జి, గెలాక్సీ డబ్ల్యు20 5జి ఉన్నాయి. గెలాక్సీ ఎ51 ఆదరణ పొందిన బంచ్. 2020లో రిలీజ్ అయింది. గెలాక్సీ ట్యాబ్ ఎస్6 5జి కొద్దిగా పాత టాబ్లెట్. గెలాక్సీ ఎ03, గెలాక్సీ ట్యాబ్ ఎ8ని క్వార్టర్లీ నుంచి ఏడాదికి రెండు మార్లు అప్డేట్‌కి మార్చారు. గెలాక్సీ ఎస్24 సిరీస్, ఎక్స్‌కవర్ 7, గెలాక్సీ ట్యాబ్ యాక్టివ్ 5 కి మాత్రం నెలవారీ ప్రాతిపదికను సపోర్టు అందుతూ ఉంటుంది.

టెలిగ్రామ్‌లో కొత్త ఫీచర్లు

అప్డేట్



టెలిగ్రామ్ తాజా అప్డేట్‌తో కొత్త ఫీచర్లను జతచేసింది. అందులో గుర్తించదగ్గది సేవ్డ్ మెసేజెస్ 2.0 దీనితో సేవ్ చేసిన టెక్స్ట్, మీడియా, లింకులను యూజర్లు ఫిల్టర్ లేదా కస్టమైజ్ చేయవచ్చు. అదేవిధంగా టైమ్ వాయిస్, వీడియో మెసేజ్‌లు, రికార్డింగ్ అయిన వాటిని ఆపుకోవడం, ముందుకు పంపేయడం. ప్రైవేటు చాట్స్‌లో రీడ్ టైమ్, షేర్డ్ కాంటాక్టులకు కొత్త డిజైన్ తదితరాలు ఉన్నాయి. టెలిగ్రామ్ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ వెర్షన్లు రెంటికీ ఈ అప్డేట్‌ని రోలింగ్ చేస్తున్నారు.

సేవ్డ్ మెసేజెస్ 2.0తో టెక్స్ట్, మీడియా, లింకులను చాలా సులువుగా ఫార్వార్డ్ చేయవచ్చు. కొత్త అప్డేట్ ప్రకారం సేవ్డ్ మెసేజెస్‌ను చాట్స్‌గా యూజర్లు చూడవచ్చు. విడిగా చాట్ విండోతో వాటిని ఫార్వర్డ్ చేయవచ్చు. ప్రతీది ప్రత్యేకించి కాంటాక్ట్, గ్రూప్ లేదా చానల్ నుంచి సేవ్ అవుతుంది. అలాగే యూజర్లు ఏ చాట్‌నైనా పిన్ చేసి టాప్‌లో ఉంచొచ్చు. ఇందుకోసం సేవ్డ్ మెసేజెస్‌ని క్లిక్ చేయాలి. అక్కడ ఉండే టైటిల్ స్పేస్‌ను టాప్ చేయాలి. అంతే, ఆటోమేటిక్‌గా చాట్స్‌లోకి తీసుకెళుతుంది. వెర్టికల్ త్రీ డాట్స్‌పై టాప్ చేసి 'వ్యూ యాజ్ మెసేజెస్' లేదా 'వ్యూ యాజ్ చాట్స్'ను సెలెక్ట్ చేసుకోవడం మరో పద్ధతి. సేవ్డ్ మెసేజెస్‌కు ట్యాగ్స్ జతచేయవచ్చు. అందుకు ఎమోజీలను ఉపయోగించవచ్చు. ఎమోజీని ఒకసారి కలిపితే చాలు, అదే ట్యాగ్ కోసం సేవ్డ్ మెసేజ్‌ని ఫిల్టర్ చేస్తుంది. చేయాల్సిందల్లా ఎమోజీతో స్పందించడమే. షేర్డ్ మీడియా రియాక్షన్ మరొకటి. టెలిగ్రామ్ చాట్, గ్రూప్, చానల్ దీంతోనే ఉంటాయి. ఇమేజెస్, డాక్యుమెంట్స్, లింక్స్‌ను చాలా వేగంగా చూసుకుంటూ వెళ్ళవచ్చు. ఈ సెక్షన్ తాజా అప్డేట్‌తో సేవ్డ్ మెసేజెస్‌ను చూపుతుంది. వన్ టైమ్ వాయిస్, వీడియో మెసేజెస్ మరొకటి. ఒకసారి వినగానే లేదా ప్లే చేయగానే ఇవి ఆటోమేటిక్‌గా అదృశ్యమవుతాయి. ఎవరికైనా పంపేందుకు రికార్డ్ బటన్‌ని యూజర్లు లాగ్ ప్రెస్ చేయాలి. వాటిని లాక్ చేసేందుకు స్వైప్ చేయాలి. ఆపై 'వన్ టైమ్ ఐకాన్'ని ప్రెస్ చేస్తే ఆ ఫీచర్ అందుబాటులోకి వస్తుంది. వీడియోస్ విషయంలోనూ ఇదే పద్ధతిని పాటించాలి. రికార్డింగ్స్ పాజ్, రెజ్యూమ్ కోసం లాంగ్ ప్రెస్ చేయాలి. ఆపై రికార్డ్ బటన్, తదుపరి పాజ్ బటన్‌ను ప్రెస్ చేయాలి. రియల్ టైమ్ ఇన్ ప్రైవేట్ చాట్స్ విషయానికి వస్తే పంపిన మెసేజ్‌లపై ఒక చెక్ మార్క్ కనిపిస్తుంది. అంటే డెలివరీ అయినప్పటికీ చూడలేదని అర్థం. రెండు అయితే చదివినట్టు లెక్క. రీడ్ టైమ్ అంటే సరిగ్గా అందుకున్న వ్యక్తి ఎప్పుడు చదివారు అన్నది తెలుసుకోవచ్చు. అయితే ప్రైవసీ సెట్టింగ్స్‌తో రిసీవర్ ఆ విషయాన్ని దాచిపెట్టవచ్చు. రీడ్ టైమ్ మెసేజ్‌లు కేవలం ఏడు రోజులు మాత్రమే కనిపిస్తాయి. షేర్డ్ కాంటాక్ట్‌లకు సంబంధించి అక్టోబరులోనే టెలిగ్రామ్ - న్యూడిజైన్‌ను ప్రీమియం యూజర్లకు పరిచయం చేసింది. దాంతో కాంటాక్ట్ కార్డును ప్రీమియర్ యూజర్లు రూపొందించుకోవచ్చు. అదే కస్టమైజేషన్‌ను చూపుతుంది.

ఐఫోన్ 16లో 'కాప్చర్ బటన్'!



యాపిల్ ఐఫోన్ 16లో సరికొత్తగా 'కాప్చర్ బటన్' వస్తోంది. అసలు విషయానికి వస్తే యాపిల్ ప్రస్తుతం ఐఫోన్ 16పై పనిచేస్తోంది. ఈ ఏడాది రెండో సగంలో ఐఫోన్ 16 విడుదల అవుతుందని కూడా భావిస్తున్నారు. ఆ క్రమంలోనే విశ్లేషకులు, టిప్‌స్టర్స్ పలు సంగతులను లీక్ చేస్తున్నారు. అలా బైటకు వచ్చిన విశేషాల్లో కాప్చర్ బటన్ ఒకటి. ఫోన్‌లోని కెమెరా ఫంక్షనాలిటీలోనే పలు మార్పులకు ఇది దారితీస్తుందని అంటున్నారు. వీడియోలను రికార్డ్ చేసుకునేందుకు ఈ బటన్ ఉపయోగపడుతుందని విశ్లేషకుడు ఒకరు తెలిపారు. లైట్ ప్రెస్‌తో ఇమేజ్‌లు, వీడియోలను బంధించవచ్చు. డీఎస్ఎల్ఆర్ఓ, మిర్రర్‌లెస్ కెమెరాల్లో ఈ ఫీచర్లు ఉంటాయని చెబుతున్నారు. మొత్తానికి ఈ చర్యలన్నీ ఐఫోన్‌లో ఫొటోగ్రఫీ అనుభవాన్ని మెరుగుపర్చేందుకేనని అంటున్నారు. ఇంతకుమునుపే ఐఫోన్ 16 ప్రొటోటైప్ లీకైంది. ఆ క్రమంలో ఈ బటన్ కుడివైపు దిగువన ఉండొచ్చని భావిస్తున్నారు.

'మొజిల్లా' నుంచి సబ్‌స్క్రిప్షన్ సర్వీస్

మొజిల్లా తాజాగా సబ్‌స్క్రిప్షన్ మోడల్ 'మొజిల్లా మానిటర్ ప్లస్'ని పరిచయం చేసింది. డేటా బ్రోకర్ సైట్స్ నుంచి రక్షణకు దీనిని ఉద్దేశించారు. అందులో భాగంగా డేటా రిమూవల్ అభ్యర్థనలను, నెలవారీ స్కాన్స్‌ని అనుమతిస్తుంది. తద్వారా యూజర్ల పర్సనల్ సమాచారం తస్కరణకు గురికాకుండా చూస్తుంది. 2002లో ఆరంభమైన మొజిల్లా ఫైర్‌ఫాక్స్‌కు యూజర్ల ఆదరణ బాగుంది. ప్రైవసీ విషయంలోనూ కట్టుదిట్టంగా వ్యవహరిస్తుంది. ఈ నేపథ్యంలో ఇంతవరకు ఫ్రీ సర్వీస్‌గా ఉన్న మొజిల్లా మానిటర్‌ను పెయిడ్ పద్ధతికి మార్చింది. దీంట్లో చేరిన యూజర్ల వ్యక్తిగత సమాచారం బ్రోకర్ వెబ్‌సైట్స్‌లో కనిపిస్తే ఆటోమేటిక్‌గా తొలగిస్తుంది. ఒకసారి ఫ్రీ స్కాన్‌కు అనుమతిస్తోంది. సంబంధిత వివరాలను అందిస్తే అందుకు సరిపోతుంది. అదే నిరంతరంగా చెక్ కావాలని అనుకుంటే మాత్రం మొజిల్లా మానిటర్ ప్లస్ కింద నెలకు 8.99 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ సబ్‌స్క్రిప్షన్ సర్వీస్ ప్రస్తుతానికి అమెరికాకు మాత్రమే పరిమితం.

ప్రొడక్ట్

ప్రతీవారు ఇప్పుడు స్మార్ట్ వాచీ కావాలనే ఆలోచనల్లో ఉన్నారు. మొబైల్‌తో సమకూరే సదుపాయాలు ఇప్పుడు స్మార్ట్ వాచీల్లోనూ ఉండడంతో ఈ ఆలోచన మరింత పెరుగుతోంది. బ్యాటరీ చార్జింగ్, జీవితకాలం నుంచి ఆరోగ్యం సహా వేర్వేరు ఫీచర్లతో నేడు స్మార్ట్ వాచీలు లభ్యమవుతున్నాయి. సొంతంగా ఉపయోగించుకునేందుకే కాకుండా, వివిధ సందర్భాల్లో బహుమతులుగా ఇచ్చేందుకు ఉపయోగపడే స్మార్ట్ వాచీలు ఇవి. స్టయిల్‌గా ఉండటమే కాదు, మంచి ఫీచర్లు ఉన్న వాచీలు.

యాపిల్ వాచీ అల్ట్రా 2: గత ఏడాది చివర్లో కన్నులపండువగా జరిగిన ఈవెంట్‌లో విడుదలైంది. ఎస్9 చిప్ పవర్, వాచ్‌ఓఎస్ 10కి తోడు సరికొత్త 4-కోర్ న్యూట్రల్ ఇంజిన్‌తో ఇది వచ్చింది. సదరు ఇంజిన్ - మెషీన్ లెర్నింగ్ టాస్క్‌లను ఒరిజినల్ యాపిల్ వాచ్ అల్ట్రాతో పోల్చుకుంటే రెండింతలు ఎక్కువగా చేపట్టగలదు. 1.92 ఇంచీల రెటీనా ఎల్‌టీపీఓ ఓలెడ్ డిస్‌ప్లే ఉంది. 3000 నిట్స్ మేరకు పీక్ బ్రైట్‌నెస్ ఉంది. మొదటితరం అల్ట్రా వాచీలతో పోల్చుకుంటే 50 శాతం ఎక్కువ. డిజిటల్ క్రౌన్‌తో ఇన్-డిస్‌ప్లే ఫ్లాష్‌లైట్‌ను మెరుగుపర్చారు. దాంతో బ్రైట్‌నెస్ రెండింతలైంది. ఇందులో ఉన్న ఆన్-డివైజ్ 'సిరి'తో హెల్త్ డేటాను పొందవచ్చు. వర్కౌట్ లేదంటే టైమ్ సెట్టింగ్ కోసం ఇంటర్నెట్ అవసరం ఉండదు. బ్లూటూత్ కాలింగ్ సదుపాయం ఉంది. వాటర్ రెసిస్టెన్స్ 5 ఏటీఎం. బ్యాటరీ లైఫ్ 36 గంటల మేర ఉంటుంది.

స్మార్ట్ వాచీలు ఓ లుక్ వేయండి



శాంసంగ్ గెలాక్సీ వాచీ 6: రెండు వేర్వేరు సైజులు 40ఎంఎం, 44ఎంఎంలలో లభ్యమవుతోంది. ఆండ్రాయిడ్ 10 వెర్షన్‌పై రన్ అవుతోంది. 1.5 జీబీ మెమరీ ఉంది. హార్ట్ రిథమ్ నోటిఫికేషన్ సదుపాయం సహా పలు హెల్త్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి. డిజిటల్ పేమెంట్స్ కోసం శాంసంగ్ వ్యాలెట్ ఉంది. స్కిన్ టెంపరేచర్ ట్రాకింగ్, మెనుస్ట్రల్ సైకిల్ ట్రాకింగ్, ఫాల్ డిటెక్షన్ తదితరాలు కూడా ఉన్నాయి. 1.3 ఇంచీలు/1.5 ఇంచీల సూపర్ అమోల్డ్ డిస్‌ప్లే, వాటర్ రెసిస్టెన్స్ 5 ఏటీఎం, 40 గంటల మేర బ్యాటరీ లైఫ్ దీనికి ఉన్న ఫీచర్లలో మరికొన్ని.

జెమిని ఫోర్‌రన్నర్ 255: 1.3 ఇంచీల ట్రాన్స్‌ఫ్లెక్టివ్ మెమరీ-ఇన్-పిక్సెల్‌కు తోడు 260 x 260 పిక్సెల్స్ డెన్సిటీ ఉంది. వాచీ టాప్‌లో కార్నింగ్ గొరెల్లా గ్లాస్ ఉంది. 6 ఏటీఎం రేటింగ్‌తో వాటర్ రెసిస్టెన్స్ ఉంది. ఇంటెన్స్‌గా వ్యాయామం చేస్తున్న సమయంలో డ్యామేజ్‌కు ఆస్కారం లేదు. మూడు ఎడమ, రెండు కుడివైపు మొత్తమ్మీద ఫైవ్ బటన్ కాన్ఫిగరేషన్ ఉంది. ఫిట్‌నెస్, హెల్త్ ఫీచర్లు సరేసరి. బ్యాటరీ లైఫ్ 14 రోజులు.

ఫాజిల్ జనరేషన్ 6: లేటెస్ట్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ వెర్షన్లతో సానుకూలత ఈ వాచీ సొంతం. గో ఎడిషన్, గూగుల్ ప్లే స్టోర్ సదుపాయం మాత్రం లేవు. అరగంట చార్జింగ్‌లో 80 శాతం మేర ఫుల్ అవుతుంది. యూఎస్‌బీ డేటా కేబుల్ ఉంది. దానికి ఉన్న మేగ్నెటిక్ డాక్ సాయంతో వాచీ వెనక స్నేట్ రింగులు సులువుగా అటాచ్ అవుతాయి. 1.28 ఇంచీల, అమోల్డ్ డిస్‌ప్లే ఉంది. వాటర్ రెసిస్టెన్స్ 3 ఏటీఎం కాగా, బ్లూటూత్ కాలింగ్ సదుపాయం ఉంది. బ్యాటరీ లైఫ్ 24 గంటలు.

యాపిల్ వాచ్ సిరీస్ 9: ఎస్9 చిప్‌సెట్ పవర్‌కు తోడు 41ఎంఎం, 45ఎంఎం సైజుల్లో వచ్చింది. పెద్ద ఎత్తున హెల్త్ ఫీచర్లు ఉన్నాయి. 'సిరి'ని అడిగి హార్ట్ రేటు తదితరాలను తెలుసుకోవచ్చు. 1.69 ఇంచీలు/ 1.9 ఇంచీలు, రెటీనా ఎల్‌టీపీఓ ఓలెడ్‌కు తోడు 5 ఏటీఎం రెసిస్టెన్స్ ఉన్నాయి. బ్యాటరీ లైఫ్ 18 గంటలు.



మ్యాప్స్‌తో మ్యాజిక్



పోయిన వస్తువు దొరికింది అంటే అంతకుమించిన సంతోషం ఉండదు. అదే సెల్‌ఫోన్ అయితే మరింత ఆనందం. ఎందుకంటే ఫోన్‌లో వ్యక్తుల సమస్త సమాచారం నిక్షిప్తమై ఉంటోంది. డబ్బు, సమయంతోపాటు ఎన్నో మెమొరీలను పోగొట్టుకోవాల్సి వస్తుంది. ఒక తండ్రి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను, టెక్నాలజీ ఉపయోగించి అతని కుమారుడు ఇలా పట్టేశాడు.

సెల్‌ఫోన్

అలా పోయింది... ఇలా పట్టేశారు!

షేర్ లొకేషన్‌కు ఉపయోగపడే గూగుల్ మ్యాప్ ఇందుకు ఉపయోగపడింది. తమిళనాడులో ఈ సంఘటన చోటుచేసుకుంది. రైలులో ప్రయాణిస్తున్న పెద్దాయన దగ్గర్నుంచి బ్యాగ్ కొట్టేశాడు ఒకడు. పక్కన ఉన్న వాళ్ల ఫోన్‌తో తన కొడుకుకు ఆ విషయాన్ని తెలియజేశాడు ఆ పెద్దాయన. స్నేహితుడితో కలిసి రంగంలోకి దిగిన ఆ కొడుకు గూగుల్ మ్యాప్ సహాయంతో ఫోన్ ఎక్కడ ఉందన్నది కనుగొన్నాడు. ఈ విషయాన్ని కుమారుడు తన 'ఎక్స్'(ట్విట్టర్)లో పంచుకున్నాడు. మొబైల్‌ను తస్కరించిన వ్యక్తి దానిని స్విచ్చాఫ్ చేయకపోవడంతో కొడుకు పని చాలా సులువు అయింది. తమిళనాడులోని నాగర్ కోయిల్ నుంచి ట్రిచ్చి వెళ్లే లోపు దొంగ ఆ ఫోన్‌ను కొట్టేశాడు. ఆ తరవాత మరో ట్రైన్‌లో నాగర్ కోయిల్‌కు తిరుగు ప్రయాణం అయ్యాడు. లొకేషన్ షేరింగ్‌ను ఎనేబుల్ చేసి ట్రాక్ చేయగా ట్రైన్ ట్రాక్ వెంట వెళుతున్నట్లు కనిపించింది. దీంతో అతను తిరుగు ప్రయాణంలో ట్రైన్‌లోనే ఉన్నాడని భావించిన కుమారుడు దానిని ఫాలో అయ్యాడు. దీంతో దొంగకు దగ్గరగా అంటే రెండు మీటర్ల చెంతకు వెళ్ళగలిగాడు. తండ్రి బ్యాగ్‌తో సహా ఫోన్‌ను దొంగ తస్కరించడంతో కుమారుడి పని మరింత సులువు అయింది. తండ్రి సీఐటీయూ యూనియన్ యాక్టివిస్ట్. బ్యాగ్‌పై సీఐటీయూ లోగో ఉంది. దొంగ ఆ బ్యాగ్ అలానే చేతిలో పట్టుకుని ఉండడంతో దాని సహాయంతో అతనిని గుర్తించగలిగాడు. అంతే వెంటనే అతనిని పట్టుకుని పోలీసులకు అప్పగించి, మొబైల్‌ను తిరిగి సంపాదించగలిగాడు.

ఇక్కడ ఇంకో ట్విస్ట్ ఏమంటే పోలీసుల ఇంటరాగేషన్‌లో ఆ దొంగ చేసిన దొంగతనాలు అన్నీ బయటకు వచ్చాయి. సెల్‌ఫోన్ చార్జర్, బ్లూటూత్ ఇయర్ ఫోన్లు, లాక్ కీ, ట్రైన్ చెయిన్ తదితరాలను అతన్నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మ్యాప్స్‌లో లొకేషన్ షేరింగ్

- మ్యాప్స్ యాప్ ఓపెన్ చేసి ప్రొఫైల్ పిక్చర్ దగ్గరకు వెళ్ళాలి. దాన్ని టాప్ చేయాలి. లొకేషన్ షేరింగ్ ఆప్షన్‌ను టాప్ చేయాలి.
- అక్కడ పలువురితో లొకేషన్ షేర్ చేసుకునేందుకు ఆప్షన్ కనిపిస్తుంది. అవసరమైనంత సమయం మేర షేర్ లొకేషన్‌ను చేసుకోవచ్చు.
- షేర్‌ను టాప్ చేస్తే చాలు, షేరింగ్ ప్రక్రియ ఆరంభమవుతుంది.
- లొకేషన్‌కు తోడు పేరు, ఫొటో, డివైజ్ బ్యాటరీ పవర్, అరైవల్ - డిపార్చర్ టైమ్‌ను కూడా షేర్ చేసుకోవచ్చు.



మౌలానా ఆజాద్ వర్సిటీలో పార్ట్ టైమ్ పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ) - పార్ట్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్ 2023-24 వింటర్ సెషన్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్పాన్సర్డ్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీర్‌లు, సైంటిస్ట్‌లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, మేనేజీరియల్ స్టాఫ్, స్టార్టప్ ప్రమోటర్స్, అకడమిక్ అడ్మినిస్ట్రేటర్లు, టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్(ఆర్‌ఏటీ), డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయవచ్చు. స్కాలర్‌షిప్ సౌకర్యం లేదు.

విభాగాలు-సీట్లు: మేనేజ్‌మెంట్ విభాగాల్లో 9, కామర్స్ విభాగాల్లో 6, సైన్సెస్ విభాగాల్లో 21, టెక్నాలజీ విభాగాల్లో 4, ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ విభాగాల్లో 38, దక్కన్ స్టడీస్ విభాగాల్లో 5, సోషల్ సైన్సెస్ విభాగాల్లో 15, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగాల్లో 7 సీట్లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దు ఒక సబ్జెక్ట్‌గాగానీ లేదా ఉర్దూ మీడియంలో గానీ చదివి ఉండాలి. లేదా మదర్సా కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఉర్దూ భాషకు సంబంధించి ఎటువంటి అర్హత లేనివారు థీసిస్ సబ్మిషన్ నాటికి వర్సిటీ అందించే రెండు క్రెడిట్ల ఉర్దూ కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది.

- విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. వర్సిటీ నిర్వహించే రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి. యూజీసీ/సీఎస్ఐఆర్/ ఇన్‌స్పైయిర్/ఐకార్/ఐసీహెచ్‌ఆర్/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్ లేదా రాజీవ్ గాంధీ ఫెలోషిప్ అవార్డ్/టీచర్ ఫెలోషిప్ పొందినవారు; నెట్/సెట్/స్లెట్/జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఎంఫిల్ అభ్యర్థులు ఆర్‌ఏటీ రాయనవసరం లేదు. దరఖాస్తు నాటికి సంబంధిత రంగంలో మూడేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెయిటేజీ: యూజీసీ/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి, స్పాన్సర్డ్ అభ్యర్థులకు, రీసెర్చ్ సంస్థల్లో సైంటిస్ట్‌లకు 70 మార్కులు; నెట్/సెట్/స్లెట్/గేట్/ జీప్యాట్ అర్హత ఉన్నవారికి, ఇన్‌స్పయిర్/రాజీవ్ గాంధీ తదితర ఫెలోషిప్‌లు ఉన్నవారికి 60 మార్కులు; ఎంఫిల్ అభ్యర్థులకు 50 మార్కుల వెయిటేజీ ఇస్తారు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 18
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 28 నుంచి
- **రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** మార్చి 8
- **ఫైనల్ కీ విడుదల:** మార్చి 12
- **ఫలితాలు విడుదల:** మార్చి 15
- **ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్:** మార్చి 18, 19
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మార్చి 22
- **ఇంటర్వ్యూలు:** మార్చి 27, 28
- **అడ్మిషన్స్:** ఏప్రిల్ 3, 4
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఏప్రిల్ 15 నుంచి
- **వెబ్‌సైట్:** manuu.edu.in

ఐఐపీఈలో షార్ట్ కోర్సు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)కి చెందిన హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్(హెచ్&ఎస్) విభాగం- 'అప్లికేషన్స్ ఆఫ్ స్కాలర్ హైపర్‌బోలిక్ కన్జర్వేషన్ లాస్' అంశానికి సంబంధించి షార్ట్ కోర్సును అందిస్తోంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కోర్సు వ్యవధి అయిదు రోజులు. డిగ్రీ/పీజీ చేస్తున్న అభ్యర్థులు, రీసెర్చ్ స్కాలర్స్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోస్, మేథమెటిక్స్/సంబంధిత విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందులో పార్టిసిపేట్ చేసినవారందరికి ఈ-సర్టిఫికెట్లు ఇస్తారు.

కోర్సులోని అంశాలు: ఈ కోర్సులో స్కాలర్ కన్జర్వేషన్ లాస్, ఫైనిట్ వాల్యూమ్ మెథడ్స్, ట్రాఫిక్ ఫ్లోస్ మోడల్స్, ఎల్‌డబ్ల్యూఆర్ మోడల్ ఆన్ నెట్‌వర్క్స్, మోడలింగ్ అండ్ థియరీ ఆఫ్ ట్రాఫిక్ ఫ్లో ఆన్ నెట్‌వర్క్స్, మైక్రో అండ్ మాక్రోస్కోపిక్ పెడిస్ట్రయిన్ మోడల్స్, నాన్ లోకల్ ట్రాఫిక్ ఫ్లో మోడల్స్ తదితర అంశాలు వివరిస్తారు.



ముఖ్య సమాచారం

- **కోర్సు తేదీలు:** మార్చి 1 నుంచి 5 వరకు
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** డిగ్రీ/పీజీ విద్యార్థులకు రూ.354; రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.590; పోస్ట్ డాక్టోరల్ ఫెలో/ఫ్యాకల్టీ మెంబర్లకు రూ.1180
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in

నాగార్జున వర్సిటీలో డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(సీడీఈ)- దూరవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఏ, బీకాం, బీబీఏ, బీ లైబ్రరీ సైన్స్, ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యు, ఎం లైబ్రరీ సైన్స్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు కూడా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిగ్రీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. ఏడాదికి రెండు చొప్పున ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఏని తెలుగు మాధ్యమంలో; బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీబీఏ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; బీకాం(జనరల్) కోర్సుని రెండు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- బీఏ సబ్జెక్టులు ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/ఇంటర్ ఒకేషనల్/ పన్నెండోతరగతి/ పాలిటెక్నిక్/ రెండేళ్ల ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అప్లయ్ చేసుకోవచ్చు. ఏపీఓఎస్ఎస్, టీఓఎస్ఎస్, ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే.

పీజీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: ఇంగ్లీష్, తెలుగు, సంస్కృతం, హిందీ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్

ఎంకాం స్పెషలైజేషన్‌లు: అకౌంటెన్సీ, బ్యాంకింగ్

అర్హత: ఎంఏ ప్రోగ్రామ్‌లో లాంగ్వేజ్‌లు, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లకు సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. మిగిలినవాటికి ఏదేని డిగ్రీ పాసైతే చాలు. ఎంకాం ప్రోగ్రామ్‌నకు బీకాం/ బీబీఎం ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంఏ (ఇంగ్లీష్/జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; ఎంఏ(ఎకనామిక్స్/హిస్టరీ/పొలిటికల్ సైన్స్/సోషియాలజీ) ప్రోగ్రామ్‌లను తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సులు: బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఈ ప్రోగ్రామ్ ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ఉత్తీర్ణులు అర్హులు. దీనిని కూడా ఆంగ్ల మాధ్యమంలోనే చదవాలి.

డిప్లొమా: కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో అందుబాటులో ఉంది. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

- స్పెషలైజేషన్‌లు: ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్

సర్టిఫికెట్ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి ఏడాది. వీటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్‌లో చేరాలంటే పదోతరగతి పాసై ఉండాలి.
- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్‌లో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్‌తోపాటు పారా మెడికల్ అర్హత ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.anucde.info

జాబ్ కార్నర్

ఐసీఎంఆర్‌లో టెక్నికల్ ఆఫీసర్లు

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్.... రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 8

1. **టెక్నికల్ ఆఫీసర్-బి:** 1 పోస్టు
2. **టెక్నికల్ ఆఫీసర్-సి:** 7 పోస్టులు

విభాగాలు: బయోమెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ప్రోగ్రామర్, మెకానికల్/మెకట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్.

అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు టెక్నికల్ ఆఫీసర్-బి పోస్టులకు రూ.56,100 - రూ.1,77,500; టెక్నికల్ ఆఫీసర్-సి పోస్టులకు రూ.67,700 - రూ.2,08,700

వయోపరిమితి: టెక్నికల్ ఆఫీసర్-బి పోస్టులకు 35 ఏళ్లు; టెక్నికల్ ఆఫీసర్-సి పోస్టులకు 45 సంవత్సరాలు మించకూడదు.

ఆన్‌లైన్ అప్లికేషన్‌కు చివరి తేదీ: మార్చి 8

వెబ్‌సైట్: https://main.icmr.nic.in/

బెల్‌లో డిప్యూటీ ఇంజనీర్లు

పుణెలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్... ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 9

పోస్టు: డిప్యూటీ ఇంజనీర్

విద్యార్హతలు: బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్, మెకానికల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.40,000 - రూ.1,40,000

వయోపరిమితి: 27 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.472. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 28

వెబ్‌సైట్: https://bel-india.in/

కేంద్రీయ విద్యాలయ, ఘట్‌కేసర్‌లో టీచింగ్ స్టాఫ్

ఘట్‌కేసర్‌లోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ... కింద పేర్కొన్న టీచింగ్ స్టాఫ్ భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీల వివరాలు

1. **పీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, మేథ్స్, సోషల్ సైన్స్, సైన్స్
2. **టీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, మేథ్స్, సోషల్ సైన్స్, సైన్స్
3. **పీఆర్‌టీ**
4. కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్, అకడమిక్ కౌన్సెలర్, స్పెషల్ ఎడ్యుకేటర్.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, డిప్లొమా/పీజీ డిప్లొమా ఉత్తీర్ణత.

వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 15

వేదిక: పీఎంశ్రీ కేవీ, ఎన్ఎఫ్‌సీ నగర్, ఘట్‌కేసర్

వెబ్‌సైట్: https://ghatkesarnfc.kvs.ac.in/

ఎన్ఎఫ్‌సీ, హైదరాబాద్‌లో నర్స్ పోస్టులు

హైదరాబాద్‌లోని భారత ప్రభుత్వ అణుశక్తి శాఖకు చెందిన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్(ఎన్ఎఫ్‌సీ)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 3

అర్హత: ఇంటర్, డిప్లొమా(నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ) లేదా బీఎస్సీ నర్సింగ్ లేదా నర్సింగ్ 'ఏ' సర్టిఫికేట్‌తో పాటు ఏడాది పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 50 ఏళ్లు మించకూడదు

జీతం: నెలకు రూ.63,660

ఇంటర్వ్యూ తేదీలు: 2024 ఫిబ్రవరి 21, 22

వేదిక: ఎన్ఎఫ్‌సీ గెస్ట్‌హౌస్(గురుకుల్), న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, ఈసీఐఎల్ ఫ్యాక్టరీ దగ్గర, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://www.nfc.gov.in/

ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు

న్యూఢిల్లీలోని బసాయిదరాపూర్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ... తాత్కాలిక ప్రాతిపతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్

విభాగాలు: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీతో పాటు టీచింగ్/రీసెర్చ్ విభాగంలో పని అనుభవం తప్పనిసరి.

వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.2,22,543, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,47,986, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,27,141.

ప్రదేశం: డీన్ ఆఫీస్, 5వ ఫ్లోర్, ఎంఎస్ ఆఫీస్ బిల్డింగ్, ఈఎస్ఐ-పీజీఐఎమ్ఎస్ఆర్, బసాయిదరాపూర్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://esic.gov.in/

శ్రీ సత్యసాయి జిల్లాలో వివిధ ఖాళీలు

పుట్టపర్తిలోని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం...ఒప్పంద ప్రాతిపదికన శ్రీసత్యసాయి జిల్లాలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 13

ఖాళీలు: సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, కేస్ వర్కర్, పారా లీగల్ పర్సనల్ లాయర్, పారా మెడికల్ పర్సనల్, సైకో సోషల్ కౌన్సెలర్, ఆఫీస్ అసిస్టెంట్, మల్టీపర్పస్ స్టాఫ్/కుక్, సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్.


అర్హత: హైస్కూల్, డిగ్రీ, పీజీ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 25 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను పుట్టపర్తిలోని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో అందజేయాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: https://srisathyasai.ap.gov.in/



ఏపీలో మెడికల్ ఆఫీసర్లు

మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్... నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్ ప్రాతిపదికన రాష్ట్రంలోని టెలిమెడిసిన్ హబ్‌లలో పనిచేయడానికి దిగువ పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 12

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 42 సంవత్సరాలు మించకూడదు

వేతనం: నెలకు రూ.61,960

ఎంపిక ప్రక్రియ: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 10


వెబ్‌సైట్: http://apmsrb.ap.gov.in/msrb/



చమత్కార వైద్యం

అనగనగా ఒక రాజ్యం. మల్లుడు అనే రాజు ఉండేవాడు. ఆహారం అతిగా తినేవాడు. మితి మించి తిన్నా ఇబ్బందులే అనే విషయం తెలిసి కూడా విపరీతంగా తినేవాడు. తిండి ప్రియుడు కావటం, అది కూడా రాజు కావటంతో ఎవరూ అడ్డు చెప్పలేకపోయారు. పైగా వ్యాయామాలు చేయని సోమరి. దీంతో ఆ రాజు బరువు పెరిగాడు. వంద కేజీలు దాటి పెరిగాడు. అంతటి భారీ శరీరం తనకు ఇబ్బందయింది. అయినా తినటం ఆపలేదు. ఇలాగయితే కష్టం.. రాజంటే సన్నగా ఉండాలి. అప్పుడే చురుగ్గా ఉండగలవు.. అని తన గురువు సెలవిచ్చాడు. రాజు ఏమాత్రం ఆలోచించకుండా తాను బరువు తగ్గాలని నిర్ణయించుకున్నాడు.


ఒక రోజు వైద్యులంతా రాజుగారి దగ్గరకు రావాలని చాటింపు ఇప్పించాడు. వైద్యులంతా సభకు వచ్చారు. వెంటనే రాజుగారు ఇలా అన్నారు. 'నేను సన్నబడటానికి మందులు ఏమైనా ఇప్పించండి. నేను బరువు తగ్గిన వెంటనే వారికి వెయ్యి వరహాలు ఇస్తాను' అన్నాడు. వైద్యులంతా ఆశ్చర్యపోయారు. 'అంతేనా మహాప్రభూ' అని ఒకతను మూలికావైద్యం చేశాడు. మరికొందరు వేర్లు, ఇంకొందరు ఇతర మందులు ఇచ్చారు. 'ఆర్నెళ్లు ఆగితే తగ్గుతారు' అన్నారంతా. వైద్యులు ఇచ్చిన మందులను రాజుగారు తిన్నారు. అయినా బరువు తగ్గలేదు. ఆర్నెళ్లు కాదు కదా... మరో రెండు నెలలు ఎక్కువయినా బరువు తగ్గలేదు. దీంతో వైద్యులపై మండిపడ్డాడు. సైనికులను పంపి వైద్యులను తీసుకొచ్చి బంధించేశాడు. వైద్యులంతా లబోదిబోమని ఎంతో మొత్తు కున్నారు.



మరుసటి రోజు ఓ వైద్యుడికి ఈ విషయం తెలిసింది. రాజుగారి దగ్గరకు వచ్చారు. రాజుగారి వాలకం. బరువు చూశాడు. 'అయ్యా.. మీరు ఆర్నెళ్లలో చనిపోతారు' అన్నాడు. 'ఆర్నెళ్లలో చనిపోకపోతే నిన్ను చంపేస్తా' అన్నాడు కోపంగా. వెంటనే ఈ వైద్యున్ని కూడా ఖారాగారంకు పంపమని చెప్పాడు. నిర్దాక్షిణ్యంగా వైద్యులను బంధించకండి అంటూ మంత్రి సెలవు ఇచ్చినా రాజు కరుణించలేదు. ఆ రోజు రాత్రి రాజుకు నిద్రపట్టలేదు. నిజంగా ఆర్నెళ్లకు చనిపోతానా? అనే బాధ పట్టుకుంది. ఎంతో ఆలోచించాడు. వారం రోజుల తర్వాత తిండితిప్పలు తగ్గించాడు. మరణ భయం పట్టుకుంది మరింత. ఏమి చేయాలో అర్థం కావటం లేదు రాజుగారికి. తన సైన్యం, తన సంపదను పట్టించుకోలేదు. మరణం.. మరణం.. అనుకుంటూ మంచం మీద పడ్డాడు. అంతటి రాజుగారికి ఇలా అయిందని కుటుంబీకులు బాధపడ్డారు. చూస్తుండగానే ఆర్నెళ్లు గడిచిపోయాయి. రాజుగారు మంచంమీద అలానే ఉన్నారు.

'నేను ఆర్నెళ్లకు మరణిస్తానని చెప్పిన వైద్యుడిని తీసుకురమ్మన్నాడు. వెంటనే ఇతన్ని నరికేయండి అన్నాడు. వెంటనే ఆ వైద్యుడు ఇలా అన్నాడు.. 'ఇంత మంది వైద్యులను బంధించావు. నీవు భోజన ప్రియుడివి కాబట్టి బరువు పెరిగావు. వాళ్ల వైద్యం నీ మీద పని చేయకపోతే ఇలా చేస్తావా? నేను ఒక్కమాట మాత్రమే అన్నాను. ఆర్నెళ్లకు చనిపోతావని అంటే.. బాధపడ్డారు. ముందు నన్ను చంపటం కంటే..మీరు ఇంత బరువు తగ్గటం చూసుకోండని వైద్యుడు చెప్పాడు. రాజుకు విషయం అర్థమైంది. ఇక నాకు జీవితం ఉందని అంటూ.. ఆ వెయ్యి వరహాలను ఆ వైద్యుడికి ఇచ్చాడు. 'నీ చమత్కారానికి ఈ బహుమానం' అన్నాడు రాజుగారు.. ఆ వైద్యున్ని చూస్తూ!







డైలీ సుడోకు - 226

		6	3		7		4	
			4	5	8			3
			6				1	
	2	8				3		5
	5	3				1	8	
7		9				4	2	
	8				6			
5			7	4	2			
	3		8		5	7		

సుడోకు - 225 సమాధానం

9	1	4	6	3	7	2	8	5
3	5	8	2	4	1	9	7	6
2	7	6	9	5	8	3	1	4
7	2	5	3	1	6	8	4	9
1	8	3	4	7	9	6	5	2
4	6	9	5	8	2	7	3	1
8	3	2	1	9	4	5	6	7
5	9	1	7	6	3	4	2	8
6	4	7	8	2	5	1	9	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.